VOICE OF TELUGU PEOPLE

FOR THE STATE OF THE STATE BY THE STATE

# నమస్తే ఆంధ్ర.కామ్

NAMASTEANDHRA.COM

VOL 18 ✭ ISSUE 8 ✭ FEB 2025



## వికేంద్రీకరణ దిశగా.. 6

## ఎట్టకేలకు గ్రామాలకు ఆర్థిక స్వేచ్ఛ 10

## విద్యాసంస్కరణలకు పదును 3



16

## బాబుకు 'భూ'ముప్పు!!

జగన్ రీసర్వే బాధితులకు దొరకని న్యాయం

## తెలంగాణ క్యాబినెట్ విస్తరణ కాదు.. ప్రక్షాళన?



19



20

## అమరావతిపై అదే విషం!

జగన్‌కు ఎందుకంత ద్వేషం?


ASBL
LANDMARK
THE GREAT
UPGRADE
6.6 Sprawling Acres
G+19 & 20 Floors
3, 3.5, 4 BHKs
CLUBHOUSE
NEW
LIFESTYLE
Designed to give you more amenities per flat, with
35+ Amenities to cater to your every want. Including -
Temple and Cultural Workshop, Party Halls and
a Panchatantra Kids play area and many more...
0
ZERO
BURDEN
OFFER!
₹2.4 Cr
ONWARDS

# విద్యాసంస్కరణలకు పదును



ఇంటర్, పాఠశాల విద్యలో సమూల మార్పులు
ఫస్టియర్ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు
పాఠశాలల్లో మెంటార్ వ్యవస్థ
పూర్వ విద్యార్థులు, స్కూళ్ల అభివృద్ధి కాంక్షించే వారితో ఏర్పాటు
టీచర్లకు ఇకపై ఒకటే యాప్

నవ్యాంధ్రలో జగన్ ఏలుబడిలో ధ్వంసమైన విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం పెద్దఎత్తున ప్రయత్నాలు ప్రారంభించింది, ముఖ్యంగా మానవ వనరులు, ఐటీ మంత్రి లోకేశ్ ఈ విషయంలో కేవలం అధికారులపైనే ఆధారపడకుండా నేరుగా అధ్యాపకులు, ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, విద్యార్థులను కూడా తన కసరత్తులో భాగస్వాములను చేశారు. కీలకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా ఇంటర్మీడియట్ విద్యా సంవత్సరంలో సమూల మార్పులు తలపెట్టారు. ప్రస్తుతం పబ్లిక్ పరీక్షలు ముగియగానే ఇంటర్ కాలేజీలకు వేసవి సెలవులు ఇచ్చి, తిరిగి జూన్ 1 కాలేజీలు తెరిచే విధానం ఉంది. అయితే అడ్మిషన్ల విషయంలో ప్రైవేటు కాలేజీలతో పోటీపడాలనే లక్ష్యంతో పరీక్షలు ముగియగానే కాలేజీలకు సెలవులు ఇవ్వకుండా తర్వాతి విద్యా సంవత్సరాన్ని ప్రారంభించే విధానాన్ని ఇంటర్ బోర్డు తీసుకొచ్చింది. ఇకపై మార్చి చివరిలో పరీక్షలు ముగిసిన తర్వాత ఏప్రిల్ 1న కాలేజీలు ప్రారంభమవుతాయి. 2025-26 విద్యా సంవత్సరాన్ని వచ్చే ఏప్రిల్‌లోనే మొదలుపెట్టనున్నారు. సెకెండియర్ విద్యార్థులకు రెగ్యులర్ తరగతులు నిర్వహిస్తారు. ఫస్టియర్ విద్యార్థులకు ఏప్రిల్ 5 నుంచి అడ్మిషన్లు తీసుకుంటారు. ఫస్టియర్‌లో చేరిన వారికి ఇంగ్లీష్, గణితంపై బ్రిడ్జి కోర్సు ప్రారంభిస్తారు. ఏప్రిల్ 22 వరకు తరగతులు నిర్వహించి 23 నుంచి మే నెలాఖరు వరకు వేసవి సెలవులు ఇస్తారు. జూన్ 1న విద్యాసంవత్సరం తిరిగి కొనసాగుతుంది. దీనివల్ల ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్లు పెరుగుతాయని బోర్డు భావిస్తోంది. అలాగే సెకెండియర్ విద్యార్థులకు కొంత సిలబస్ పూర్తిచేయడం వల్ల సెలవుల్లో వారు చదువుకునే వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ మార్పులకు అనుగుణంగా టైమ్‌టేబుల్ రూపొందించుకోవాలని ప్రభుత్వ జూనియర్ కాలేజీలను ప్రిన్సిపాళ్లకు ఇంటర్ బోర్డు ఆదేశాలు జారీచేసింది. ఇది ఉత్తమ విధానమని అధ్యాపకులు, విద్యార్థులు కూడా అభిప్రాయపడుతున్నారు. అభ్యసన ప్రక్రియకు బ్రేకు పడకుండా.. విద్యార్థులకు బాగానే ఉపకరిస్తుందని.. ఇదే సమయంలో అధ్యాపకులు కూడా సబ్జెక్టుపై మరింత అధ్యయనం చేసి పిల్లలకు సులువుగా బోధించే ప్రక్రియను మెరుగుపరిచేందుకు వీలుంటుందని భావిస్తున్నారు.

### మెంటార్ వ్యవస్థకు శ్రీకారం

ఇంకోవైపు..పాఠశాల విద్యలోనూ మార్పులు తలపెట్టారు. పూర్వ విద్యార్థులు, పాఠశాలల అభివృద్ధిని కాంక్షించే వారితో మెంటార్ల వ్యవస్థను రూపొందించాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఆంధ్రా మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ బ్లూప్రింట్‌లో భాగంగా ఆ వ్యవస్థను తీసుకురానున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి ముందుకొచ్చే దాతలకు విద్యా సంస్థల సమగ్ర సమాచారం, మౌలిక వసతుల అవసరాల వివరాలను అధికారులు అందించాల్సి ఉంటుంది. నేరుగా విద్యా సంస్థలకే విరాళాలు అందించే వ్యవస్థ తీసుకురాబోతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు విద్యార్థులకు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అన్ని పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు, స్టెమ్ ల్యాబ్‌లు, స్కూల్ లైబ్రరీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. జగన్ తన హయాంలో దాదాపు 58 యాప్‌లు పెట్టి ఉపాధ్యాయులను పట్టి పీడించిన సంగతి తెలిసిందే. ఆ దుర్భర పరిస్థితి నుంచి వారికి లోకేశ్ విముక్తి కల్పించారు. టీచర్లకు ఇకపై ఒకే

యాప్ ఉండనుంది. వారు బోధన, హాజరు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు ఎక్కువ సమయం కేటాయించేలా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. 'పెద్ద పాఠశాలల్లో ఎస్టేట్ మేనేజర్ల వ్యవస్థను ప్రవేశపెట్టాలి. పాఠశాల విద్యాశాఖకు సంబంధించిన అన్ని అంశాలను ఏకీకృతం చేసేలా ఒకే డ్యాష్‌బోర్డు రూపొందించాలి. ఒకే సమాచారం పదే పదే సేకరించే పద్ధతికి స్వస్తి పలకాలి. మోడల్ ప్రైమరీ స్కూళ్లను గరిష్ఠ స్థాయిలో ఏర్పాటుచేసి, ప్రతి తరగతికి ఒక టీచర్‌ను కేటాయించాలి. ఏకోపాధ్యాయ పాఠశాలలను క్రమంగా తగ్గించేలా చర్యలు తీసుకోవాలి' అని స్పష్టం చేశారు.

### జోన్ల వారీగా మధ్యాహ్న భోజనం మెనూ

ఇంకోవైపు.. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకంలో ఇకపై మెనూలను జోన్ల వారీగా అమలుచేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఒకటే మెనూ అమల్లో ఉంది. అయితే ఆయా ప్రాంతాల్లో ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా జోన్ల వారీగా కొత్త మెనూలు అమలు చేయాలని నిర్ణయించారు. విద్యా సంవత్సరం చివరకు వచ్చిన నేపథ్యంలో ఇక నుంచి వేసవి సెలవుల వరకు ట్రయల్ రన్ కింద జోన్ల వారీ మెనూలు అమలుచేస్తారు. ఈ సందర్భంగా కొత్త మెనూలపై అభిప్రాయాలు తీసుకుని అందుకు అనుగుణంగా మార్పులు చేపడతారు. జోన్ 1లో ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలు, జోన్ 2లో ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలు, జోన్ 3లో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు, జోన్ 4లో ఉమ్మడి రాయలసీమ జిల్లాలు ఉంటాయి.










# ఇలాగైతే కష్టమే!

## తనపై ఫైబర్‌నెట్ కేసు పెట్టినా చంద్రబాబు స్పందించరా?
## జగన్ తాబేదార్లను రక్షించాల్సిన అవసరమేంటి?
## ఒకట్రెండు కాదు.. ఏకంగా 4 శాఖలు అప్పగిస్తారా?
## వైసీపీ కార్యకర్తలకు నెలల తరబడి జీతాలిస్తున్న అధికారికి అందలమా?
## అది బయటపెట్టిన టీడీపీ నేత తొలగింపా?
## టీడీపీ శ్రేణులకు సీఎం ఇస్తున్న సంకేతమేంటి?

స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కేసులో నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబును జగన్ అక్రమంగా ఇరికించి 2023 సెప్టెంబరు 9వ తేదీ అర్ధరాత్రి నంద్యాలలో సీఐడీతో అరెస్టుచేయించి 52 రోజులు రాజమండ్రి సెంట్రల్ జైల్లో పడేశారు. ఈ పరిణామం చివరకు వైసీపీ అధినేత పతనానికే దారితీయడం వేరే సంగతి. నిరుడు ఎన్నికలకు రెండు నెలల ముందు ఫిబ్రవరిలో చంద్రబాబుపై ఫైబర్‌నెట్ కేసు పెట్టారు. టెండర్ ప్రక్రియలో రూ.110 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ఐదేళ్లుగా వైసీపీ దాడులు, హత్యలు, దౌర్జన్యాలు, తప్పుడు కేసులతో విలవిలలాడిన టీడీపీ శ్రేణులు.. బాబు అరెస్టు, ఆయనపై తప్పుడు కేసులు పెట్టడంతో ఎన్నికల్లో కసిగా పనిచేశారు. టీడీపీ అభ్యర్థులనే గాక.. మిత్రపక్షాల అభ్యర్థులను సైతం గెలిపించారు. చంద్రబాబు తిరిగి సీఎం అయ్యాక.. అక్రమ కేసులు బనాయించిన నేతలు, అధికారులపై చర్యల కోసం ఎదురుచూస్తున్నారు. కానీ వారి ఆశలు అడియాసలయ్యాయి. కక్ష సాధింపు రాజకీయాలు తగవంటూ చంద్రబాబు హితోక్తులు చెప్పడం మొదలుపెట్టారు. అరెస్టులు, కేసులతో శాంతిభద్రతలు అదుపు తప్పితే పెట్టుబడులు రావన్నది ఆయన భయం. అయితే ఈ క్రమంలో ఆయన దారితప్పిన అధికారులకు అందలమెక్కిస్తున్నారు. ఇది పార్టీ నేతలను, శ్రేణులను తీవ్రంగా నిరాశపరుస్తోంది. ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లో తాజాగా చోటుచేసుకున్న పరిణామాలు సీఎంపై టీడీపీ శ్రేణుల్లో అసంతృప్తికి దారితీశాయి.

### ఏం జరిగింది..?

ఐదేళ్లు జగన్ ప్రాపకంలో బతికిన అధికారులు కొందరు ఇప్పటికీ ఆయన కోసమే పనిచేస్తున్నట్లు కనిపిస్తోంది. ఏపీ ఫైబర్‌నెట్‌లో అవకతవకలు జరిగాయంటూ చంద్రబాబుపై పెట్టిన కేసు తమ మెడకు చుట్టుకుంటుందేమోనన్న భయంతో వారు కుయుక్తులకు దిగారన్న అనుమానాలు టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి, ఫైబర్‌నెట్ కార్పొరేసన్ చైర్మన్ జీవీరెడ్డికి వచ్చాయి. దానిని దివాలా తీయించి మూసివేసేందుకు చూస్తున్నారని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, ఐఏఎస్ దినేశకుమార్‌పై బహిరంగంగానే తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర పన్నుతూ రాజద్రోహానికి పాల్పడుతున్నారని చెప్పారు. ఇందులో కొంత వాస్తవం ఉందని ఉన్నతాధికారులకు కూడా తెలుసు. ఎండీగా సంస్థను అభివృద్ధి చేయాల్సిన ఆయన.. బాధ్యతలు చేపట్టిన తర్వాత సంస్థ ప్రయోజనాలు కాపాడే నిర్ణయం ఒక్కటీ తీసుకోలేదు. ఏనుగులాగా ఉన్న ఫైబర్‌నెట్‌ను పీనుగలాగా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి నిరంతరం ఫైబర్‌నెట్ సంస్థను లాభాల బాట పట్టించేందుకు కృషి చేస్తుంటే సంస్థ ఎండీ దినేశ్ కుమార్ మాత్రం సంస్థ పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఆయనతో పాటు పనిచేసే మరో ముగ్గురు.. ఫైబర్‌నెట్ చీఫ్ టెక్నాలజీ అధికారి పప్పు సత్యరామ భరద్వాజ్, బిజినెస్ హెడ్ గంధంశెట్టి సురేశ, అసిస్టెంట్ మేనేజర్ శశాంక్ హైదర్‌ఖాన్ కూడా సంస్థ నష్టపోయేలా వ్యవహరించారు. ఈ ముగ్గురినీ జీవీరెడ్డి విధుల నుంచి తొలగించారు. ఇక ఏపీ ఫైబర్‌నెట్‌లో గత యాజమాన్యం హయాంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణకు చంద్రబాబు ప్రభుత్వం ఆదేశించింది. దినేశ్‌కుమార్, ఇతర అధికారులు ఇందుకు సహకరించలేదు. దీనిపై జీవీరెడ్డే జోక్యం చేసుకుని విజిలెన్స్ విచారణకు సహకరించకుంటే తీవ్ర చర్యలు తప్పవని సర్క్యులర్ ఇచ్చిన తర్వాత అధికారులు కొంత సహకరించడం మెదలుపెట్టారు. కార్పొరేషన్లో ఇక ఎలాంటి చెల్లింపులూ చేయొద్దని విజిలెన్స్ సూచించిన తర్వాత కూడా దినేశ్ రూ.60 కోట్లు చెల్లించారు. ఆయన గత ఏడాది ఆగస్టులో ఎండీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకూ ఒక్క కనెక్షన్ కూడా పెంచలేదు. పైగా ఉన్నవి కూడా పోయేలా సమస్యలు సృష్టిస్తున్నారని జీవీ రెడ్డి ధ్వజమెత్తారు. ఆయన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఫైబర్‌నెట్‌లో 400 మందికి పైగా ఉద్యోగులను తొలగించారు. వీరంతా వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలే. పనిచేసేది ఆ పార్టీకి.. జీతాలు మాత్రం ప్రభుత్వానికి చెందిన ఫైబర్‌నెట్ కార్పొరేషన్ నుంచి చెల్లిస్తున్నారు. అయితే 400 మందిని తొలగించినా వారికి దినేశ్‌కుమార్ జీతాల చెల్లింపు కొనసాగించారు. విధులకు రాని ఉద్యోగులను తీసివేయాలని చైర్మన్ ఆదేశాలిచ్చిన తర్వాత కూడా మూడు నెలలుగా వారికి జీతాలు చెల్లించడం గమనార్హం. పైగా జీఎస్టీ అధికారులు ఇచ్చిన నోటీసులకు అధికారులు స్పందించకపోవడంతో సంస్థపై రూ.377 కోట్ల జరిమానా పడింది. ఇంత భారీగా ఫైన్ విధిస్తే దానిని జీవీరెడ్డి దృష్టికి అధికారులు తీసుకెళ్లలేదు. అలాగే సంస్థకు సంబంధించిన ఐటీ రిటర్న్‌లు కూడా దాఖలు చేయలేదు. దీంతో ఆయనే అధికారులను అప్రమత్తం చేశారు. దీనివల్ల సంస్థకు రూ.30 కోట్లు ఆదా అయ్యాయి. జగన్ అధికారంలో నుంచి దిగిపోయినా అధికారులు ఇంకా ఆయన అడుగులకు మడుగులొత్తుతున్నారన్నది జీవీరెడ్డి ప్రధాన ఆరోపణ. గత యాజమాన్య హయాంలో జరిగిన అక్రమాలపై కేసులు లేకుండా చేసేందుకు ఏకంగా సంస్థనే మూసివేసే కుట్ర చేస్తున్నారని కూడా అన్నారు. ఫైబర్‌నెట్‌కు గతంలో 12 లక్షల కనెక్షన్లు ఉండేవి. జగన్ పుణ్యమా అని నాలుగున్నర లక్షలకు పడిపోయింది. దినేశ్‌కుమార్ వంటి అధికారుల తీరుతో ఉన్నవి కూడా పోయే ప్రమాదం ఏర్పడింది. గత ప్రభుత్వం తొలగించిన ఎంఎసవోలు కాళ్లరిగేలా తిరుగుతున్నా వారిని కలిసేందుకు కూడా దినేశ్ కుమార్ సమయం ఇవ్వలేదు. తామే సెట్‌టాప్ బాక్సులు సమకూర్చుకుని.. కనెక్షన్లు తెచ్చుకుని నడుపుకొంటామని వారు విజ్ఞప్తి చేస్తున్నా ఆయన వినలేదు. చైర్మన్ స్వయంగా వారికి అవకాశమివ్వాలని సిఫారసు చేసినా లెక్కచేయలేదు. ఈ సంస్థను సక్రమంగా నడిపితే రూ.2 వేల కోట్ల టర్నోవర్ జరుగుతుందని, కానీ ఇప్పుడు 200 కోట్ల బిజినెస్ కూడా చేసే పరిస్థితి లేకుండా దీనిని తయారు చేశారని జీవీరెడ్డి మండిపడ్డారు.




### మంత్రి ముందు పంచాయితీ

ఫైబర్‌నెట్ మేనేజింగ్ డైరెక్టర్ దినేశకుమార్‌పై ఆ సంస్థ చైర్మన జీవీరెడ్డి ఫిబ్రవరి 20న చేసిన రాజద్రోహం ఆరోపణలు ప్రభుత్వాన్ని ఇరుకునపడేశాయి. ఈ వ్యవహారంలో నిజానిజాలు రాబట్టేందుకు మర్నాడే వారిద్దరితో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఆర్యదర్శి యువరాజ్ సమావేశమయ్యారు. వివరణాత్మకంగా ఆధారాలతో కూడిన సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ పెద్దలతో సంప్రదించకుండా నేరుగా మీడియా ముందు దినేశకుమార్‌పై ఎందుకు ఆరోపణలు చేశారని జీవీరెడ్డిని మంత్రి ప్రశ్నించారు. అక్రమాల వెలికితీతలో ఎండీ సహకరించడం లేదని ఆయన వివరించారు. తాను మీడియా ముందు మాట్లాడిన ప్రతిమాటకూ ఆధారాలున్నాయని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం వాట్సాప్ మెసేజ్ ఆధారంగా ఉద్యోగాలు ఇచ్చేశారని.. ఉద్యోగ నియామక పత్రాలే లేని 410 మందిని తొలగించేందుకు ఎలాంటి అభ్యంతరాలూ లేనప్పటికీ.. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వారిని కొనసాగిస్తూ జీతభత్యాలు చెల్లిస్తున్నారని ఫిర్యాదు చేశారు. జీఎస్టీ, ఆదాయ పన్ను అంశాలపై ఇప్పటికే .. తన వాదనను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్,

కార్యదర్శి యువరాజ్‌కు వెల్లడించానని చెప్పారు. ఫైబర్‌నెట్ ఆర్థికంగా బలోపేతం కావాలంటే ఎండీ దినేశకుమార్‌ను బదిలీ చూయాలని సూచించారు. తన ఆరోపణలకు ఆధారాలను ఆయన మంత్రికి ఆ మధ్యాహ్నమే అందజేశారు. అటు దినేశ్‌కుమార్‌ను కూడా సంజాయిషీ కోరారు. గతంలో జీఎస్టీ వ్యవహారాలు చూస్తున్న కన్సల్టెన్సీ సంస్థకు సకాలంలో ఫీజు చెల్లింపులు జరిగేలా చూసే బాధ్యత సంస్థదేనని ఆయన చెప్పారు. 22వ తేదీన జీవీరెడ్డి సచివాలయంలో సీఎం చంద్రబాబను కలిశారు. 'నాకంతా తెలుసు. ఫైబర్‌నెట్‌లో అసలేం జరిగిందో నాకు నిఘా సమాచారం ఉంది. మీరు తెలివైనవారు. మీ తెలివితేటలను సంస్థ పురోభివృద్ధికి ఉపయోగించండి. పార్టీ కోసం మీరు చేసిన కృషి నాకు తెలుసు. మంత్రి జనార్ధన్‌రెడ్డితో కలిసి సమన్వయంతో పని చేసుకోండి' అని జీవీ రెడ్డికి చంద్రబాబు సూచించారు.



### ఇద్దరికీ ఉద్వాసన

అయితే తమ అధినేతపై అక్రమ కేసు పెట్టిన వ్యవహారంలో ఇదివరకటి చైర్మన్ గౌతమ్‌రెడ్డిని, అధికారులను చట్టపరంగా శిక్షించేందుకు జీవీరెడ్డి చేసిన ప్రయత్నాలకు తన ప్రభుత్వం నుంచే సహకారం అందకపోవడంతో ఆయన మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. వెంటనే చైర్మన్ పదవికి, టీడీపీకి, పార్టీ పదవులకు కూడా ఆయన 24న రాజీనామా చేసేశారు. ఇకపై తాను న్యాయవాద వృత్తికి పరిమితమవుతానని, ఏ రాజకీయ పార్టీలోనూ చేరనని రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వం దానిని వెంటనే ఆమోదించింది. ఇదే సమయంలో జీవీరెడ్డి కోరినట్లుగా దినేశ కుమార్‌ను బదిలీచేసి, జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.

### చినికి చినికి...

యువకుడు, ఉత్సాహవంతుడైన జీవీ రెడ్డిని టీడీపీ తొలి నుంచీ ప్రోత్సహించింది. కాంగ్రెస్ నుంచి వచ్చిన ఆయన్ను పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా నియమించడంతోపాటు.. టీవీ చానళ్ల చర్చలకు కూడా పంపేది. అధికారంలోకి రాగానే కీలకమైన ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌కు చైర్మన్‌గా నియమించింది. అయితే ప్రభుత్వ పెద్దలను సంప్రదించకుండా అత్యుత్సాహంతో సంస్థ ఎండీ దినేశ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేయడాన్ని అధిష్ఠానం, ప్రభుత్వం కూడా తప్పుబట్టాయి. అధికారులపై బహిరంగ ఆరోపణలు సరికాదని, సమయానుకూలంగా స్పందించాలని ఆయనకు సూచించాయి. సీఎం కూడా తనకంతా తెలుసని.. అధికారులతో చెప్పి పనులు చేయించుకోవాలని హితవు పలికారు. అదే సమయంలో జీవీ రెడ్డి చెప్పిన విషయాలను పరిగణనలోనికి తీసుకుని దినేశ కుమార్‌తో మాట్లాడాలని సీఎంవో అధికారులను పురమాయించారు. కానీ ఈ సమాచారం తెలియకో, చంద్రబాబు తన వాదనను వినిపించుకోలేదన్న ఆక్రోశంతోనో జీవీ రెడ్డి తన పదవికి, పార్టీకి రాజీనామా చేసేశారు. తిరుపతిలో వైకుంఠద్వార దర్శనం టికెట్ల పంపిణీ సందర్భంగా తొక్కిసలాట జరిగాక టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు మధ్య విభేదాలు చంద్రబాబు సమక్షంలనే బట్టబయలయ్యాయి. దీనిని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నా.. ఇద్దరిపై చర్యల దాకా వెళ్లలేదు. గత అనుభవం నేపథ్యంలో ఫైబర్‌నెట్ చైర్మన్, ఎండీ మధ్య విభేదాలపై తీవ్రంగా స్పందించింది. జీవీ రెడ్డి రాజీనామాను అప్పటికప్పుడు ఆమోదించింది. దినేశకుమార్‌ను కూడా ఫైబర్‌నెట్ ఎండీ పోస్టు నుంచి తప్పించింది. నిజానికి... ఆయన ఉత్సాహంగా పని చేస్తారనే ఉద్దేశంతో ఏకంగా నాలుగు పోస్టులు కట్టబెట్టారు. అందులో... చంద్రబాబుకు ఎంతో ఇష్టమైన ఆర్టీజీఎస్ సీఈవోగానే గాక డ్రోన కార్పొరేషన, ఏపీ గ్యాస్ ఇనఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషనలకు ఎండీగా కూడా నియమించారు. ఇప్పుడా నాలుగు బాధ్యతల నుంచి తప్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వు జారీ చేశారు. ఏకంగా జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న దినేశకుమార్.. వాటికే అధిక ప్రాధాన్యమిచ్చి ఫైబర్‌నెట్ వ్యవహారాలు పట్టించుకోలేదు. వైసీపీకి ఎన్నికల్లో ప్రయోజనం కోసం 'వ్యూహం' తీసి.. 'వ్యూస్'కు మించి సొమ్ములు తీసుకున్న సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మపై కేసు పెట్టాలని సంస్థ చైర్మనగా జీవీ రెడ్డి చేసిన సూచనలనూ దినేశ్‌కుమార్ లెక్కచేయలేదు. జగన జమానాలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవడంలోనూ మీనమేషాలు లెక్కించారు. చైర్మన్‌గా తాను తీసుకుంటున్న చొరవ, వేగానికి తగినట్లుగా దినేశ్ కుమార్ స్పందించడంలేదన్నది జీవీ రెడ్డి ప్రధాన అభ్యంతరం! ఈ క్రమంలోనే మీడియా ముందుకొచ్చి తీవ్ర విమర్శలు చేశారు. ఆ వివాదమే ఇప్పుడు చినికి చినికి గాలివానగా మారింది. ఎవరికి వారు ఇలా రచ్చకెక్కితే సహించేది లేదని సంకేతాలు పంపామని ప్రభుత్వం చెబుతోంది. కానీ జగన్ అక్రమాలపై ఏమీ చేయలేక పదవితోపాటు పార్టీకి కూడా రాజీనామా చేయడంతో జీవీరెడ్డిపై టీడీపీ కార్యకర్తల్లో సానుభూతి పెరిగింది. వారు ఏకంగా అధినేత తీరునే తప్పుబడుతున్నారు. జగన్ అక్రమాలపై ఊరూవాడా ఉద్యమించామని.. ఇప్పుడు చర్యలు తీసుకుంటే కక్ష సాధింపు అవుతుందని.. పెట్టుబడులు రావని అనడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులను నమ్ముకోవడంలో తప్పులేదని.. కానీ జగన్‌తో అంటకాగినవారిని అందలమెక్కించి.. కేడర్‌కు ఏం సందేశం ఇస్తున్నారని కొందరు సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా వ్యవహరిస్తే ముున్ముందు కష్టమేనని.. కేడర్ నిస్తేజమవుతుందని హెచ్చరిస్తున్నారు.

# థియేటర్లలో హిట్.. ఓటీటీలో బ్లాక్ బస్టర్

ఈ ఏడాది సంక్రాంతికి రిలీజైన నందమూరి బాలకృష్ణ చిత్రం 'డాకు మహారాజ్' ఆయన సక్సెస్ స్ట్రీక్‌ను కొనసాగించింది. పాజిటివ్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రానికి మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. కానీ 'సంక్రాంతికి వస్తున్నాం' వైపే ఫ్యామిలీ ఆడియన్స్ అంతా మొగ్గు చూపడంతో 'డాకు మహారాజ్'కు రాను రాను వసూళ్లు తగ్గిపోయాయి. లాంగ్ రన్ లేకపోయింది. దీంతో అనుకున్న దాని కంటే తక్కువ వసూళ్లతో సరిపెట్టుకుందా చిత్రం. కొన్ని ఏరియాల్లో స్వల్ప లాభాలు తెచ్చిపెట్టిన ఈ చిత్రం.. కొన్ని చోట్ల అతి కష్టం మీద బ్రేక్ ఈవెన్ అయింది. 'సంక్రాంతికి వస్తున్నాం' ఎఫెక్ట్‌కు తోడు సినిమాను చిత్ర బృందం సరిగా ప్రమోట్ చేయకపోవడం కూడా మైనస్ అయిందనే అభిప్రాయాలు అభిమానుల్లో వ్యక్తమయ్యాయి. ఐతే థియేటర్లలో ఓ మోస్తరు ఫలితాన్ని అందుకున్న 'డాకు మహారాజ్' ఓటీటీలో మాత్రం అదిరిపోయే స్పందన తెచ్చుకుంటోంది. ఇక్కడ దీన్ని బ్లాక్ బస్టర్ అని చెప్పొచ్చు.

స్ట్రీమింగ్ జెయింట్ నెట్ ఫ్లిక్స్ 'డాకు మహారాజ్'ను డిజిటల్‌గా రిలీజ్ చేసింది. ఇలా స్ట్రీమింగ్‌కు వచ్చిందో లేదో.. ఈ మూవీ నెట్ ఫ్లిక్స్ చార్ట్స్‌లో ఇండియా నంబర్ వన్ స్థానానికి చేరుకుంది. తొలి వారమంతా అదే స్థానంలో కొనసాగింది. తెలుగు వాళ్లే కాక ఇతర భాషల వాళ్లు కూడా ఈ సినిమాను ఎగబడి చూస్తున్నారు. ఎక్స్‌లో అయితే డాకు గురించి బోలెడు పోస్టులు కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలోని కొన్ని మాస్ సీన్ల గురించి.. అలాగే బాలయ్య పెర్ఫామెన్స్, తమన్ బ్యాగ్రౌండ్ స్కోర్, బాబీ టేకింగ్ గురించి అందరూ గొప్పగా మాట్లాడుతున్నారు. మామూలుగా క్లాస్ చిత్రాలను ఎక్కువ ఇష్టపడతారని, మాస్ మూవీస్ ఆదరించరని పేరున్న మలయాళీలు 'డాకు మహారాజ్'ను విరగబడి చూస్తుండడం విశేషం. వేలమంది మలయాళ నెటిజన్లు ఈ సినిమా గురించి పోస్టులు పెడుతున్నారు. ఈ సినిమాలో ఎలివేషన్ సీన్లు.. విజువల్స్.. మ్యూజిక్.. బాలయ్య పెర్ఫామెన్స్.. డైరెక్షన్ గురించి మాట్లాడుతున్నారు. బాలయ్యలో ఇంత పవర్ ఉందని తమకు తెలియదని కామెంట్లు చేస్తుండడం విశేషం. ఇప్పటిదాకా బాలయ్యకు మలయాళంలో పెద్దగా గుర్తింపు లేదు. కానీ 'డాకు మహారాజ్'తో ఆయన కేరళలో మంచి ఫాలోయింగ్ సంపాదించేలా కనిపిస్తున్నారు. హిందీ ఆడియన్స్ సైతం 'డాకు..'ను బాగానే చూస్తున్నారు.





# వికేంద్రీకరణ దిశగా..

కర్నూలులో హైకోర్టు బెంచ్‌కు సన్నాహాలు
రిజిస్ట్రార్ ఆదేశాలతో అధికారులు పరుగులు
తాత్కాలిక భవనాలు, శాశ్వత నిర్మాణాలకు భూమి కోసం అన్వేషణ
శ్రీబాగ్ ఒప్పందంలో తొలిసారి హైకోర్టు ప్రస్తావన
రాష్ట్ర విభజనతో తిరిగి తెరపైకి ఆ డిమాండ్
'మూడు' ముక్కలాటతో జగన్ మోసం
టీడీపీ కూటమి రాగానే బెంచ్‌పై తీర్మానం
ప్రక్రియ ప్రారంభించాలని హైకోర్టుకు సూచన
న్యాయమూర్తులతో కమిటీ వేసిన సీజే



అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా చంద్రబాబు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అన్ని ప్రాంతాల్లో పరిశ్రమలు, ప్రాజెక్టులకు పెద్దపీట వేయడమే గాక.. కర్నూలులో హైకోర్టు బెంచ ఏర్పాటు చేస్తామన్న హామీ నెరవేర్చే ప్రక్రియను అమల్లో పెట్టింది. సదరు ప్రతిపాదనను తీర్మానంగా ప్రవేశపెట్టి అసెంబ్లీ ఆమోదం పొందింది. కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది. ఇదే సమయంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా లేఖ రాసింది. కేంద్రం పచ్చజెండా ఊపడంతో హైకోర్టు సీజే ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ (విజిలెన్స్) వి.శ్రీనివాస శివరాం కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజితబాషాకు ఓ లేఖ పంపారు. కర్నూలులో మొత్తం 15 మంది న్యాయమూర్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, కోర్టు కాంప్లెక్స్, కోర్టు గదులు, సిబ్బంది గదులు, న్యాయమూర్తులు, కోర్టు సిబ్బందికి నివాస సౌకర్యం, ఇతర సౌకర్యాలు, అడ్వకేట్లకు వసతికి సంబంధించి పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. టీడీఈపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే కర్నూలులో బెంచ్ ఏర్పాటు చేస్తామని ఎన్నికల ముందు ప్రజాగళం సభలో చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆ హామీకి కట్టుబడి అధికారంలోకి రాగానే గత ఏడాది నవంబరులో అసెంబ్లీలో తీర్మానం చేశారు. బెంచ ఏర్పాటు కోసం తక్షణ చర్యలు మొదలు పెట్టాలని కోరుతూ, హైకోర్టుకు లేఖ రాశారు. ఈ క్రమంలోనే హైకోర్టు రిజిస్ట్రార్ తాజాగా లేఖ రాశారు. బెంచ్ ఏర్పాటుకు సంబంధించి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ న్యాయమూర్తులతో ఏర్పాటు చేసిన కమిటీ ముందు ఉంచేందుకు ఆ నివేదికను అత్యవసరంగా పంపాలని స్పష్టం చేశారు. మద్రాసు నుంచి వేరుపడి ఆంధ్ర రాష్ట్రంగా అవతరించేందుకు జరిగిన ఉద్యమంలో భాగంగా 1937లో శ్రీబాగ్ ఒప్పందం జరిగింది. రాయలసీమలో రాజధాని పెడితే కోస్తాలో హైకోర్టు... కోస్తాలో రాజధాని పెడితే సీమలో హైకోర్టు పెట్టాలని మూడు ప్రాంతాల నాయకులు నాడు ఒప్పందం కుదుర్చుకున్నారు. 1953 అక్టోబరు 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం అవతరించింది. అప్పుడు గుంటూరులో హైకోర్టు ఏర్పాటుచేశారు. ఆ తర్వాత ఆంధ్ర, హైదరాబాద్ రాష్ట్రాలు విలీనమయ్యాయి. హైదరాబాద్ రాజధానిగా మారడంతో పాటు హైకోర్టుకు కూడా నెలవైంది. నాటి నుంచీ కర్నూలులో బెంచ్ ఏర్పాటు డిమాండ్ ఉంది. రాజకీయ నేతలు దీనిని తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటూ వచ్చారు. కర్నూలులో బెంచ్ కోసం న్యాయవాదులు ఉద్యమించినప్పుడల్లా.. విశాఖలో, గుంటూరులో కూడా బెంచ్‌లు ఏర్పాటుచేయాలంటే తమ మద్దతుదారులైన లాయర్లతో నిరసనలు చేయిస్తూ వచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత అప్పటి సీఎం చంద్రబాబు అమరావతిని రాజధానిగా ప్రకటించారు. కర్నూలులో బెంచ్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. అయితే రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం ఎన్డీఏతో తెగతెంపులు చేసుకోవడంతో మోదీ ప్రభుత్వం నవ్యాంధ్రకు సహాయ నిరాకరణ చేసింది. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు అటకెక్కించింది. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేస్తామన్న బీజేపీ హామీనీ తుంగలో తొక్కింది. చంద్రబాబుపై కోపంతో నాటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడానికి అన్ని విధాలుగా సహకరించింది. అమరావతిలోనే రాజధాని కొనసాగుతుందని హామీ ఇచ్చి.. తాడేపల్లిలో సొంత ప్యాలెస్ కూడా కట్టుకుని ప్రజలను నమ్మించిన జగన్.. గద్దెనెక్కగానే విశ్వరూపం ప్రదర్శించారు. మూడు రాజధానుల నాటకం ఆరంభించారు. అమరావతిలో అసెంబ్లీ, కర్నూలులో న్యాయ రాజధాని, విశాఖలో పాలనా రాజధాని అని ఊదరగొట్టారు. ఆ పేరుతో అమరావతి నిర్మాణాన్ని ఆపివేశారు. పోనీ కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు కేంద్రానికి లేఖ రాశారా అంటే అదీ లేదు. కనీసం అక్కడ భవనాలు, భూముల సేకరణ కూడా చేయలేదు. విశాఖలో సొంతానికి భూములు ఆక్రమించుకుని.. ప్రాజెక్టులను కూడా భయపెట్టి సొంతం చేసుకున్న జగన్, ఆయన అనుచర బృందం.. రుషికొండను తొలిచి రూ.600 కోట్ల వ్యయంతో సీఎం నివాసాన్ని నిర్మించుకుంది. జగన్ భార్య భారతిరెడ్డికి ఆ ప్రాంతం నచ్చిందని.. మరో 30 ఏళ్లు తానే సీఎంగా ఉంటానన్న భ్రమల్లో ఉన్న ఆయన.. హైకోర్టు, జాతీయ హరిత



ధర్మాసనం (ఎన్‌జీటీ) ఆదేశాలను లెక్కచేయకుండా.. అధికారులను గుప్పిట్లో పెట్టుకుని విశాఖ కార్పొరేషన్, ఏపీటీడీసీ నిధులన్నీ దాని నిర్మాణానికి మళ్లించారు. అసలు మూడు రాజధానులు చేసే అధికారం రాష్ట్రానికి లేదని.. అది కేంద్రం చేయాల్సిన పని అని.. విభజన చట్టంలో ఒక్క రాజధాని అని మాత్రమే ఉందని హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం అంతకుముందే తేల్చిచెప్పింది. ఆరు నెలల్లో అమరావతిని నిర్మించాలని తీర్పుఇచ్చింది. దీనిపై జగన్ సర్కారు సుప్రీంకోర్టుకు వెళ్తే.. గడువుపై మాత్రం స్టే విధించింది. మూడు రాజధానులపై హైకోర్టు ఇచ్చిన తీర్పుతో మాత్రం విభేదించలేదు. ఈలోపు 2024 ఎన్నికలు సమీపించడంతో జగన్ మాస్టర్ ప్లాన్ వేశారు. విశాఖ పాలనా రాజధానికి టీడీపీ అడ్డుకుందని.. మూడు రాజధానులను అడ్డుకుని కర్నూలుకు హైకోర్టు రాకుండా చేసిందని ప్రచారం చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూశారు. కానీ జనం నమ్మే పరిస్థితి లేకపోవడంతో

మూడు రాజధానుల బిల్లును ఉపసంహరించుకున్నారు. వాస్తవానికి ఆ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం మాత్రమే పొందారు. శాసనమండలి ఆమోదం తీసుకోకుండా సభలో అరాచకం సృష్టించారు. ఛైర్మన్ దానిని సెలెక్ట్ కమిటీకి నివేదిస్తే.. దీనిని తుంగలో తొక్కి తమ పార్టీ ఎమ్మెల్సీ ఛైర్మన్ అయ్యాక దానిని ఆమోదింపజేసేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. అప్పటికే ఈ అంశం హైకోర్టుకు వెళ్లడం.. ప్రొసీడింగ్స్ వివరాలివ్వాలని న్యాయస్థానం పదే పదే ఆదేశించినా మండలి కార్యదర్శి ఇవ్వకపోవడం వంటి విపరీత పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆ తర్వాత గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జగన్ ఘోర



పరాజయం పాలయ్యారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి చంద్రబాబు సారథ్యంలో అధికారంలోకి రావడంతో తిరిగి అమరావతి ఊపిరి పోసుకుంది. ఇదే సమయంలో పెట్టుబడులు మూడు ప్రాంతాలకు సరిసమానంగా వచ్చేలా చంద్రబాబు ప్రణాళిక రూపొందించారు. జరగాల్సింది రాజధాని వికేంద్రీకరణ కాదు.. అభివృద్ధి వికేంద్రీకరణ అని తేలిచెప్పారు. అదెలా ఉంటుందో ప్రణాళికాబద్ధంగా అమలుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే హైకోర్టులో బెంచ్ ఏర్పాటుకు నడుం బిగించారు. దీంతో జగన్ తన ప్లాన్ మార్చారు. విశాఖలోనూ హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో న్యాయవాదులను ఇప్పుడు ఉసిగొల్పుతున్నారు. ఆయన తండ్రి రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు కర్నూలులో బెంచ్ కోసం ఉద్యమం తారస్థాయికి వెళ్లినప్పుడు దానిని నిర్వీర్యం చేయడానికి విశాఖలోనూ బెంచ్ ఏర్పాటు డిమాండ్‌తో కాంగ్రెస్ శ్రేణులను, లాయర్లను రంగంలోకి దించారు. వారి ఉద్యమానికి అండగా నిలవడంతో చివరకు రాష్ట్రంలో బెంచ్ ఏర్పాటును సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఇప్పుడు జగన్ కూడా ఈ దోవలోనే వెళ్తున్నారు.

**భవనాల వేట..**

కర్నూలులో హైకోర్టు బెంచ ఏర్పాటు చేస్తే దాదాపు 15 మంది హైకోర్టు న్యాయమూర్తులు అక్కడకు వెళ్లాల్సి ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని అక్కడ ఇప్పటికే అధికారులు భవనాల వేట మొదలుపెట్టారు. కలెక్టర్ ఆదేశాలతో కర్నూలు ఆర్డీవో, రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్లు, కర్నూలు కార్పొరేషన్, రెవెన్యూ, ఎస్టాబ్లిష్‌మెంట్ అధికారులు పలు భవనాలు పరిశీలించారు. సదుపాయాల కల్పన కోసం ఖాళీ ప్రభుత్వ భూమి ఎక్కడ ఉందో గుర్తించి వివరాలు సమర్పించాలని ఆర్డీవోను ఆదేశించారు. తొలి ప్రాధాన్యంగా బీ క్యాంప్‌లోని క్లస్టర్ యూనివర్సిటీ నిధులతో నిర్మించిన 62 గదులు కలిగిన జీ2 భవనం బీ రెండో ప్రాధాన్యంగా దిన్నెదేవరపాడులో నిర్మించిన ఏపీఈఆర్సీ భవనం, మూడో ప్రాధాన్యంగా కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి నన్నూరు టోల్‌ప్లాజా దగ్గర 35 వేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన జీ3 ప్రైవేటు భవనాన్ని అధికారులు గుర్తించారు. వీటిలో టోల్‌ప్లాజా వద్ద ఉన్న భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఇప్పటికే ఓ బ్యాంకు అద్దెకు ఉంది. ఏపీఈఆర్సీ భవనంలో కమిషన్ కార్యకలాపాలు నడుస్తున్నాయి. దీంతో ఖాళీగా ఉన్న క్లస్టర్ యూనివర్సిటీ భవనం తక్షణమే తాత్కాలికంగా బెంచ ఏర్పాటుకు అనుకూలంగా ఉందని అధికారులు అంటున్నారు. అలాగే భవిష్యతలో శాశ్వత భవనాల నిర్మాణాల కోసం జగన్నాథగట్టుపై 26 ఎకరాలు, జొహరాపురం సమీపంలో 20 ఎకరాల నగరపాలక సంస్థ డంపింగ్ యార్డును పరిశీలించారు. డంపింగ్ యార్డులో ఖాళీ స్థలం ఉంది. అక్కడైతే అందరికీ అందుబాటులో ఉంటుందని అంటున్నారు. మరోవైపు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరీ, జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ బి.కృష్ణమోహన్‌తో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఓ కమిటీ ఏర్పాటు చేశారు. ఇది కూడా కసరత్తు ప్రారంభించింది. బెంచ్ ఏర్పాటుకు తాత్కాలికంగా, శాశ్వతంగా అవసరమైన మౌలిక వసతులు, భవనాలు, భూముల తదితర వివరాలను సిద్ధం చేస్తోంది. అధికారులు సమర్పించిన వివరాలను కూడా పరిశీలిస్తోంది. అది నివేదిక ఇవ్వగానే హైకోర్టు ఫుల్ బెంచ్ సమావేశమై.. కర్నూలు బెంచ్ ఏర్పాటుపై తుది నిర్ణయం తీసుకుంటుందని హైకోర్టు వర్గాలు చెబుతున్నాయి.


# మోక్షజ్ఞ.. ఈ ఏడాది లేనట్లేనా?

మెగాస్టార్ చిరంజీవి తనయుడు రామ్ చరణ్ ఎప్పుడో అరంగేట్రం చేసేశాడు. పెద్ద స్టార్ అయిపోయాడు. అక్కినేని నాగార్జున ఇద్దరు కొడుకులు కూడా హీరోలైపోయారు. విక్టరీ వెంకటేష్ కొడుకు ఇంకా యుక్త వయసుకు రాలేదు. ఆయన అన్న కొడుకు రాణా చాలా ఏళ్ల ముందే తెరంగేట్రం చేసేశాడు. ఇక టాలీవుడ్ నిన్నటితరం టాప్ హీరోల్లో నందమూరి బాలకృష్ణ వారసుడు మాత్రమే మిగిలాడు. ఆయన ముద్దుల కొడుకు మోక్షజ్ఞ తెరంగేట్రం గురించి చాలా ఏళ్ల నుంచి చర్చ జరుగుతోంది. ఎప్పుడో ఏడెనిమిదేళ్ల కిందటే అనుకున్న ఎంట్రీ.. 2025లో కూడా సాధ్యపడేలా లేదు. గత ఏడాది మోక్షజ్ఞ తొలి చిత్రం గురించి అధికారికంగా ప్రకటించి, అతడి ఫస్ట్ లుక్ కూడా రిలీజ్ చేయడంతో నందమూరి అభిమానులు ఎగ్జైట్ అయ్యారు. కానీ ముహూర్త కార్యక్రమానికి అంతా సిద్ధం చేసుకున్నాక అనివార్య కారణాలతో ఆ వేడుక వాయిదా పడింది.

ఇక అప్పట్నుంచి మోక్షజ్ఞ తొలి చిత్రంపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయాల్సిన ప్రశాంత్ వర్మ ఏడాదికి పైగా వేరే సినిమా చేయకుండా ఉండిపోయాడు. గత ఏడాది సంక్రాంతికి 'హనుమాన్'తో పలకరించిన అతను.. దీనికి కొనసాగింపుగా 'జై హనుమాన్' అనౌన్స్ చేశాడు. ఇంతలో అతడికి మోక్షజ్ఞను ఇంట్రడ్యూస్ చేసే బాధ్యత అప్పగించారు. అతను స్క్రిప్ట్ రెడీ చేసుకుని, ముహూర్త వేడుకకు అంతా సిద్ధం చేయించాడు. కానీ మోక్షు ఇంకా అరంగేట్రానికి రెడీ కాకపోవడంతో ఆ వేడుక రద్దయింది. ఇక అప్పట్నుంచి ఈ సినిమాపై సందిగ్ధత కొనసాగుతోంది. బాలయ్య కుటుంబం నుంచి పిలుపు కోసం ప్రశాంత్ వెయిట్ చేసి చేసి.. ఇక లాభం లేదని 'జై హనుమాన్'ను మొదలుపెట్టడానికి రెడీ అవుతున్నట్లు సమాచారం. అది పూర్తి చేసి ఆ తర్వాత మోక్షజ్ఞ డెబ్యూ మూవీని తనే డైరెక్ట్ చేస్తానని బాలయ్యకు చెప్పేశాడట. బాలయ్య కూడా అతణ్ని హోల్డ్ చేసే పరిస్థితి లేదని తెలుస్తోంది. మోక్షజ్ఞ తనకు మరింత సమయం కావాలని అడుగుతున్నట్లు సమాచారం. కాబట్టి 2025లో కూడా నందమూరి వారసుడి అరంగేట్రం లేనట్లే.






ONLY 2 MINUTES FROM BALANAGAR METRO STATION
Stay ahead of the traffic with effortless connectivity across the city
Nearby Hospitals
Landmark Hospital
Yashoda Hospital
Aster Prime Hospital
KIMS Hospital
Rainbow Children's Hospital
and many more
ASBL LANDMARK
The Great Upgrade
₹2.4 Cr
ONWARDS
5+
Schools
8+
IT Parks
11+
Entertainment Zones
1
2
20
50
080 452 48944
asbl.in/landmark


DIFFERENT ZONES FOR
DIFFERENT NEEDS
52000 sq. ft. of indoor amenities
& even more outdoors
ASBL
LANDMARK
Sports Zone
For the fitness enthusiast in you, we offer
multiple fitness studios including yoga,
Zumba, calisthenics, and more.
Tranquil Zone
Discover peace and serenity at our temple,
which is accompanied by a cultural workshop
space to celebrate traditional art forms.
Kids Zone
Where they grow as they play with
a Panchatantra-themed play area that's
fully padded for extra safety & more features
Practical Luxury Zone
Convenience at your doorstep, featuring
a co-working space, a clinic with
physiotherapy, a laundry room, and more.
₹2.4 Cr
ONWARDS
080 452 48944

నమస్తే ఆంధ్ర .కామ్
VOICE OF TELUGU PEOPLE
NAMASTEANDHRA.COM
FEB 2025



# ఎట్టకేలకు గ్రామాలకు ఆర్థిక స్వేచ్ఛ

చంద్రబాబు వచ్చాక పంచాయతీలకు అందుతున్న ఆర్థికసంఘం నిధులు

జగన్ జమానాలో వాటి సొమ్మంతా విద్యుత్ శాఖకు బదలాయింపు

తామొస్తే నేరుగా పంచాయతీలకు నిధులిస్తామన్న చంద్రబాబు

కూటమి అధికారంలోకి రాగానే అమలు

రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ లభించింది. జగన్ ఐదేళ్ల పాలనలో నిధుల్లేక నీరసించిన గ్రామ పంచాయతీలు.. ఇప్పుడిప్పుడే తమ ఖాతాల్లో డబ్బులు చూస్తున్నాయి. వాటిని వినియోగించి గ్రామాల్లో పనులు స్వేచ్ఛగా చేపట్టగలుగుతున్నారు. పంచాయతీలకు రాజ్యాంగపరంగా దక్కాల్సిన కేంద్రప్రభుత్వ నిధులను సైతం జగన్ ఇతర డీబీటీ పథకాలకుమళ్లించడంతో గ్రామాల్లో కనీసం తాగునీటి మోటార్లను మరమ్మతులు చేసుకోలేని దుస్థితిలో ఉండేవి. ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఉపముఖ్యమంత్రి-పంచాయతీరాజ్ మంత్రి పవనకల్యాణ్ చొరవతో పంచాయతీల్లో తాగునీటి, పారిశుధ్యం, రోడ్ల నిర్మాణాలతో పాటు 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి జీపీడీపీ మార్గదర్శకాల ప్రకారం పనులు జరుగుతున్నాయి. ఈ ఆర్థికసంఘం నిధులతో రాష్ట్రవ్యాప్తంగా ఈ 8 నెలల్లో 33,365 పనులు చేపట్టారు. వేగవంతంగా జరుగుతున్న ఈ పనులకు ఒకట్రెండు నెలల్లోనే నిధుల విడుదలకు పంచాయతీరాజ్‌శాఖ చర్యలు తీసుకుంది. పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ఆర్థిక సంఘం నిధులను ఎప్పటికప్పుడు కేంద్రం నుంచి రాబట్టుకునేందుకు పదే పదే ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారు. పవన కల్యాణ్ సైతం ఢిల్లీ వెళ్లినప్పుడు కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి, కేంద్ర ఆర్థికశాఖ మంత్రితో నిధుల విషయంపై వినతిపత్రాలు అందించారు. ఓ వైపు ముఖ్యమంత్రి చంద్రబాబు, మరో వైపు ఉపముఖ్యమంత్రి పదే పదే కేంద్రంతో సంప్రదింపులు చేపట్టడంతో.. ఎప్పటికప్పుడు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల అవుతున్నాయి. అధికారులు కూడా సమర్థంగా పనిచేస్తుండడంతో రాష్ట్రానికి గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన చెడ్డపేరు క్రమంగా తొలగుతోంది.

### వైసీపీ హయాంలో పంచాయతీ నిధులు డిస్కంకు..

జగన్ ప్రభుత్వంలో పంచాయతీల నిధులన్నీ వాటి అనుమతి లేకుండానే లాగేసుకుంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధుల్లో 2022-23 సంవత్సరం వరకు రూ.2,165 కోట్లు డిస్కంలకు చెల్లించాలంటూ దారి మళ్లించారు. వాటితో పాటు ఎల్ఈడీ వీధిలైట్ల ఏర్పాటు, నిర్వహణకు ఈఈఎస్ఎల్ సంస్థ కోసమంటూ మరో రూ.100 కోట్లు పంచాయతీ ఖాతాల్లో నుంచి తీసేసుకున్నారు.సర్పంచల ప్రమేయం లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం డిస్కంలకు చెల్లించడంతో అప్పట్లో వారు ఆందోళనకు దిగారు. ధర్నాలు, నిరసనలు చేసినా జగన్ ఖాతరు చేయలేదు. తమ పార్టీ వారే అయినప్పటికీ పోలీసులను ప్రయోగించి అణచివేశారు. దీంతో వైసీపీకి చెందిన సర్పంచలే తమ ప్రభుత్వంపై పోరాటానికి దిగారు. పంచాయతీ నిధులు దారిమళ్లిస్తోందని కేంద్రానికి వారు ఫిర్యాదులు చేయడంతో 2022-23 తర్వాత తానిచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా పంచాయతీల ఖాతాల్లోకి జమ చేయాలని కేంద్రం నిబంధనలు పెట్టింది. ఆ తర్వాత కూడా నాలుగు సార్లు 10 రోజుల పాటు ఆలస్యంగా నిధులు విడుదల చేశారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి రెండో విడత 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.998.64 కోట్లు 2024 మార్చిలో విడుదల చేస్తే వాటిని జగన్ సర్కారు 145 రోజులపాటు అంటే మే 30 దాకా విడుదల చేయలేదు. చివరకు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గత ఆగస్టు 21న నిధులు విడుదల చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్‌లు సంబరాలు చేసుకున్నారు.

### సజావుగా నిధుల విడుదల..


చంద్రబాబు సర్కార్ వచ్చిన తర్వాత 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల సజావుగా సాగుతోంది. 2024-25 సంవత్సరానికి సంబంధించి రెండు విడతల్లో రూ.2,109 కోట్లు విడుదల చేసింది. ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీలకు అందిస్తోంది. అయితే గతంలో మాదిరిగా డిస్కంలకు విచ్చలవిడిగా విద్యుత చార్జీలు చెల్లించే విధానానికి స్వస్తి పలకాలని సర్పంచులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గ్రామాల్లో తాము వాడని విద్యుతకు పంచాయతీల నుంచి వసూలు చేయడంపై నిరసన తెలుపుతున్నారు. ఆదాయాల్లేని గ్రామ పంచాయతీల నుంచి విద్యుత చార్జీల పేరిట రూ.లక్షలు వసూలు చేశారు. వందల సంఖ్యలో మైనర్ గ్రామ పంచాయతీలకు రావలసిన ఆర్థిక సంఘం నిధులన్నీ డిస్కంలకు చెల్లించారు. దీంతో ఆ పంచాయతీల సర్పంచులు లబోదిబోమన్నారు. పంచాయతీల నుంచి నేరుగా కరెంటు బకాయిలు మినహాయించుకునేందుకు అప్పట్లో ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతున్నారు. సీఎం కార్యాలయం సహకారంతో ఉపముఖ్యమంత్రి పవనకల్యాణ్ ఈ దిశగా కసరత్తు ప్రారంభించారు.

### వలంటీర్ వ్యవస్థతో పంచాయతీలు నిర్వీర్యం

జగన్ తన రాజకీయ లబ్ధి కోసం ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ పంచాయతీలను నిర్వీర్యం చేసింది. సర్పంచ్‌లు, కార్యదర్శితో










సంబంధం లేకుండా పథకాల లబ్ధిదారులను వలంటీర్లే నిర్ణయించే పరిస్థితి ఆనాడు నెలకొంది. దీనిపై నాడు హైకోర్టు కూడా ఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను నిర్ణయించేందుకు వారికున్న అధికారం ఏమిటని నిలదీసింది. వలంటీర్ వ్యవస్థకు చట్టబద్ధత ఉందా... వారు అసలు ప్రభుత్వ ఉద్యోగులేనా...సర్వీసు రూల్స్ ఉన్నాయా అని ప్రశ్నల వర్షం కురిపించింది. లబ్ధిదారుల ఎంపికలో వారి జోక్యం ఏమిటని నిలదీసింది. ఈ పనిచేయడానికి పంచాయతీరాజ్, ప్రభుత్వ యంత్రాంగం ఉన్నప్పుడు.. ప్రభుత్వ ఉద్యోగులే కాని వలంటీర్లతో లబ్ధిదారులను ఎందుకు ఎంపిక చేయిస్తున్నారని ప్రశ్నించింది. అలాగే వరదల సమయంలోనూ సాయానికి వలంటీర్లు కలిసి రాలేదు. జగన్ పనిగట్టుకుని మరీ నియమించుకున్న వీరు.. ఆపత్కాలంలో




గ్రామాల ప్రజలకు ముఖం చాటేశారు. ముఖ్యంగా ముంపు మండలాల్లో ఒక్కరంటే ఒక్కరు కూడా పనిచేయలేదు. కేవలం రెవెన్యూ ఉన్నత, కిందిస్థాయి సిబ్బందితోపాటు ఎన్డీఆర్ఎఫ్, పోలీసులను మాత్రమే అధికారులు నియమించారు. గోదావరి వరద సహాయ చర్యల్లోనూ వలంటీర్ల సేవలు అంతంత మాత్రమే. బాధితులకు భోజనం సమకూర్చే బాధ్యతలు సైతం వారికి అప్పగించలేదు. ఓట్లు కురిపించే పథకాల డబ్బులు పంచడానికి, ప్రతిపక్షాల సానుభూతిపరులను బెదిరించి తమ వైపు తిప్పుకోవడానికి మాత్రమే వారిని వాడుకున్నారు. కొన్ని చోట్ల పింఛను సొమ్ములు వారు కాజేయడంతో ఆ వ్యవస్థపై గ్రామాల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. వలంటీర్ వ్యవస్థ కాలపరిమితి 2023 ఆగస్టులోనే ముగిసింది. అంటే వ్యవస్థ రద్దయిపోయింది. కానీ జగన్ జీవోను పునరుద్ధరించలేదు. పైగా అక్రమంగా వారికి నెలనెలా వేతనాలు అందిస్తూ వచ్చారు. ఎన్నికల ప్రచారంలో వాడుకున్నారు. అయితే వారికి ఎన్నికల విధులు ఇవ్వకూడదని, వారికిచ్చిన మొబైల్ ఫోన్లను సరెండర్ చేయాలని, వారితో పెన్షన్ల పంపిణీ వద్దని ఎన్నికల కమిషన్ ఆదేశించడంతో.. వారు లేకపోతే పథకాలు రావని జగన్ ప్రచారం చేశారు. అప్పటి సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి కూడా కమిషన్ ఆదేశాలు అమలుచేయకుండా జగన్‌కు అండగా నిలిచారు. జగన్ తీరా ఓడిపోయాక వలంటీర్లను చంద్రబాబు తీసేశారని ప్రచారం మొదలుపెట్టారు. కానీ ఆ వ్యవస్థ ఇప్పుడు లేకపోయినా గ్రామ సచివాలయ సిబ్బంది ప్రతి నెలా ఒకటినే ఇళ్లకు వెళ్లి ప్రజలకు పెన్షన్లు ఇస్తున్నారు. పథకాల లబ్ధిదారుల ఎంపిక బాధ్యత కూడా నిర్వహిస్తున్నారు.

# 'భారీ' చిత్రాలకు దిల్ రాజు దండం

టాలీవుడ్లో మహామహులను వెనక్కి నెట్టి నంబర్ వన్ ప్రొడ్యూసర్ అనే ట్యాగ్ సంపాదించుకున్నాడు దిల్ రాజు. డిస్ట్రిబ్యూటర్‌గా ప్రయాణం మొదలుపెట్టి.. నిర్మాతగా మంచి మంచి సినిమాలు చేసి గొప్ప స్థాయికి ఎదిగాడాయన. 'దిల్', 'ఆర్య', 'భద్ర', 'బొమ్మరిల్లు', 'కొత్త బంగారు లోకం'.. ఇలా నిర్మాతగా తొలి రోజుల్లో ఆయన అద్భుతమైన సినిమాలను అందించారు. ఘనవిజయాలు అందుకున్నారు. ఆ తర్వాత పెద్ద స్టార్లతో భారీ చిత్రాలూ చేశారు. ఐతే ఏ నిర్మాతకైనా ఎప్పుడూ హిట్లే రావు. అప్పుడప్పుడూ ఎదురు దెబ్బలు తగులుతాయి. దిల్ రాజు కూడా ఇందుకు మినహాయింపు కాలేకపోయాడు. కానీ ఒక సినిమా పోయినా ఇంకో సినిమాతో రికవర్ అవుతూ వచ్చాడు రాజు. ఐతే గత కొన్నేళ్లలో మాత్రం రాజు ట్రాక్ రికార్డు బాగా దెబ్బ తినేసింది. వరుస ఫ్లాపులు ఆయన్ని వెనక్కి లాగాయి. రౌడీ బాయ్స్, జెర్సీ (హిందీ), హిట్ (హిందీ), థాంక్యూ, ఫ్యామిలీ స్టార్.. ఇలా చాలా ఫ్లాపులే పడ్డాయి రాజుకు. ఇవన్నీ ఒకెత్తయితే.. 'గేమ్ చేంజర్' కొట్టిన దెబ్బ మరో ఎత్తు.

'గేమ్ చేంజర్' ఏమీ విజువల్ వండర్ కాదు, గ్రాఫిక్స్‌తో ముడిపడ్డ ఈవెంట్ ఫిలిం కాదు. అయినా దానికి 400 కోట్ల బడ్జెట్ అయింది. ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. నాన్ థియేట్రికల్ రైట్స్‌తో ఎంత భర్తీ చేసుకుందామనుకున్నా వంద కోట్లకు తక్కువ కాకుండా నష్టపోయాడట రాజు. ఐతే సంక్రాంతికి ఈ సినిమా వచ్చినపుడే 'సంక్రాంతికి వస్తున్నాం' రిలీజై రాజును పెను ప్రమాదం నుంచి బయటపడేసింది. ఈ సినిమా ఇంత పెద్ద సక్సెస్ కాకపోయి ఉంటే రాజు కోలుకోలేని దెబ్బ తినేవారు. ఇండస్ట్రీలో ఆయన మనుగడే ప్రమాదంలో పడేదన్నది సన్నిహితుల మాట. గతంలో ఫెయిల్యూర్లు ఉన్నప్పటికీ 'గేమ్ చేంజర్' వ్యవహారం వేరు. శంకర్‌తో పెట్టుకుని దారుణంగా దెబ్బ తిన్నాడు రాజు. ఈ సినిమా అనుభవంతో ఆయన ఇప్పుడిప్పుడే పెద్ద స్టార్లు, డైరెక్టర్లతో భారీ చిత్రాలు చేయదలుచుకోవట్లేదట. ఒకప్పట్లా కథను నమ్మి మీడియం బడ్జెట్లో భిన్నమైన సినిమాలు చేయాలని.. ముఖ్యంగా 'సంక్రాంతికి వస్తున్నాం' తరహాలో ఫ్యామిలీ ఎంటర్టైనర్లు చేయాలని ఆయన ఫిక్సయ్యారట. పెద్ద స్టార్లతో రాజుకు ప్రస్తుతం ఇమ్మీడియట్ కమిట్మెంట్లు కూడా లేవు. ప్రభాస్ ఒక్కడే రాజుకు సినిమా చేయాల్సి ఉంది. కానీ అందుకు చాలా టైం ఉంది. ఈలోపు మిడ్ రేంజ్ సినిమాలతో మళ్లీ తనేంటో చాటిచెప్పాలని చూస్తున్నాడు.







# అధికారులపై నియంత్రణ ఏదీ?

**మంత్రులకేనా ర్యాంకులు.. బ్యూరోక్రాట్లకు లేవా?**
**వారి కార్యకలాపాలపై కొరవడిన ప్రభుత్వ పర్యవేక్షణ**
**శాఖలను సొంత రాజ్యంలా భావిస్తోన్న పెద్దసార్లు**
**ప్రభుత్వానికి ఏమీ తెలియదన్న ధీమాతో**
**కొందరు ప్రైవేటు వ్యాపారాలు**
**శుక్రవారం మధ్యాహ్నానికే హైదరాబాద్‌కు ప్యాకప్**
**సోమవారం మధ్యాహ్నం తర్వాతే ఆఫీసుకు**
**కీలకమైన ఫైళ్లు పార్కింగ్‌లో**
**వాటిపై సొంత టీములతో కార్యాచరణ**
**ఇలాగైతే అభివృద్ధి పరుగు ఎలా?**

కేంద్రస్థాయిలో సరిగా పనిచేయని అధికారులను మోదీ సర్కారు హెచ్చరిస్తోంది. అయినా తీరు మార్చుకోకుండా అక్రమాలకు పాల్పడేవారిని కంపల్సరీ రిటైర్‌మెంట్ కింద ఇంటికి పంపిస్తోంది. మరి అలాంటి పరిస్థితి నవ్యాంధ్రలో ఉందా? అఖిల భారత సర్వీసు, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసు కేడర్, గ్రూప్-1, ఇతర అధికారులపై ఇలాంటి నియంత్రణ, పర్యవేక్షణ ఇక్కడి ప్రభుత్వానికి ఉందా.. ఏ బ్యూరోక్రాట్ ఏ పని చేస్తున్నారు? ఆఫీసుకు ఏ సమయంలో వస్తున్నారు? ప్రభుత్వ పనే చేస్తున్నారా? ప్రైవేటు పనుల్లో నిమగ్నమయ్యారా? ఎన్ని ఫైళ్లను క్లియర్ చేశారు? ఏ ఫైలును, ఎందుకు ఆపారు? ఆన్‌లైన్ పార్కింగ్‌లో ఎన్ని ఫైళ్లు దాచిపెట్టారు.. ఇత్యాది కీలకమైన డేటా కూటమి ప్రభుత్వం వద్ద ఉందా అంటే లేదనే చెప్పాలి. అసలు అధికారుల పనితీరుపై పర్యవే క్షణే లే దు. మంత్రులే ప్రభుత్వ రథసార?థులు అన్నట్లుగా సీఎం చంద్రబాబు వారికి ర్యాంకులు ఇచ్చారు. కానీ ఆ మంత్రులను, ప్రభుత్వాన్ని కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా ముందుండి నడిపించే అధికార యంత్రాంగం పనితీరును మాత్రం పర్యవేక్షించడం లేదు. అసలా అంశాన్నే పరిగణనలోకి తీసుకుంటున్నట్లు కనిపించడం లేదు. గతంలో జగన్ సర్కారు అధికారుల పనితీరుపై ఎనలేని నిఘా, పర్యవేక్షణ సాగించింది. దీంతో అధికారుల్లో భయం, భక్తి ఉండేది. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక వారిపై పర్యవేక్షణ పోయింది. దీంతో కొందరు అధికారులు పేట్రేగిపోతున్నారు. మరికొందరు ప్రభుత్వ విధుల కంటే సొంత పనులు చక్కదిద్దుకోవడంపైనే ఎక్కువ దృష్టిపెడుతున్నారు. కొందరు జగన్ అనుకూల అధికారులు మరో అడుగు ముందుకేసి కుల, మత సంఘాల సమావేశాల ఏర్పాట్లతో బిజీగా ఉంటున్నారు. మరి కొందరు ప్రాంతాల వారీగా భేటీలు జరుపుకొంటున్నారు. తమను ప్రభుత్వం గమనిస్తోందన్న భయం లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి సర్కారు రాష్ట్రాభివృద్ధిని పరుగులు తీయించగలదా? అధికారులపై నియంత్రణ లేకపోతే.. అనుకున్న అద్భుత ఫలితాలను ప్రజలకు అందించగలగా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### నిర్ణయాధికారాలు అధికారులకే!

ఇటీవల చంద్రబాబు మంత్రులకు ర్యాంకులు కేటాయించారు. వారి శాఖల్లో ఫైళ్ల పరిష్కారం అధారంగా ర్యాంకింగ్‌లు ఇచ్చారు. నిజానికి మంత్రులు విధాన నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో చివరి సంతకం చేసేవారే. సంక్షేమ పథకాల అమలు, రాష్ట్రాభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన అమలు, ఫలితాలు రాబట్టడంలో కీలక పాత్రధారులు అధికారులే. ఓ విధాన నిర్ణయం అమలు ఉత్తర్వులు రూపంలోకి రావడనికి ముందు తుదిసంతకం చేసే మంత్రికి ర్యాంకు ఇచ్చిన సర్కారు, దాని వెనక 99 శాతం వర్క్‌చేసిన అధికారులకు ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. నిజానికి ఆయా ప్రభుత్వ శాఖలను మంత్రుల కన్నా కార్యదర్శులు, విభాగాధిపతులే నడిపిస్తున్నారు. నిర్ణయాధికారాలు వారి చేతుల్లోనే ఉన్నాయి. ఆ తర్వాత కిందిస్థాయి అధికారులు విధివిధానాల అమలు, కార్యాచరణలో భాగస్వాములుగా ఉన్నారు. కేవలం మంత్రులపైనే ప్రభుత్వ పర్యవేక్షణ ఉండి.. అధికార యంత్రాంగంపై లేకపోతే గతంలో జగన్ సర్కారులో జరిగిన తప్పులే పునరావృతమయ్యే ప్రమాదం ఉందని పరిపాలనా నిపుణులు, సీనియర్ అధికారులు అంటున్నారు. మంత్రులకు అటు తన సొంత నియోజకవర్గంలోని ప్రజలు, పార్టీ కార్యకర్తల యోగక్షేమాలతో పాటు ఇటు సచివాలయం, శాఖ వ్యవహారాలూ చూసుకోవాలి. అధికారులకు మాత్రం కేవలం పాలనా వ్యవహారాలు మాత్రమే ఉంటాయి. ఆఫీసే వారి ప్రపంచంగా ఉండాలి. ఇలా ఎంత మంది ఉంటున్నారన్నది ఇప్పుడు సర్వత్రా వ్యక్తమవుతున్న ప్రశ్న.

### ఇంకా అదే సంప్రదాయం..

జగన్ జమానా నాటి అడ్డగోలు సంప్రదాయం ఇంకా కొనసాగుతోంది. కొందరు అధికారులు హెడ్‌క్వార్టర్స్‌లో ఉండడం లేదు. హైదరాబాద్‌లో మకాం ఉంటూ అమరావతిలో అద్దెపొందుతున్నారు. ఇక కార్లకు కొదవే లేదు. ఒక్కో అధికారి ఇంట్లో ఐదారు కార్లు సర్వసాధారణం. జగన్ జమానాలో ఓ జూనియర్ అధికారి తన ఇంట్లో పనిచేసే పనోళ్లకు కూడా రెండు కార్లు వాడుకున్నారు. రెగ్యులర్ పోస్టుతోపాటు ఆయా శాఖల ఎఫ్ఏసీలు (పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు) పొందిన పెద్దసార్లు కొందరు ప్రభుత్వ కార్లను విచ్చలవిడి గా వినియోగిస్తున్నారు. ఇక వారి పనితీరుపై పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. సచివాలయంలో హాజరు వేయరు. కిందిస్థాయి అధికారులు, ఉద్యోగులను మాత్రం సమయ పాలన గురించి అదిరిస్తారు. కొందరు అధికారులు ఎప్పుడు ఆఫీసుకు వస్తారో.. ఏ సమయంలో ఎక్కడ ఉంటారో కూడా తెలియని పరిస్థితి. ప్రభుత్వం తమ పనితీరును గమనించడంలేదన్న ధీమాతో కొందరు అధికారులు ఆఫీసుకు సమయానికి రావడం లేదు. ఎక్కువ సేపు ఇంటినుంచే పనిచేస్తున్నారు. కొందరయితే విజిటింగ్ అవర్స్‌లో కూడా ప్రజలను కలవరు. అదేమని అడిగితే.. సారు బిజీ..! ముఖ్యమంత్రి సమీక్షలు ఉన్నాయనుకున్నప్పుడు మాత్రమే హడావుడిగా సచివాలయానికి వచ్చే అధికారులు కొందరు. ఆ తర్వాత వారు ఎవరికీ చిక్కరు.. దొరకరు. ఇంకొందరైతే ఫోన్లలోనూ అందుబాటులో ఉండరు. మరికొందరు శుక్రవారం మధ్యాహ్నామే హైదరాబాద్‌కు చెక్కేస్తున్నారు. శని, ఆదివారాల్లో ఎంజాయ్ చేసి తిరిగి సోమవారం నింపాదిగా అమరావతికి వస్తున్నారు. కొన్ని శాఖల్లో నిధుల దుర్వినియోగం, దుబారాపై ఆడిట్ పేరాలు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని బయటకు రానివ్వకుండా కొందరు అధికారులు సైలెంట్‌గా సెటిల్ చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం ఇస్తున్న నిధులు

ఏమవుతున్నాయో కనిపెట్టే వ్యవస్థలు కూడా నిర్వీర్యమైపోతున్నాయని సీనియర్ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు అనుభవం ఏమైనట్లని వారిలో కొందరు ప్రశ్నిస్తున్నారు.

**పోస్టులపైనే శ్రద్ధ..**

ప్రభుత్వం చెప్పే పనుల మీద కంటే కొందరు అధికారులకు ఆయా శాఖల పోస్టులపైనే మక్కువ ఎక్కువగా ఉంటోంది. ప్రభుత్వం ఒకటి తలిస్తే వీరు మరొకటి చేస్తున్నారు. ఇందుకు నామినేటెడ్ పోస్టుల భర్తీ, వేతనాలపై ఇచ్చిన ఉత్తర్వులే ప్రత్యక్ష నిదర్శనం. ప్రభుత్వం కార్పొరేషన్ల చైర్మన్లు, సభ్యుల పోస్టులను భర్తీచేసింది. అందులో కొందరికి 'ఏ' కేటగిరీ వేతనాలు, సదుపాయాలు, అలవెన్సులు ఇస్తే, మరి కొందరికి 'బీ' కేటగిరీ వనరులు కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. పద వులు పొందిన వారిలో ఇది ఆందోళన రాజేసింది. 'బీ' కేటగిరీ వేతనాలు, అలవెన్సులు పొందిన వారి మనసులు గాయపడేలా ఉత్తర్వులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై రచ్చ జరగడంతో ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. ఇలా ఎందుకు చేశారంటూ సర్కారు సీరియస్ అయ్యాక అప్పుడు తీరిగ్గా దిద్దుబాటు చర్యలు చేపట్టారు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు, సిబ్బంది అవమానంగానే భావిస్తున్నారు.

**కాసులు కురిపించే ఫైళ్లకే..**

ప్రజాసంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు సంబంధించి ప్రభుత్వం ఏదైనా కార్యక్రమం చేయాలనుకుంటే అధికారులు దానికి ఏర్పాట్లు చేయాల్సిందే. అందుకు



సంబంధించిన ఫైళ్లను ఆపడానికి వీల్లేదు. సందేహాలుంటే చర్చించుకుని పరిష్కరించాలి.. అంతే తప్ప ఫైళ్లను పెండింగ్‌లో పెట్టకూడదు. కానీ కొందరు అధికారుల తీరే విభిన్నంగా ఉంటోంది. ప్రభుత్వం ముందు జీ సార్ అంటారు. ఆఫీసుకు వచ్చాక కొర్రీలువేసి కిందకు తోసి పెండింగ్‌లో పడేస్తున్నారు. ప్రజాప్రయోజనాలు ముడిపడిన అంశాల్లోనే ఇలా చేయడం తీవ్రమైన అంశం. కొందరు అధికారుల ఇష్టాఇష్టాలు మరీ శ్రుతిమించుతున్నాయి. వ్యక్తిగతంగా కాసులు కురిపించే ఫైళ్లను భారీగా పెండింగ్ పెడుతున్నారు. దీనిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కొందరయితే ఫైళ్లు పెండింగ్ ఉన్నాయని తెలియకుండా కొన్నింటిని ఆన్‌లైన్ ఈ-ఆఫీస్ పార్కింగ్‌లో పెడుతున్నారు. ఈ ఫైళ్లను సెటిల్ చేయడం కోసం, తమకు అనుకూలమైన టీములను ఏర్పాటు చేసుకున్నారు. ఎవరు ఏ ఫైలును పెండింగ్ పెట్టారో కూడా ప్రభుత్వానికి తెలియని పరిస్థితి ఉందని సీనియర్ అధికారులు చెబుతున్నారు.

**పనిచేయకున్నా సకల సదుపాయాలు..**

గతంలో జగన్‌కు అనుకూలంగా పనిచేశారని కొందరు అధికారులకు చంద్రబాబు ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇవ్వకుండా పక్కనపెట్టింది. దీనివల్ల ఎవరికి ఉపయోగం? ఆ అధికారులకే. ఏ పనీ చేయకున్నా సకల సదుపాయాలు, అద్దెలు, భత్యాలు సహా చెల్లించాల్సిందే. అలాంటప్పుడు వారిని ఖాళీగా కూర్చోబెట్టడం దేనికన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఏపీలో అధికారుల కొరత ఉంది. కొందరిపై ఎక్కువ బాధ్యతలు మోపుతున్నారు. ఖాళీగా ఉన్న అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించి వారి పనితీరుపై పర్యవేక్షణ కొనసాగించవచ్చన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఏ పనీ లేకుండా ఖాళీగా ఉండే కొందరు ఎంచక్కా హైదరాబాద్ కేంద్రంగా వ్యాపారాలు చేసుకుంటున్నట్లు అధికార వర్గాల్లోనే చర్చ జరుగుతోంది. ప్రభుత్వమే వారికి అనధికారికంగా ఆ వెసులుబాటు కల్పించిందని, ఇందులో వారి తప్పేముందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**కులసంఘాల భేటీలతో బిజీ..**

గతంలో జగన్‌తో బాగా అంటకాగిన ఓ అధికారి ఇప్పుడు ఖాళీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన కులసంఘాల సమావేశంలో తరచూ పాల్గొంటున్నారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కులాలను రెచ్చగొట్టే బిజీలో ఆయన ఉన్నారు. ఆయన ఏం చేస్తున్నారో కూడా తెలియని స్థితిలో చంద్రబాబు సర్కారు ఉంది. సర్వీసులో ఉన్న ఓ అధికారి కుల, మత సమావేశాల్లో పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక ఉపన్యాసాలు ఇస్తున్నా పట్టించుకోవడం లేదంటే పర్యవేక్షణ, నియంత్రణ ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థమవుతోంది. గతంలో అధికారులు కులాలు, మతాలకు అతీతంగా కలిసేవారు. జగన్ జమానా నుంచి ఆ పద్ధతి మారింది. కులం, మతం, ప్రాంతం వారీగా అధికారుల కలయికలు సాగుతున్నాయి. ఇతర రాష్ట్రాల అధికారులు కూడా తమ ప్రాంతాల వారీగా భేటీలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంలో జవాబుదారీతనం మంత్రులకు ర్యాంకులు ఇస్తేనే వస్తుందా? కీలకమైన అధికారులకు అక్కర్లేదా అన్న ప్రశ్నలు తాజాగా వినిపిస్తున్నాయి. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి సర్కారు వద్ద తగినన్ని నిధులు లేవు. వనరులు లేవు. వాటిని సమకూర్చుకునేందుకు నానా తంటాలు పడుతోంది. ఈ సమయంలో అధికార వ్యవస్థ పనితీరు రేసుగుర్రంలా పరిగెత్తకపోతే అద్భుతమైన ఫలితాలు ఎలా వస్తాయి? అధికారుల పనితీరును ప్రభుత్వం పర్యవేక్షించకపోతే ఉత్తమ ఫలితాలు ఎలా వస్తాయి? ఇకనైనా చంద్రబాబు ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించాలని కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలే కోరుతున్నారు.

# ఫ్లాప్ స్ట్రీక్‌కు బ్రేక్ పడుతుందా?

టాలీవుడ్లో గ్రేటెస్ట్ కమ్ బ్యాక్స్‌లో ఒకటిగా నితిన్‌ది చెప్పుకోవచ్చు. జయం, దిల్, సై.. ఇలా మూడు వరుస హిట్లతో కెరీర్ ఆరంభంలో గాల్లో తేలిపోయిన అతను.. తర్వాత డజనుకు పైగా ఫ్లాపులు ఎదుర్కొన్నాడు. ఇన్ని ఫ్లాప్‌ల తర్వాత కూడా ఇండస్ట్రీలో నిలబడడం అంటే చిన్న విషయం కాదు. కానీ అతను 'ఇష్క్' సినిమాతో బలంగా బౌన్స్ బ్యాక్ అయ్యాడు. ఆ తర్వాత గుండె జారి గల్లంతయ్యిందే, అఆ, భీష్మ లాంటి సూపర్ హిట్లను ఖాతాలో వేసుకున్నాడు. ఐతే మధ్య మధ్యలో ఫ్లాపులూ లేకపోలేదు. కానీ 'భీష్మ' తర్వాత మాత్రం అతడికి సక్సెస్ ఎండమావే అయింది. చెక్, రంగ్ దె, మాచర్ల నియోజకవర్గం, ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్.. ఇలా నాలుగు ఫెయిల్యూర్లు తన ఖాతాలో పడ్డాయి. మధ్యలో ఓటీటీలో రిలీజైన 'మేస్ట్రో' సైతం ఆశించిన స్పందన తెచ్చుకోలేదు. దాన్ని కూడా ఫ్లాప్‌గానే పరిగణించాలి నిజానికి. ఈ ఫ్లాప్ స్ట్రీక్ చూసి నితిన్ మళ్లీ పాత రోజుల్లోకి వెళ్తున్నాడా అనిపిస్తోంది.

ఈ నేపథ్యంలో అతడికి ఇప్పుడు ఒక పెద్ద హిట్ అత్యావశ్యకం. ఆ హిట్ 'రాబిన్ హుడ్' రూపంలో దక్కుతుందని నితిన్ ఎంతో ఆశతో ఉన్నాడు. నితిన్ చివరి హిట్ 'భీష్మ' తీసిన వెంకీ కుడుములనే ఈ చిత్రానికి కూడా దర్శకుడు. వెంకీ తొలి చిత్రం 'ఛలో' సైతం సూపర్ హిట్ అన్న సంగతి తెలిసిందే. యూత్‌కు నచ్చే ఎంటర్టైనర్లు తీస్తాడని పేరున్న వెంకీ.. నితిన్‌కు మరో హిట్ ఇస్తాడనే అనిపిస్తోంది. 'రాబిన్ హుడ్' టీజర్ కూడా అంత ఎంటర్టైనింగ్‌గా కనిపించింది. 'పుష్ప' నిర్మాతలైన మైత్రీ మూవీ మేకర్స్ అధినేతలు ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేయడం కలిసొచ్చే అంశం. సినిమాను బాగా ప్రమోట్ చేసి జనాల్లోకి తీసుకెళ్తారని వారికి పేరుంది. వేసవి సీజన్ ఆరంభంలో మంచి టైమింగ్ కూడా కుదిరింది 'రాబిన్ హుడ్'కు. కావాల్సిందల్లా మంచి టాక్ మాత్రమే. అది వచ్చిందంటే 'రాబిన్ హుడ్' పెద్ద హిట్ కావడం ఖాయం. మరి ఈ చిత్రం నితిన్ ఫ్లాప్ స్ట్రీక్‌కు బ్రేక్ వేస్తుందనే ఆశిద్దాం.





# నిస్సిగ్గుగా వక్రీకరణలు

**సెకీ ఒప్పందంపై జగన నీచ పత్రిక అసత్యాలు**
**అంతా సక్రమమేని ఈఆర్సీచెప్పినట్లు బుకాయింపు**
**'సక్రమం' అని ఎక్కడా చెప్పని కమిషన్**
**హైకోర్టు పరిధిలో ఉందని... తాము సొంతంగా రద్దు చేయలేమని మాత్రమే వెల్లడి**

జగన్ తన నీచ పత్రిక ద్వారా అసత్యాలు వండివారుస్తున్నారు. సోలార్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)తో తాను అడ్డగోలుగా పాతికేళ్ల కాలానికి కుదుర్చుకున్న 7 వేల మెగావాట్ల సరఫరా ఒప్పందాన్ని సమర్థించుకునేందుకు ఏకంగా ఆంధ్రప్రదేశ్ విద్యుత నియంత్రణ కమిషన్ (ఏపీఈఆర్సీ)ని పావుగా వాడుకోవాలని చూశారు. దాని ఉత్తర్వులు, వ్యాఖ్యలకే వక్ర భాష్యాలు చెప్పారు. సెకీ ఒప్పందం సక్రమమేనంటూ ఈఆర్సీ చెప్పిందంటూ ఆయన పత్రిక కల్పిత కథనాన్ని వండి వార్చింది. పనిలోపనిగా ముఖ్యమంత్రి చంద్రబాబుపైనా అక్కసు వెళ్లగక్కింది. 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అన్నట్లుగా దాని కథనం సాగింది. జగన్ సర్కారు 2021లో సెకీతో 7,000 మెగావాట్ల సౌర విద్యుత కొనుగోలుకు ఒప్పందం చేసుకుంది. పేరుకే 'సెకీ'! అసలు సరఫరాదారు మాత్రం అదానీ! ఈ ఒప్పందం రాష్ట్రానికి పెనుభారంగా పరిణమిస్తుందని... పాతికేళ్లపాటు జనానికి షాకులు తప్పవని నిపుణులు హెచ్చరించారు. అంతర్రాష్ట్ర సరఫరా చార్జీల (ఐఎస్టీఎస్) రూపంలో చాలా భారం పడుతుందని తెలిపారు. భవిష్యతలో సౌర విద్యుత ధర మరింత తగ్గే అవకాశముందన్నా.. ముందుచూపులేకుండా దీర్ఘకాలిక ఒప్పందం చేసుకోవడం సరికాదన్నారు. ఈ అభ్యంతరాలేవీ నాడు జగన్ పట్టించుకోలేదు. ఇతర చార్జీలు ఉండవని, ట్రాన్సమిషన చార్జీలపై పూర్తి మినహాయింపు ఉంటుందని ఒప్పందం చేసుకునే సమయంలో ఊదరగొట్టారు. అవన్నీ అవాస్తవాలేనని తర్వాత వెల్లడైంది. సెకీతో విద్యుత కొనుగోలు ఒప్పందం వెనుక భారీగా అవినీతి జరిగిందని, కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపణలు వచ్చాయి. ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలంటూ హైకోర్టులోనూ, కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి (సీఈఆర్సీ)లోనూ పిటిషన్లు దాఖలయ్యాయి. దాఖలుచేసినవారిలో అప్పటి టీడీపీ ఎమ్మెల్యే, ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కూడా ఉన్నారు. వీటిపై ఇంకా విచారణ జరుగుతోంది. అలాగే... సెకీతో ఒప్పందాల కోసం 'అదానీ' సంస్థ ప్రభుత్వంలో ఉన్న వాళ్లకు లంచాలు ఇచ్చిందంటూ ఏకంగా అమెరికా దర్యాప్తు సంస్థ, న్యాయ విభాగం బయటపెట్టాయి. దీంతో ఇది అంతర్జాతీయ స్థాయి వివాదంగా మారింది.




### మసిపూసి.. మాయ చేసి!

అసలు విషయం, వివాదం అలాగే ఉన్నప్పటికీ... జగన్ పత్రిక మాత్రం 'సెకీ ఒప్పందానికి ఈఆర్సీ క్లీన్‌చిట్ ఇచ్చేసింది' అంటూ తాజాగా కథనం ప్రచురించింది. 'ఈఆర్సీచెప్పింది' అంటూ తనకు ఇష్టమొచ్చినట్లు రాసేసుకుంది. అయితే అది చెప్పినట్లుగా.. 'సెకీ ఒప్పందం సక్రమమే, అందులో ఎలాంటి లోపాలు లేవు, అందువల్ల రద్దు చేయడం కుదరదు' అని ఏపీఈఆర్సీఎక్కడా చెప్పలేదు. ఈ ఒప్పందానికి క్లీన్ చిట్ కూడా ఇవ్వలేదు. దీనిపై హైకోర్టులో పలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలైనందున తాను సొంతంగా ఒప్పందాన్ని రద్దు చేయలేనని స్పష్టం చేసింది. 'సెకీ విద్యుత సేకరణలో లంచాలకు సంబంధించి మీడియా కథనాలను బట్టి ఏపీఈఆర్సీ ఇచ్చిన ఆమోదాన్ని రద్దు చేయాలని కొందరు కోరారు. దీంతో ఈ పీఎస్ఏపై ఏపీఈఆర్సీ మరోసారి దృష్టి సారించింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పులను క్షుణ్ణంగా పరిశీలించింది' అని ఈఆర్సీ పేర్కొన్నట్లు సాక్షిలో రాశారు. సెకీ ఒప్పందంపై అభ్యంతరాలు రావడం, దానిని రద్దు చేయాలని కోరడం నిజమే. సెకీ ఒప్పందంపై ఇప్పటికీ హైకోర్టు ఎలాంటి నిర్ణయం వెలువరించలేదు. హైకోర్టు తుది తీర్పునకు లోబడే ఒప్పందం అమలవుతుందని ఈఆర్సీ తేల్చి చెప్పింది. అదే సమయంలో... లంచాలు ఇచ్చారనే ఆరోపణల నేపథ్యంలో ఒప్పందాన్ని తమంతట తాము రద్దు చేయలేమని తెలిపింది. దీనికి కారణం... ఈ వివాదం కోర్టు పరిధిలో ఉండడమే. అయినా సరే... 'హైకోర్టు తీర్పులను క్షుణ్ణంగా పరిశీలించింది' అన్నట్లుగా సాక్షి రాసేసింది. ఏపీఈఆర్సీ పరిశీలించిన తీర్పులేమిటో దానికే తెలియాలి. అలాగే 'కేంద్ర విద్యుత శాఖ ఆదేశాలు, సెంట్రల్ రెగ్యులేషన్ కమిషన్, పనరల్ నెట్‌వర్క్ యాక్సెస్ నిబంధనలు, పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ ప్రకారం... సెకీ విద్యుతకు అంతర్రాష్ట్ర ప్రసార చార్జీలు (ఐఎస్టీఎస్) వర్తించవు' అని ఈఆర్సీ పేర్కొన్నట్లు కూడా తెలిపింది. ఇది కూడా శుద్ధ అబద్ధం. సెకీ విద్యుతకు ఐఎస్టీఎస్ నుంచి మినహాయింపు ఉందని ఈఆర్సీ ఎక్కడా చెప్పలేదు. దీనిపై గత ఆగస్టు 13న స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. ఐఎస్టీఎస్ చార్జీల మినహాయింపు పొందాల్సిన బాధ్యత సెకీదేనని తెలిపింది. అలా చేయలేకపోతే.. జనరల్ నెట్‌వర్క్ యాక్సెస్ (జీఎన్ఏ) రెగ్యులేషన్స్‌లోని 20.4 క్లాజ్ ప్రకారం స్టేట్ ట్రాన్స్‌మిషన్ యూనిట్ (ఎస్టీయూ)నుంచి నిరభ్యంతర పత్రం తెచ్చుకుని 'జనరల్ నెట్‌వర్క్ యాక్సెస్'కు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఆర్ఏపీఎస్సీఓఎం (గ్రామీణ వ్యవసాయ విద్యుత సరఫరా సంస్థ)కు సూచించింది. అంతే తప్ప.. సెకీ ఒప్పందానికి ఐఎస్టీఎస్ చార్జీల నుంచి మినహాయింపు ఉందని చెప్పలేదు. జీఎన్ఏ నిబంధనలు ఇంకా ఖరారు కాలేదు. అయినా వాటి ప్రకారం మినహాయింపు ఇచ్చినట్లు రాసేసింది. సెకీ విద్యుత కొనుగోలుకు అనుమతించాల్సిందిగా డిస్కమ్‌లు ప్రతిపాదించినట్లు చెప్పుకొచ్చింది. సాంకేతికంగా చూస్తే సెకీతో ఒప్పందం అమలులో ఉన్నట్లే. దీనిని ఆపివేస్తూ ఎలాంటి ఉత్తర్వులూ, తీర్పులూ లేవు. అమలులో ఉన్న ఇతర ఒప్పందాల ప్రకారం విద్యుత సమీకరణకు అవకాశం కల్పించినట్లే 'సెకీ' ఒప్పందాన్ని కూడా ఏఆర్ఆర్‌లో చేర్చారు. ఇది... సెకీ డీల్‌కు క్లీన్ ఇచ్చినట్లు కాదు.

### ఇవీ వాస్తవాలు

సెకీతో ఒప్పందానికి ఈఆర్సీ క్లీన్ చిట్ ఇచ్చినట్లుగా 'రోత పత్రిక' ఒక చిత్రాన్ని ప్రచురించింది. అందులో అక్షరం అక్షరం చదివినా... ఎక్కడా 'క్లీన్ చిట్' ఇచ్చినట్లు కనిపించదు. ఒప్పందం నేపథ్యం, అభ్యంతరాలను వివరిస్తూ... కోర్టు పరిధిలో ఉన్నందున తనంతట తానుగా ఒప్పందం రద్దు చేయలేనని మాత్రమే తెలిపింది. 2021లో సెకీతో విద్యుత కొనుగోలు ఒప్పందం ప్రకారం యూనిట్‌కు రూ.2.49 చెల్లించాలి. అప్పటికే గుజరాత సెకీతో యూనిట్‌కు రూ.1.90కే ఒప్పందం చేసుకుంది. అంటే... గుజరాత కంటే 59 పైసలు ఎక్కువ ధరకు. మరి... ఇది చౌక విద్యుత్తు ఎలా అవుతుంది? ప్రజలపై భారం పడేలా మార్కెట్ రేటు కంటే ఎక్కువ ధరకు ఒప్పందం. ఈ ఒప్పందం వల్ల రాష్ట్ర ప్రజలపై రూ.1.25 లక్షల కోట్ల భారం పడుతుందని నిపుణుల అంచనా! ఐదేళ్ల పాలనలో అడుగడుగునా అదానీకి మేలు చేయడానికి నిస్సిగ్గుగా జగన్ ప్రయత్నించారు. కృష్ణపట్నం రేవును, గంగవరం రేవును దానికి కట్టబెట్టారు. వాటాలున్న కంపెనీల అధినేతలను బెదిరించి, భయపెట్టి వాటాలు అమ్ముకునేలా చేశారు. అదానీకి ప్రధాని మోదీ అండ ఉండడంతో జగన్ చెలరేగిపోయారు. పేరుకు సెకీతో ఒప్పందం చేసుకున్నా.. విద్యుత సరఫరా చేసేది అదానీయే. వాస్తవానికి ఆంధ్రలోనే సౌర విద్యుత ప్లాంటు నిర్మిస్తే స్థానిక యువతకు ఉపాధి లభించేది. కానీ ఎక్కడో రాజస్థాన్‌లో ఏర్పాటుచేసిన ప్లాంటు నుంచి మన రాష్ట్రానికి విద్యుత సరఫరా చేయాలంటే పలు రాష్ట్రాల గుండా ట్రాన్స్‌మిషన్ లైన్లు వేయాలి. ఇప్పుడది కూడా పూర్తయింది. అదానీ నుంచి కరెంటు కొంటే వచ్చే పాతికేళ్లలో రూ.1.25 లక్షల కోట్ల భారం ప్రభుత్వంపై పడుతుంది. దీని నుంచి ఎలా తప్పించుకోవాలా అని చంద్రబాబు మల్లగుల్లాలు పడుతున్నారు. మోదీకి సన్నిహితుడైన అదానీని కాదంటే ఏమవుతుందోనన్న ఆందోళన ఉండి ఉండొచ్చు. అలాగని రాష్ట్ర ప్రజలను తాకట్టుపెట్టలేరు కదా! అందుకే విద్యుత కొనాలని సెకీ పదే పదే లేఖలు రాస్తున్నా.. జవాబివ్వడం లేదు. అంతర్రాష్ట్ర ప్రసార చార్జీలు మినహాయిస్తేనే కొంటామని చెప్పాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.





# ఇదేం విజన్?

జనంలోకి వెళ్లని 'స్వర్ణాంధ్ర-2047' పత్రం
ప్రపంచ స్థాయి ఆంగ్లంతో తంటాలు
విద్యాసంస్థల్లో చర్చలు జరపాలన్న చంద్రబాబు
తలలు పట్టుకుంటున్న అధికార గణం
ఇలాగైతే ప్రభుత్వ లక్ష్యం ప్రజలకు చేరేదెలా?

జాతీయ స్థాయిలో 'వికసిత భారత' లక్ష్యానికి సమాంతరంగా రాష్ట్రాన్నీ అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో... ముఖ్యమంత్రి చంద్రబాబు 'స్వర్ణాంధ్ర 2047' పేరుతో ఒక విజన్ బుక్ తయారు చేయించారు. అది మంచిదే.. అందులో పేర్కొన్న లక్ష్యాలు కూడా ఉన్నతమైనవే! కానీ ప్రభుత్వ ఉద్దేశాలేంటో ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడంలో మాత్రం విఫలమయ్యారు. ఈ డాక్యుమెంట్‌పై జిల్లా, మండల స్థాయిలో చర్చ జరగాలని... పాఠశాలల్లోనూ విద్యార్థులకు అవగాహన కల్పించాలని... ప్రజాభిప్రాయాలూ తెలుసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. డాక్యుమెంట్‌లో ఉన్న 10 సూత్రాలను.. అంశాల వారీగా గ్రామస్థాయిలో చర్చకు పెట్టాలని ప్రజాప్రతినిధులను పలుమార్లు ఆదేశించారు. ఒకరికి చెప్పాలంటే... ముందు ప్రజాప్రతినిధులకు, అధికారులకు అర్థం కావాలి కదా! అందుకే... 230 పేజీల విజన్ డాక్యుమెంట్‌ను అర్థం చేసుకునేందుకు అధికారులు ప్రయత్నించారు. కానీ ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థలు కేపీఎంజీ, బీసీజీ (బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్) రూపొందించిన ఈ డాక్యుమెంట్‌లోని ప్రపంచ స్థాయి ఇంగ్లిష్ భాష వారినే హడలగొడుతోంది. 1995-2004 నడుమ చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో విజన్-2020 విడుదల చేశారు. అది కూడా ప్రపంచ బ్యాంకు 'భాష'లో ఉన్నప్పటికీ ప్రజలకు కొంత దగ్గరైంది. రంగాల వారీగా ప్రభుత్వం నిర్దేశించుకున్న స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలు.. వాటిని చేరుకునే మార్గాలను అందులో పొందుపరిచారు. పూర్తిస్థాయిలో కాకున్నా... స్థూలంగా ప్రభుత్వ ఉద్దేశం, లక్ష్యాలు, ఎంచుకున్న మార్గాలు అప్పట్లో ప్రజలకు అర్థమయ్యాయి. ఇప్పుడు 'స్వర్ణాంధ్ర-2047' దీనికి పూర్తి భిన్నంగా ఉంది. సాధారణంగా ప్రభుత్వం తాను ప్రచారం చేయదలుచుకున్న అంశాలను సరళంగా అందరికీ అర్థమయ్యే రీతిలో, పంచ్‌లైన్లతో, ప్రాసలతో తయారు చేయిస్తుంది. ఒక్కసారి విన్నా, చూసినా గుర్తుండిపోయేలా ఉంటాయి. కానీ స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్‌లో ఉన్న భాషను అర్థం చేసుకోలేక అధికారులు, ప్రజాప్రతినిధులు తంటాలు పడుతున్నారు. ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు చేరవేసే మీడియాకైనా కనీసం అర్థమయ్యేలా వివరించి ఉంటే అసలు ఉద్దేశం ప్రజలకు చేరేది. దానిపై వ్యక్తమయ్యే భిన్నాభిప్రాయాలు ప్రభుత్వానికి తెలిసేవి. కానీ ఇప్పుడా అవకాశమే లేకుండా పోయింది.

### కార్యదర్శుల సదస్సులోనూ...

శాఖల కార్యదర్శుల సదస్సు జరిగిన రోజు ఇచ్చిన ప్రజెంటేషన్లలో వాడిన భాష కూడా విజన్ డాక్యుమెంట్‌లో మాదిరే ఉంది. ప్రపంచ స్థాయి కన్సల్టెంట్ల భాష వాడారు. పీజీఆర్ఎస్‌లో




భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని ఫిర్యాదులు వచ్చాయో చెప్పారు గానీ, పరిష్కారం అయిన ఫిర్యాదులను జిల్లాల వారీగా చెప్పలేకపోయారు. ఫిర్యాదుల తీరుతెన్నుల గురించి రాసిన లెక్కలనే పదిసార్లు రాశారు. హీట్‌మ్యాప్, హౌస్‌హోల్డ్ గ్రీవెన్సెస్, ఎస్ఎల్ఏ అంటూ.. అది తయారు చేసిన వారికి తప్ప ఎవరికీ అర్థం కాని భాషలో రంగు రంగుల గ్రాఫ్‌లతో నింపేశారు. మొత్తం 7,42,301 ఫిర్యాదులు వస్తే 4,50,735 పరిష్కరించామని చెప్పారు. ఇందులో కనీసం పది మందితో అయినా 'మా ఫిర్యాదులు పరిష్కారమయ్యాయి' అని వారి మాటల్లో చెప్పించి, వాటిని ప్రజెంటేషన్‌లో చూపించి ఉంటే ఈ లెక్కలు నమ్మశక్యంగా ఉండేవి. అయితే అర్థం కాని పదాలతో రంగురంగుల గ్రాఫ్‌లతో మమ అనిపించేశారు.

### విజన్ లక్ష్యాలు ఘనమే..!



విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, నీతీఆయోగ్, ఇంకా ఇతర సంస్థల ప్రతినిధులు.. ఇలా మొత్తం 17 లక్షలమందిని స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో భాగస్వాములను చేశారు. అవగాహన కోసం 4.50 లక్షల మంది పాఠశాల విద్యార్థులకు, 38 వేలమంది కళాశాల విద్యార్థులకు పోటీలు కూడా నిర్వహించారు. జాబ్ ఫస్ట్ విధానంతో ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ, ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్, ప్రైవేట్ పార్క్‌లు, సెమీకండక్టర్, క్లీన ఎనర్జీ, డ్రోన, డేటా సెంటర్, స్పోర్ట్స్, టూరిజం తదితర 20 పాలసీల సమాహారాన్ని పొందుపరిచారు.

ఆరోగ్యం.. సంపద.. సంతోషాలే లక్ష్యంగా దీనికి రూపకల్పన చేశారు. 'పది సూత్రాలతో విజన డాక్యుమెంట్ రూపకల్పన చేశాం. జీరో పావర్టీ (పేదరిక సంపూర్ణ నిర్మూలన) కోసం ఎన్టీఆర్ కలలు గనేవారు. పీపుల్, పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్(పీ4)అనే విధానం ద్వారా నిరుపేదలను ఆర్థికంగా పైకి తీసుకొచ్చేందుకు కృషిచేస్తాం. ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త అనేది నా సంకల్పం. 2047 నాటికి ఇది తప్పక నెరవేరుతుంది. ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించే దిశగా కృషి చేస్తున్నాం. ఇందుకు పాలసీలు తెస్తున్నాం. మంచి పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలను ప్రోత్సహిస్తున్నాం. జనాభా నిర్వహణపై దృష్టి సారించాం. రాష్ట్రంలో నాలెడ్జి సొసైటీని తయారుచేసుకోవాల్సిన అవసరముంది. అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందేలా అభివృద్ధి వికేంద్రీకరణ ప్రక్రియను చేపడతాం' అని చంద్రబాబు అన్నారు. మరి ఇంత ఘనంగా రూపొందించుకుని ప్రజలకు అర్థమయ్యేలా ఎందుకు చెప్పలేకపోతున్నారు? కనీసం మంత్రులైనా తమ సమీక్షల్లో వీటి ప్రస్తావన తెస్తున్నారా? చంద్రబాబు, సీఎస్ తప్ప దీని గురించి మాట్లాడేవారే కనిపించడం లేదు. అధికారులకే కష్టంగా ఉన్నప్పుడు ఇక సామాన్యులకు ఎలా అర్థమవుతుంది? ఇదే విజన్‌ను కేంద్రానికి కూడా పంపించారు. అక్కడి వారికి ఇది అర్థమైందో లేదో తెలియదు గానీ.. జనంలోకి తీసుకెళ్లకపోతే మాత్రం అపహాస్యం పాలయ్యే ప్రమాదం ఉంది. విజన్-2020 రూపొందించినప్పుడు కూడా దానిని సక్రమంగా ప్రజలకు చేర్చలేకపోయారు. ఎంతసేపూ అధికారులతో ఆ దిశగా చర్చలు జరిపితే చాలదు.. అదెంతవరకు ప్రజలకు చేరువైందో తెలుసుకోకుంటే ఎన్ని ప్రణాళికలు సిద్ధం చేసినా ప్రయోజనం ఉండదని పాలనా నిపుణులు స్పష్టం చేస్తున్నారు.



# బాబుకు 'భూ'ముప్పు!!

**జగన్ రీసర్వే బాధితులకు
ఇప్పటికీ దొరకని న్యాయం
8,680 గ్రామాల్లో 3.80 లక్షల మంది
రైతుల భూములు వైసీపీ నేతల పాలు
గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల్లో
కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు
టీడీపీ కేంద్ర కార్యాలయంలో
లెక్కలేనన్ని వినతులు
స్వయంగా సీఎంనే కలిసి
లక్షల మంది కంప్లయింట్లు
వాటిని పరిష్కరించకుండానే
వందల గ్రామాల్లో మళ్లీ పైలట్ సర్వేలు
భూమితో అనవసర ప్రయోగాలు
కూటమి సర్కారుకే చేటు**

కొండ నాలుక్కి మందేస్తే ఉన్న నాలుక పోయిందన్నట్లుగా చంద్రబాబు ప్రభుత్వం తీరు ఉంది. రీసర్వే పేరిట నాటి సీఎం జగన్, ఆయన పార్టీ నాయకులు.. లక్షల మంది రైతుల భూములు స్వాహా చేశారు. సర్వే నంబర్లలో రైతుల భూములు తీసేసి తమ ఖాతాల్లో వేసుకున్నారు. దరిదాపుగా 8,680 గ్రామాల్లో 3.80 లక్షల మంది రైతుల భూములు వైసీపీ నేతల పాలయ్యాయి. అన్నదాతలు గగ్గోలు పెట్టినా జగన్ వినిపించుకోలేదు సరికదా.. ఆ భూములు వైసీపీ నేతల చేజారకుండా ఏకంగా చట్టమే తెచ్చారు. దీనివల్లే మొన్నటి ఎన్నికల్లో చావుదెబ్బ తిన్నారు. కోల్పోయిన వారి భూములు వారికి ఇప్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. సర్వే తప్పులపై సివిల్ కోర్టుల్లో అనేక కేసులు పడ్డాయి. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం వచ్చాక లక్షల సంఖ్యలో బాధితుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. ముఖ్యంగా టీడీపీ కేంద్ర కార్యాలయానికి జనం బారులు తీరారు. స్వయంగా ముఖ్యమంత్రినే కలిసి వినతిపత్రాలు సమర్పించారు. అయినా ఉపయోగం లేదు. పైగా జగన్ చేసిన తప్పులనే కూటమి ప్రభుత్వం కూడా చేస్తోంది. రీసర్వే పేరిట మళ్లీ పైలట్ ప్రాజెక్టులు చేపడుతోంది. వందల గ్రామాల్లో తిరిగి సర్వే అంటున్నారు. అసలు డాక్యుమెంట్లు అన్నదాతల చేతుల్లోనే ఉన్నాయి. వాటి ఆధారంగా భూవివాదాలను పరిష్కరించకుండా మళ్లీ సర్వే చేపట్టడం వెనుక ఉద్దేశమేంటో అర్థం కావడం లేదు. ప్రజల భూముల జోలికి వెళ్లిన జగన్ గతి ఏమైందో ప్రత్యక్షంగా చూసి కూడా చంద్రబాబు ఎందుకు తప్పటడుగులు వేస్తున్నారో రెవెన్యూ నిపుణులకు అంతుపట్టడం లేదు.

### అప్పుడేం జరిగింది..?

జగన్ సర్కారు రాష్ట్రమంతా రీ సర్వే అమలు చేయడానికి ముందు తొలుత 1,500 ఎకరాలున్న ఉమ్మడి కృష్ణా జిల్లా తక్కెళ్లపాడులో పైలెట్ ప్రాజెక్టు చేపట్టారు. చిన్న గ్రామంలోనే విజయం సాధించలేకపోయారు. ఎక్కడ లోపాలున్నాయో కనిపెట్టి సరిదిద్దకుండా ఏకంగా 8,680 రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేసి 3.80 లక్షల మంది రైతుల భూములు తారుమారు చేసేశారు. వారి ఉసురు పోసుకున్నారు. ఇది టీడీపీ కూటమికి ఎన్నికల్లో బాగానే ఉపకరించింది. అధికారంలోకి వస్తే రైతుల భూ వివాదాలు తీరుస్తామని హామీ ఇచ్చింది. రీసర్వే జరిగిన 8,680 గ్రామాల్లో సభలు నిర్వహిస్తే 2.60 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. ఇవి సరిపోవన్నట్లుగా రెవెన్యూ సదస్సుల్లో మరో 2.80 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. మొత్తంగా వివిధ రూపాల్లో గత ఎనిమిది నెలల్లో 7.60 లక్షల ఫిర్యాదులు వస్తే అందులో ఒక్క రెవెన్యూ సంబంధితమైనవే 3.80 లక్షల వరకు ఉన్నాయి. ఇవన్నీ జగన్ సర్కారు చేసిన రీ సర్వేపై వచ్చిన ఫిర్యాదులే. అంటే చంద్రబాబు ప్రభుత్వం పరిష్కరించాల్సిన ప్రజాసమస్యల్లో సింహభాగం జగన్ సర్కారు చేసిన తప్పిదాల వల్ల వ చ్చినవే. అవి రైతాంగాన్ని ఎంత ఇబ్బందులకు గురిచేస్తున్నవో సర్కారుకు బాగా తెలిసినవే. ఒకసారి వాటి తీవ్రత, లోతుపాతులు తెలిసిన తర్వాత మరే ప్రభుత్వం అలాంటి తప్పుల జోలికే వెళ్లదు. అలాంటి సాహసాలు చేయదు. కానీ అదేం చిత్రమో.. చంద్రబాబు సర్కారు ఆ దోవలోనే పయనిస్తోంది. జగన్ ఒక గ్రామంలో పైలట్ ప్రాజెక్టు చేపడితే.. తాను ఏకంగా 670 గ్రామాల్లో చేస్తోంది. రాష్ట్రంలో జగన్ జమానాలో రీ సర్వే చేసింది ఇప్పుడున్న రెవెన్యూ, సర్వే అధికారులు, సిబ్బందే. ఇప్పుడు సర్వే చేస్తోందీ వారే. ఇక మారిందేమిటి? ప్రభుత్వమే! ప్రజానుకూలంగా సమస్యను చిత్తశుద్ధితో పరిష్కరించాలనే గుణాత్మకమైన మార్పు అధికారగణంలో తీసుకురాకుండా వారి ద్వారా కూటమి ప్రభుత్వం భూ వివాదాలు ఎలా పరిష్కరిస్తుంది? సమస్యలు లేకుండా ఎలా సర్వే చేస్తుందని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

### పరిష్కారంపై తప్పుడు నివేదికలు

జగన్ చేసిన భూసంబంధిత తప్పులు లక్షల్లో పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పరిష్కరించాలంటే పుణ్యకాలం గడచిపోతుంది. ప్రతి రైతు సమస్యను పరిష్కరించాలంటే మళ్లీ సర్వేచేయాలి. అంటే భూమిపై కొలతలు వేయాలి. రైతు ఆమోదం పొందాలి. అంతిమంగా మళ్లీ చట్టబద్ధమైన వివిధ రకాల నోటిఫికేషన్లు ఇవ్వాలి. ఇవన్నీ సగటున ఒక్కో గ్రామంలో పూర్తవ్వాలి. అంతిమంగా 8,680 గ్రామాల్లో భూ వివాదాలు పరిష్కారం కావాలంటే.. ఎప్పటికి పూర్తవుతుందో అంచనా వేయడమే కష్టం. ఇవన్నీ అధికారులను క్షేత్రస్థాయికి పంపించి ఒక్కో కేసును నిశితంగా పరిశీలించి పరిష్కరించాల్సినవి. అలాంటిది కేవలం నాలుగైదు నెలల్లోనే 80 శాతం ఫిర్యాదులు పరిష్కారమని రెవెన్యూ శాఖ తేల్చేసింది. భూములు తారుమారై తమ నేల పరులపాలై అన్నదాతలు, జనం అల్లాడుతుంటే.. ఏకంగా 80 శాతం సమస్యలు తేల్చేశామని ఆ శాఖ ఇచ్చిన నివేదికలో ఎంత డొల్లతనం ఉందో ఇట్టే చెప్పవచ్చు. ఆ శాఖ తెంపరితనంపై రెవెన్యూ నిపుణులు, చట్టాలు, విధానాలపై అవగాహన ఉన్న సీనియర్ అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు సర్కారుకు మాత్రం ఇసుమంతైనా అనుమానం, సందేహం కలగడం లేదు.





### అధికారులను నమ్మాల్సిందే కానీ..

ప్రభుత్వం అధికారులను నమ్మాలి. ఇందులో సందేహం లేదు. కానీ జగన్ ఇదే అధికారులను అడ్డుపెట్టుకుని భూముల సర్వేను స్వార్థ ప్రయోజనాలకు, భూదోపిడీకి అడ్డగోలుగా వాడుకున్నారు. మాట వినని రాజకీయ ప్రత్యర్థులు, తనకు ఓటేయరని భావించిన రైతులు, సామాన్యుల భూ రికార్డులను మార్చేశారు. ఇవన్నీ నాడు ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతలకు తెలియనివి కాదు. జగన్ సర్కారు రీ సర్వే పేరిట దారుణాలు చేసిందని ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ఆందోళనలు కూడా చేశారు. అధికారంలోకి రాగానే రీ సర్వే ఆపేశారు. రీ సర్వే అనంతరం జగన్ తన బొమ్మలతో ఇచ్చిన పాస్‌పుస్తకాలను ఆపేశారు. సర్వే సరిహద్దు రాళ్లపై జగన్ బొమ్మలను తొలగిస్తున్నారు. కానీ మళ్లీ అధికారులు చెప్పారంటూ తిరిగి 670 గ్రామాల్లో రీసర్వే ప్రారంభించారు. పాత సమస్యలు పరిష్కరించకుండా కొత్తగా లక్షల సమస్యలు సృష్టించేందుకు సిద్ధమయ్యారు. ఇదంతా ముఖ్యమంత్రికి తెలిసే జరుగుతోందా అన్న అనుమానాలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి. కొందరు అధికారులు ఎప్పుడూ ప్రజలకు సమస్యలు ఉండాలనే కోరుకుంటారు. ప్రజల సమస్యలే వారి అక్రమార్జనకు, అవినీతికి మేత. కీలక పదవులు, హోదాల్లో తిష్ఠవేసి అందినంత దోచేస్తుంటారు. రెవెన్యూ శాఖలో ఇలాంటి వారే అధికం. భూముల సర్వేకు ముందు రెవెన్యూలో రికార్డుల నిర్వహణ మాత్రమే ఉండేది. రికార్డుల్లో తప్పులున్నాయని, ఇతరుల పేరిట భూములు మార్చారన్న ఫిర్యాదులు 25 శాతం లోపే ఉండేవి. అధికారిక రియల్‌టైం గవర్నెన్స్ సిస్టమ్ 'ఆర్టీజీఎస్) లెక్కల ప్రకారం.. జగన్ అధికారంలోకి రాకముందు 2019 జనవరి నాటికి ప్రభుత్వానికి 1.45 లక్షల ఫిర్యాదులు వస్తే, అందులో రెవెన్యూశాఖ పరిష్కరించాల్సినవి 13 వేలు. ఇందులో అత్యధికం చుక్కల భూములు, కౌలురైతు కార్డులు, మ్యుటేషన్ సమస్యలే. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వానికి అందిన ఫిర్యాదుల్లో 70 శాతం రెవెన్యూవే. వాటిలో సింహభాగం రీ సర్వేపై వచ్చినవే. అదే ఒరవడి ఇప్పటికీ కొనసాగుతోంది. రెవెన్యూ అధికారులు ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో, న్యాయంగా, ధర్మంగా పరిష్కరించడం లేదు. అవసరం లేని కొర్రీలు, సాకులు చూపి రైతులను నిరంతరం తిప్పించుకుంటారు. డబ్బులిస్తేనే పనవుతుందని సంకేతాలిస్తారు. ప్రజలు ఒక ఆస్తిని కాపాడేందుకు మరో ఆస్తిని అమ్ముకుని వచ్చిన డబ్బును సదరు అధికారికి సమర్పించుకుని సమస్యను పరిష్కరించుకునే పరిస్థితులు కోకొల్లలు. పాస్‌పుస్తకాలు ఇవ్వడం లేదని తహశీల్దార్ ఆఫీసు ముందు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు కూడా చాలానే ఉన్నాయి. రీ సర్వే సమయంలో భూముల వద్దకు వెళ్లి కొలతలు వేయకుండా రైతుల ఆస్తులను తారుమారు చేసి.. వారి జీవితాలను కకావికలం చేసింది రెవెన్యూ అధికారులే. వారు ఇప్పుడు ఒక్కసారిగా మారిపోయారా? గత ప్రభుత్వపు అవినీతి, అక్రమాల ఆనవాళ్లను, వాసనలను వదిలించుకుని ఒక్కసారిగా పేదలకు మేలుచేసే శంకరన్‌లుగా తయారయ్యారా అని రెవెన్యూ నిపుణులే సందేహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఎంత మంచి కార్యక్రమం చేపట్టినా, దాన్ని ఆచరించాల్సిన అధికారుల్లోనూ ఆ మంచితనం, నిజాయితీ, చిత్తశుద్ధి ఉండాలని వారు చెబుతున్నారు. 'కూటమి సర్కారు రీ సర్వేను తిరిగి చేపట్టాలని అనుకోవడం దుస్సాహసమే. జగన్ ప్రభుత్వంలో పనిచేసిన అధికారులే ఇప్పుడూ ఉన్నారు. మహా అంటే కూటమి సర్కారు వచ్చాక ఆ అధికారులు మండలాలు, జిల్లాలు మారి ఉండొచ్చు. కానీ చేసే పని అదే కదా! వారిలో గుణాత్మకమైన మార్పురావాలి. ప్రజలకు మంచి మాత్రమే చేయాలన్న తపన ఉండాలి. అది వారిలో కలగాలంటే ప్రభుత్వం వారిని సంస్కరించాలి. వారిలో ఆ మార్పు తీసుకురాకుండా, మళ్లీ గత ప్రభుత్వం మాదిరే పనులు అప్పగిస్తే ప్రజలకు మరిన్ని కష్టాలు తీసుకొచ్చినట్లే' అని సూచిస్తున్నారు.

### ఎవరడిగారు..

నిజానికి రెవెన్యూ శాఖ నవీకరణ, డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్ మోడర్నైజేషన్ ప్రోగ్రాం (డీఐఎల్ఆర్ఎమ్‌పీ) కింద కేంద్రం రాష్ట్రానికి ఏటా 100–150 కోట్లు ఇస్తుంది. ఈ నిధుల కోసం ప్రభుత్వం రైతులను ఇబ్బందుల్లోకి నెట్టేసి తనకు రాజకీయంగా సమస్యలను కొని తెచ్చుకునే పనులు చేయాలా అని రైతు సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. 'మాకు రీ సర్వేకావాలి. రాష్ట్రమంతా రీ సర్వే చేయాలని రైతులు గానీ, రైతుసంఘాలు గానీ, రాజకీయ పార్టీలు గానీ నాడు జగన్‌ను, నేడు చంద్రబాబు ప్రభుత్వాన్ని కోరారా? బీజేపీ పాలిత రాష్ట్రాలే రీసర్వే చేయడం లేదు. ప్రధాని మోదీ గతంలో తొలిసారి గుజరాత సీఎం అయినప్పుడు రీసర్వే చేసి చేతులు కాల్చుకున్నారు. అది తప్పని గ్రహించి ప్రాజెక్టును రద్దుచేసుకున్నారు. ఆ తర్వాతే రెండోసారి సీఎంగా గెలవగలిగారు. అలాగే మూడు సాగు చట్టాలు తీసుకొచ్చి.. ఉపయోగం లేదని రద్దుచేశారు. ఆ తర్వాత మళ్లీ ఎన్నికల్లో గెలుపొందారు. ఈ అనుభవాల నుంచి చంద్రబాబు ప్రభుత్వం ఎందుకు గుణపాఠాలు నేర్చుకోదు? ఇప్పుడున్న సమస్యలు పరిష్కరించండి చాలని రైతులు వేడుకుంటుంటే.. వారి ఘోష పట్టించుకోకుండా రీ సర్వేపేరిట మళ్లీ కొత్త సమస్యలు పుట్టించేందుకు తహతహలాడడం ఏంటి? ఎవరూ కోరకున్నా రీసర్వేకు ఎందుకు ఆరాటపడుతోంది? అధికారంలోకి రాగానే రీ సర్వేను చంద్రబాబే ఆపేశారు. అది సాహసోపేత నిర్ణయం. ఆ తర్వాత ఆ నిర్ణయాన్నే ఎందుకు కొనసాగించలేకపోయారు? సీఎం తన సొంత నిర్ణయాలనే పాటించాలి. అధికారుల మాట నమ్మితే రైతు వ్యతిరేకత మూటగట్టుకుంటారు. చంద్రబాబును ఇప్పుడు రైతాంగం పూర్తిగా విశ్వసిస్తోంది. తమకోసం ఏదో చేస్తారన్న నమ్మకంతో ఉన్నారు. కానీ రీసర్వే పేరిట మళ్లీ కొత్త సమస్యలు సృష్టించినా, పాత సమస్యలు పరిష్కరించకున్నా వారి ఆగ్రహాన్ని చవిచూడక తప్పదు' అని రిటైర్డ్ రెవెన్యూ అధికారి ఒకరు హెచ్చరించారు.

### పరిష్కారం ఏమిటి?

రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల శ్రేయస్సు, ప్రజా సమస్యల పరిష్కారం విషయాల్లో ముఖ్యమంత్రి చంద్ర బాబు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని సొంత నిర్ణయాలే తీసుకోవాలి. కొందరు అధికారుల మాటలు నమ్మి నిర్ణయాలు తీసుకుంటే రైతులు దూరమైపోతారు. 2019 నుంచి నేటి వరకు కొత్తగా ఎలాంటి లావాదేవీలు.. అంటే అమ్మకాలు, కొనుగోళ్లు జరగని భూములకు సంబంధించి ఆనాటి రికార్డులను పునరుద్ధరించాలి. దీనివల్ల ఇప్పుడు రైతాంగం రీ సర్వే పేరిట ఎదుర్కొంటున్న సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. సర్వే, సరిహద్దు సమస్యలను పరిష్కరించాలి. మ్యుటేషన్, పాసుబుక్ ఇబ్బందులను తొలగించాలి. అంతే తప్ప ఎవరూ కోరని రీ సర్వేను రైతుల తలపై రుద్దవద్దు. రైతులు కోరితే అవసరాన్ని బట్టి మాత్రమే సర్వే చేయాలి.






సిలికానాంధ్ర
మనబడి
ఉత్సాహంగా, ఉల్లాసంగా, ఆడుతూ, పాడుతూ తెలుగు నేర్చుకోవడానికి తేలికైన పాఠాలు.. అందమైన పుస్తకాలు, సుశిక్షితులైన గురువులు...
తెలుగు
చదవడం,
వ్రాయడం,
మాట్లాడడం,
నేర్చుకోండి.
17+ సంవత్సరాలు
10+ దేశాలు
30+ రాష్ట్రాలు
95,000+ విద్యార్థులు
250+ ప్రాంతాలు
2000+ భాషా సేవకులు
క్రొత్త విద్యార్థులు
• 4 - 6 సం॥ బాలబడి - 1
• 6 సం॥ బాలబడి - 2
లేదా ప్రవేశం(తల్లిదండ్రుల ఇష్టం)
• 7+ సం॥ ప్రవేశం
తరగతుల నమోదు ప్రారంభమైనది
ప్రవేశం
ప్రసూనం
ప్రకాశం
ప్రమోదం
ప్రభాసం
ప్రబోధం
బాలబడి
సెప్టెంబర్ 7, 2024 నుంచి తరగతులు ప్రారంభం
గుర్తింపు
• పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గుర్తింపు
• అమెరికాలోని వివిధ స్కూల్ డిస్ట్రిక్ట్‌లలో ప్రపంచభాషగా (World Language Credit) గుర్తింపు
• ప్రఖ్యాత WASC సంస్థచే గుర్తింపు
పరీక్షలు
• ప్రకాశం, ప్రభాసం విద్యార్థులకు తెలుగు విశ్వవిద్యాలయం పరీక్షలు
• సుశిక్షితులైన ఉపాధ్యాయులచే శిక్షణ
కార్యక్రమాలు
పిల్లల పండుగ, తెలుగు మాట్లాట, బాలానందం, తెలుగుకువరుగు, పలుకుబడి, పద్యనాటకం, నాటకోత్సవం.
బాలరంజని
తెలుగు సాధన కోసం - కథలు, పాటలు, ఆటలతో ఉచితంగా యాప్
మనబడిలో చేర్పిద్దాం - తెలుగు భాష నేర్పిద్దాం
For more details and to register:
manabadi.siliconandhra.org
info@manabadi.siliconandhra.org
1-844-626-BADI (2234)
Follow us on :



# తెలంగాణ క్యాబినెట్ విస్తరణ కాదు.. ప్రక్షాళన?

**ఇద్దరు లేదా ముగ్గురు మంత్రుల తొలగింపు?**
**పనితీరుపై సర్వే చేయించిన కాంగ్రెస్ అధిష్ఠానం**
**పార్టీ లైన్‌లో పనిచేయని ఇద్దరు మంత్రులు!**
**వివాదాలకు కేంద్ర బిందువుగా మరో మంత్రి**
**ముగ్గురిని తొలగించి.. నలుగురిని చేర్చే అవకాశం**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది దాటిపోయింది. కానీ, మంత్రివర్గం మాత్రం ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదు. 2023 డిసెంబరులో మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తనతోపాటు మరో 11 మందితో మాత్రమే క్యాబినెట్‌ను ఏర్పాటు చేశారు. సీనియర్లు, సామాజికవర్గాల కూర్పు, రాజకీయ అవసరాల ఆధారంగా 11 మంది మంత్రులను నియమించారు. ముఖ్యమంత్రితో కలిపి మొత్తం 18 మందికి చోటు కల్పించే వీలున్నా.. మిగిలిన ఆరు స్థానాలకు తరువాత మంత్రివర్గ విస్తరణ చేపడతామని ప్రకటించారు. కానీ, ఏడాది కాలంగా విస్తరణ జరపడంలేదు. ఎప్పటికప్పుడు ఏదో ఒక కారణంతో ఇది వాయిదా పడుతూ వస్తోంది. వరుసగా లోక్‌సభ ఎన్నికలు, ఇతర రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలతో కాంగ్రెస్ అధిష్ఠానం బిజీగా ఉండడంతో విస్తరణ సాధ్యపడలేదు. ఇప్పుడు అన్ని ఎన్నికలూ పూర్తయ్యాయి. అధిష్ఠానం కూడా తెలంగాణలో ప్రభుత్వంతోపాటు పార్టీ పనితీరుపైనా దృష్టి పెట్టింది. మరోవైపు మంత్రి పదవి కోసం చాలా కాలంగా నిరీక్షిస్తున్న ఎమ్మెల్యేలు ఇప్పటికైనా తమకు అవకాశం దక్కుతుందన్న ఆశాభావంతో ఉన్నారు. అయితే మంత్రి పదవి కోసం పోటీ పడుతున్న వారు పెద్దసంఖ్యలో ఉన్నారు. ఎవరికి వారు తమనే కేబినెట్‌లోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఒత్తిడి తెస్తున్నారు. మరికొందరైతే నేరుగా అధిష్ఠానం వద్దకే వెళ్లి అర్జీలు పెట్టుకుంటున్నారు. దీంతో సీఎం రేవంత్ ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారీ మంత్రివర్గ విస్తరణకు పార్టీ పెద్దల నుంచి అనుమతి కోసమే వెళ్లారంటూ ప్రచారం జరుగుతోంది. తాజాగా ఢిల్లీ వెళ్లిన సీఎం.. అటు నుంచి అటే సింగపూర్, దావోస్ పర్యటనలకు వెళ్లారు. ఆయన ఆ పర్యటనల నుంచి తిరిగి వచ్చాక ఈసారి విస్తరణ ఖాయమంటూ ప్రచారం జరుగుతోంది. కానీ, ఈసారి జరగబోయేది మంత్రివర్గ విస్తరణ కాదని, ప్రక్షాళన అని కొత్త ప్రచారం మొదలైంది.

### ఆ ముగ్గురిపై అధిష్ఠానం అసంతృప్తి?

ప్రస్తుతం మంత్రివర్గంలో ఉన్న ముగ్గురు మంత్రుల పనితీరుపై కాంగ్రెస్ అధిష్ఠానం అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. క్యాబినెట్ పనితీరుపై అధిష్ఠానం ఇటీవల సర్వే చేయించినట్లు, అందులోనే ఈ విషయం వెల్లడైనట్లు సమాచారం. కొద్దిరోజుల క్రితం జరిగిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చేసిన వ్యాఖ్యలు కూడా ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి. పలువురు మంత్రుల పనితీరు బాగాలేదని, వారు మెరుగుపడాలని ఆయన వ్యాఖ్యానించారు. అయితే ఆ ముగ్గురిని ఉద్దేశించే వేణుగోపాల్ ఈ వ్యాఖ్యలు చేశారని తెలుస్తోంది. వీరిలో ఒకరు పదే పదే వివాదాస్పద వ్యాఖ్యలు, చర్యలతో పార్టీకి, ప్రభుత్వానికి సమస్యగా మారుతున్న మంత్రి అని అంటున్నారు. మరో మంత్రిపై అవినీతి ఆరోపణలు వస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇంకొకరు పార్టీని, ప్రభుత్వాన్ని తగినవిధంగా సమర్థించకుండా సొంత ఎజెండాతో పనిచేస్తున్న మంత్రి అని ప్రచారం జరుగుతోంది. మంత్రివర్గ విస్తరణ సందర్భంగా ఈ ముగ్గురికి ఉద్వాసన పలకాలనే యోచనలో అటు అధిష్ఠానంతోపాటు ఇటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వీరి తొలగింపుతో ఖాళీ అయ్యే మూడు స్థానాలతోపాటు మరో నలుగురిని కొత్తగా క్యాబినెట్‌లోకి తీసుకుంటారని, రెండు బెర్తులను మళ్లీ ఖాళీగానే ఉంచుతారని అంటున్నారు. దీంతో పదవి కోల్పోయేది ఎవరో, కొత్తగా మంత్రులు అయ్యే ఏడుగురు ఎవరో అన్న ఉత్కంఠ నెలకొంది.

### విస్తరణలో జాప్యం అందుకే!

మంత్రివర్గ విస్తరణలో సామాజిక సమతుల్యతను కూడా పాటించాల్సి ఉండడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న 11 మంది మంత్రుల్లో.. సీఎం కాకుండా ముగ్గురు మంత్రులు రెడ్డి సామాజికవర్గం వారున్నారు. వీరితోపాటు మరో ముగ్గురు అగ్రకులాలకు చెందిన మంత్రులున్నారు. అంటే.. మొత్తం 11 మందిలో ఆరుగురు అగ్రకులాల వారే ఉన్నారు. మిగిలిన ఐదుగురిలో ఇద్దరు దళితులు (మాల, మాదిగలు ఒక్కొక్కరు చొప్పున), ఒకరు బీసీ, మరొకరు బీసీ మహిళ, ఇంకొకరు ఎస్టీ మహిళ (ఆదివాసీ) ఉన్నారు. ఎస్టీల్లో లంబాడా, బీసీల్లో యాదవ, ముదిరాజ్, మున్నూరుకాపు వంటి కొన్ని బలమైన సామాజిక వర్గాలకు, మైనారిటీలకు కేబినెట్‌లో చోటు దక్కలేదు. పైగా నాలుగు ఉమ్మడి జిల్లాలకు ప్రాతినిధ్యమే లేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం స్థానం దక్కని వర్గాలు, జిల్లాలకు విస్తరణలో చోటు కల్పించాల్సిన అవసరం ఏర్పడింది. అయితే.. ఆశావహుల్లో మాత్రం ఇప్పటికే ప్రాతినిధ్యం ఉన్న వర్గాల వారే ఉండడం పెద్ద సమస్యగా మారింది. కానీ, మంత్రి పదవి కోసం ఏడాదికి పైగా ఎదురుచూస్తున్నవారు పార్టీ నాయకత్వం తీరుతో విసిగిపోతున్నారు.

### రేసులో ముందంజలో..

అసెంబ్లీలో కాంగ్రెస్‌కున్న సంఖ్యా బలాన్ని బట్టి నాలుగు ఎమ్మెల్సీ సీట్లు దక్కనున్న సంగతి తెలిసిందే. ఈ నాలుగు సీట్లలో ఒక సీటు అగ్రకులానికి, ఒకటి ఎంబీసీలకు (అత్యంత వెనుకబడిన వర్గం), ఎస్సీ మాదిగ, ఎస్సీ మాలకు చెరో సీటు కేటాయించనున్నట్లుగా పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఎస్సీ మాదిగ నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపతకుమార్ పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. ఆయనతోపాటు పార్టీ నేతలు దొమ్మాటి సాంబయ్య, రాచమళ్ల సిద్దేశ్వర్ రేసులో ఉన్నారు. ఎస్సీ మాల నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. ఓసీల్లో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, టీపీసీసీ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జెట్టి కుసుమ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవనరెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ రేసులో మిగిలారు. ఎంబీసీల నుంచి సీనియర్ నేతల పేర్లను పరిశీలిస్తున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీపీఐకి ఒక సీటు కేటాయించాల్సి వస్తే మళ్లీ సమీకరణలు మారతాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం మంత్రి వర్గంలో ఆరు బెర్తులు ఖాళీగా ఉన్న సంగతి తెలిసిందే. అయితే ముదిరాజ్ సామాజిక వర్గ నేతను మంత్రిని చేస్తామంటూ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సీఎం రేవంతరెడ్డి ప్రకటించిన నేపథ్యంలో.. పార్టీలో ఆ సామాజిక వర్గం నుంచి ఉన్న ఏకైక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దాదాపు ఖరారైంది. అలాగే ఉమ్మడి నిజామాబాద్ నుంచి సుదర్శనరెడ్డికి మంత్రి పదవి కోసం సీఎం రేవంత్ రెడ్డి పట్టుపడుతున్నారు. అయితే రెడ్డి సామాజిక వర్గం నుంచి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి రామ్మోహనరెడ్డి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం.. సోషల్ ఇంజనీరింగ్‌కు ప్రాధాన్యమిస్తున్న నేపథ్యంలో విస్తరణలో రెడ్డి సామాజిక వర్గానికి ఒక సీటే కేటాయిస్తే.. ఈ ముగ్గురి ఆశలూ గల్లంతైనట్లేనంటున్నారు. పరిగి రామ్మోహనరెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డిలో ఒకరికి చీఫ్‌విప్ పదవి దక్కనున్నట్లు చెబుతున్నారు. ఇక.. వర్గీకరణ అంశం తెరపైకి వచ్చాక ఎస్సీ మాదిగ, మాల వర్గాల మధ్య పోటీ మరింత తీవ్రమైంది. మాల సామాజిక వర్గం నుంచి గడ్డం వివేక్ పోటీ పడుతుండగా.. మాదిగ సామాజిక వర్గం నేతలూ క్యాబినెట్లో బెర్తు కోసం పట్టు పడుతున్నారు. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి వివేక్‌తో పాటు ప్రేమ్‌సాగర్‌రావు కూడా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ఇక ముదిరాజ్ సామాజికవర్గంతో పాటు మరో బీసీ సామాజిక వర్గానికీ విస్తరణలో చోటు కల్పించాలంటూ బీసీ వర్గాల నేతలు ఒత్తిడి తెస్తున్నారు. ఎస్టీ లంబాడా వర్గం నుంచి బాలూనాయక్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించాలా.. లేక డిప్యూటీ స్పీకర్‌గా నియమించాలా అన్నదానిపై చర్చలు జరుగుతున్నాయి. మరోవైపున ముస్లింల నుంచి పార్టీ సీనియర్ నాయకులు ఎవరూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లేరు. ఎమ్మెల్సీ అమెరలీఖానకు మంత్రి పదవి ఇచ్చేంత సీనియారిటీ లేదు. క్యాబినెట్ ర్యాంకుతో షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారుగా నియమించిన నేపథ్యంలో ఈ వర్గానికి మంత్రి వర్గంలో చోటు కల్పించాలా.. వద్దా అనే చర్చా నడుస్తోంది. ఏదేమైనా నెలాఖరుకల్లా ఈ వ్యవహారం ఒక కొలిక్కి వచ్చే అవకాశం కనిపిస్తోంది.



# అమరావతిపై అదే విషం!

**జగన్‌కు ఎందుకంత ద్వేషం?**

**ఆర్థిక సంస్థలు రుణమిస్తుంటే వ్యతిరేకత ఎందుకు?**

**రాజధానికి నీళ్లలా డబ్బును ఖర్చుపెడుతున్నారని ఆరోపణ**

**విజయవాడను ముంపులో వదిలేశారంటూ చిచ్చుపెట్టే యత్నం**

**రాజధాని పనులకు టెండర్లు పిలుస్తారని దుగ్ధ**

అమరావతి రాజధాని పనులకు టెండర్లు పిలవడానికి అడ్డంకులు తొలగాయి. టెండర్లు పిలుచుకోవచ్చని, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మాత్రమే వాటిని ఖరారు చేయాలని సీఆర్‌డీఏ, అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ)లకు కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. దీంతో ప్రభుత్వానికి పెద్ద ఊరట లభించింది. కానీ అమరావతిపై నిలువెల్లా ద్వేషం నింపుకొన్న మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాత్రం దానిపై విషం చిమ్మడం మానలేదు. ప్రజాధనాన్ని నీళ్లలా ఖర్చుపెడుతున్నారని ఆరోపించారు. విజయవాడకు ముంపు ముప్పు పొంచి ఉంటే.. దానిని వదిలేసి.. అమరావతి ముంపుబారిన పడకుండా వరద కాలువలు నిర్మించడాన్ని ఆయన విమర్శించారు. తద్వారా ప్రజల్లో చిచ్చుపెట్టేందుకు ప్రయత్నించారు. ఓపక్క ప్రపంచబ్యాంకు రుణం అందకుండా విశ్వప్రయత్నాలు చేస్తూ.. ఇటు రాజకీయంగానూ రచ్చచేస్తున్నారన్న మాట.

రాజధాని పనులను అడ్డుకునేందుకు కొందరు పనిగట్టుకుని ప్రపంచబ్యాంకుకు ఫిర్యాదులు మీద ఫిర్యాదులు చేస్తున్నారు. ఇవన్నీ జగన్ తన పార్టీ వాళ్ల చేత చేయిస్తున్నవేనని చంద్రబాబు ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో ఉమ్మడి కృష్ణా-గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో.. మళ్లీ వారంతా అడ్డుకునే ప్రయత్నం చేస్తారన్న ఉద్దేశంతో వాస్తవ పరిస్థితిని తెలియచేస్తూ సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు ఎన్నికల సంఘానికి ముందుగానే లేఖ రాశారు. అమరావతిలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రూ.48,012.67 కోట్ల విలువతో చేపట్టేందుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చిందని.. అందులో రూ.14,874.53 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచామని అందులో తెలియజేశారు. కోడ్ కారణంగా రాజధాని ప్రాజెక్టు పనులను నిలుపుదల చేస్తే తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. గత కొన్నేళ్లుగా సుదీర్ఘ జాప్యం జరగడం వల్ల ఇప్పటికే ఖర్చు పెరిగిపోయిందని..ఆర్థిక ఇక్కట్లకూ దారి తీసిందని పేర్కొన్నారు. రాజధాని నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూల నుంచి రూ.31 వేల కోట్లు రుణంగా తీసుకున్నామని.. రాజధాని ప్రాజెక్టులు రాష్ట్రం మొత్తం అభివృద్ధి, , ఆర్థిక వృద్ధి, ఉపాధి, మౌలిక సదుపాయాలకు సంబంధించినవని గుర్తుచేశారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని టెండర్లు, కాంట్రాక్టుల కేటాయింపును కొనసాగించడానికి తగిన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. బిడి ్డంగ్ ఒప్పందాలను పూర్తి చేయడానికి కూడా అనుమతులు కోరారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) దీనిని పరిశీలించి కేంద్ర ఎన్నికల సంఘానికి పంపారు. టెండర్లు పిలవచ్చు గానీ, వాటిని ఖరారు చేయవద్దని ఈసీ ఆదేశించింది. కోడ్ ముగిశాకే ఖరారు చేయాలని స్పష్టం చేసింది.

### మళ్లీ ప్రపంచ బ్యాంకుకు ఫిర్యాదులు

రాజధాని అమరావతిపై విద్వేషం, విషం చిమ్మడం కొనసాగుతున్నాయి. అమరావతి అభివృద్ధికి ప్రపంచబ్యాంకు రుణం రాకుండా సైంధవులు కొందరు దుష్ట పన్నాగాలు పన్నుతున్నారు. రాజధాని నిర్మాణం తొలి దశకు ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) కలిసి రూ.15,500 కోట్లు రుణమిచ్చేందుకు అంగీకరించాయి. ఇందులో ప్రపంచబ్యాంకు వాటా రూ.6,800 కోట్లు. తొలి వాయిదా ని?ధుల విడుదలకు సర్వం సిద్ధం కావడంతో సీఆర్‌డీఏ పలు పనులకు టెండర్లు కూడా పిలిచింది. ఈ దశలో రాజధాని పనులకు రుణం మంజూరుకు సరైన విధానం అవలంబించలేదంటూ తాజాగా ప్రపంచబ్యాంకు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. వీటిపై ఆ బ్యాంకు ఇన్‌స్పెక్షన్ టీమ్ ప్యానెల్ పరిశీలన ప్రారంభించింది. దీనివల్లే బ్యాలెన్స్ టెండర్లను పిలవడంలో కొంత జాప్యం నడుస్తోంది. దీనికి తోడు శాసనమండలి ఎన్నికల కోడ్ కూడా అమల్లోకి రావడంతో.. టెండర్ల అంశాన్ని సీఆర్‌డీఏ ఎన్నికల సంఘం (ఈసీ) దృష్టికి తీసుకెళ్లింది. కోడ్‌కు ముందే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లు, ఐఏఎస్ అధికారుల క్వార్టర్స్, ప్రిన్సిపల్ సెక్రటరీల బంగళాలు, హ్యాపీనెస్ట్, రోడ్ల అభివృద్ధి పనులు, ఎల్‌పీఎస్ ఇన్ఫ్రా వంటి పనులకు సీఆర్‌డీఏ ఇప్పటికే చాలా వరకు టెండర్లు పిలిచింది. అలాగే అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) కూడా రాజధాని ప్రధాన రోడ్ల నిర్మాణం, అమరావతి వరద విపత్తు ప్రణాళికలో భాగంగా చేపట్టాల్సిన కొండవీడు వాగు, గ్రావిటీ కెనాల్, పాలవాగు విస్తరణాభివృద్ధి పనులకు టెండర్ నోటిఫికేషన్లు ఇచ్చింది. పంపింగ్ స్టేషన్లు, అదనపు రిజర్వాయర్ల నిర్మాణానికీ టెండర్లు పిలిచింది. వీటిలో చాలా పనులకు ఈ నెలలోనే టెండర్లు ఖరారు చేయాల్సి ఉంది. ఈసీ నుంచి వీటికి అభ్యంతరాలు రాకపోవచ్చని ఉన్నతాధికారులు అంటున్నారు.

### చంద్రబాబు సీఎం కాగానే..

నిరుడు అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం సాధించి చంద్రబాబు మళ్లీ సీఎం కాగానే.. రాజధాని నిర్మాణానికి రుణసమీకరణపై దృష్టి సారించారు. దీంతో జగన్ అనుకూలురు రంగంలోకి దిగారు. రుణం ఇవ్వొద్దని ప్రపంచబ్యాంకుకు ఫిర్యాదులు పంపారు. రైతులు స్వచ్ఛందంగా భూములివ్వలేదని.. బలవంతంగా వారి నుంచి లాక్కున్నారని గతంలో చేసిన ఆరోపణలే మళ్లీ చేశారు. దీంతో బ్యాంకు ఉన్నతాధికారులు, కేంద్ర ఆర్థిక శాఖ అధికారులు కలిసి వచ్చి అమరావతిలో పర్యటించారు. ఈ ఫిర్యాదుల్లో నిజానిజాలపై స్వయంగా ఆరాతీశారు. క్షేత్ర స్థాయిలో రైతులను కలిసి వారి అభిప్రాయాలు తీసుకున్నారు. ఆ తర్వాత లోతైన పరిశీలన చేసి కేంద్రప్రభుత్వాన్ని సంప్రదించిన తర్వాతే ఏడీబీతో కలిసి 15,500 కోట్ల రుణం





ఇవ్వాలని నిర్ణయించింది. అయినా మళ్లీ తాజాగా ఫిర్యాదులు వెళ్లాయి. అమరావతి ప్రకృతి విపత్తులకు కేంద్రబిందువని.. ఇటీవల వరదలు ముంచెత్తాయని ఇంకోసారి ఫిర్యాదు చేశారు. వీటిపైనా ప్రపంచ బ్యాంకు విచారించింది. అమరావతికి శాశ్వత వరద ప్రణాళిక రూపొందిస్తున్నామని సీఆర్డీఏ కార్యాచరణ ప్రణాళికను వివరించడంతో బ్యాంకు సంతృప్తి వ్యక్తం చేసింది. వరద ప్రణాళికల విషయంలో ప్రపంచ బ్యాంకు కూడా అనేక మార్పులను సూచించడం గమనార్హం. ఇప్పుడేమో.. రుణం మంజూరులో తగిన విధానాన్ని పాటించలేదని ఆ బ్యాంకు దేశీయ బృందంపై ఆరోపణలు మొదలుపెట్టారు. దీంతో ప్రపంచబ్యాంకు ఇన్‌స్పెక్షన్ ప్యానెల్ క్షుణ్ణంగా పరిశీలన చేస్తోంది. టెండర్ల పర్యవేక్ష క కమిటీ ఒక్కో టెండర్‌కు ఎన్ని కొర్రీలు వేసింది.. ఎంత పకడ్బందీగా టెండర్ల నిబంధనల రూపకల్పన జరిగింది వంటి వాటిని సాక్ష్యాలతో వివరిస్తుండడంతో తాజా ఆరోపణలు వీగిపోవడం ఖాయమని ప్రభుత్వ వర్గాలు విశ్వసిస్తున్నాయి. విద్వేష ఫిర్యాదుల వెనుక వైసీపీ నేతలు ఉన్నారని.. వారే ఈ పనులు చేయిస్తున్నారని సర్కారు ఆగ్రహం వ్యక్తంచేస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతిని ఏ విధంగా విధ్వంసం చేశారో అందరికీ తెలిసిందే. ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత కూడా దానిపై వారికి ద్వేషం పోలేదు. జగన్ రోతపత్రికలో రాజధానిపై విషం చిమ్మడం పతాకస్థాయికి చేరింది. అమరావతి టెండర్లలో ఘోరాలు, గోల్‌మాల్ జరిగిపోతున్నాయంటూ అసత్య వార్తలను వండివారుస్తోంది. ఇటీవల రాజధానిలో ప్రధాన రోడ్లు, దాని అనుసంధాన మౌలిక వసతుల పనులకు కలిపి టెండర్లు పిలిస్తే.. భారీగా అంచనాలు పెంచేసి వేర్వేరుగా టెండర్లు పిలిచినట్లు తప్పుడు కథనం రాసింది. ఇలాంటి వార్తలతో ప్రజలను, ప్రపంచ బ్యాంకును తప్పుదారి పట్టించాలన్నది వైసీపీ నేతల వ్యూహంగా ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అమరావతి నిర్మాణం ముందుకు సాగకుండా చేయడమే వారి దురుద్దేశమని అంటున్నాయి.

### గోల్‌మాల్ ఆరోపణలు

రాజధాని పునిర్నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్లేందుకు హడ్కో రూ.11 వేల కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. దీనికి సంబంధించిన రుణ మంజూరు పత్రాలను హడ్కో అధికారులు.. సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబుకు స్వయంగా అందించారు. ఇదే సమయంలో జగన్ పత్రిక అమరావతిపై విషం కక్కడం ఉధృతం చేసింది. అధికారం పోయినా అమరావతి నిర్మాణాన్ని జగన్ సహించలేకపోతున్నారు. తన రోత పత్రిక ద్వారా అమరావతి రాజధానిలో ప్రధాన రహదారుల నిర్మాణ పనులకు పిలిచిన టెండర్లలో గోల్‌మాల్



జరిగిందంటూ అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి అమరావతి రాజధానిలో పిలిచిన 11 రోడ్ల టెండర్లన్నీ ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి తీసుకున్న రుణంతో చేపడుతున్నారు. ఈ పనులకు టెండర్ల ప్రక్రియ నుంచి క్షేత్ర స్థాయిలో పనులు జరిగే వరకు ప్రపంచబ్యాంకు, ఏడీబీల కనుసన్నలలో వాటి పర్యవేక్షణలోనే జరగాలి. జగన్ పత్రిక ప్రచురించిన కథనం ప్రకారం ప్రపంచబ్యాంకు, ఏడీబీలు కూడా ఏడీసీ అధికారులతో కుమ్మక్కు అయితేనే గోల్‌మాల్ సాధ్యం అవుతుంది. అప్పులు ఇచ్చే సంస్థలు వాటి ద్వారా ప్రయోజనాలు జరగాలని కోరుకుంటాయి. కానీ వాటి పేరుతో దోచుకుతినడాన్ని ప్రోత్సహిస్తాయా ? ప్రపంచ బ్యాంకు, ఏడీబీ వంటి ప్రసిద్ధ సంస్థలు ఇలాంటి పనులు చేస్తాయంటే ఎవరైనా నమ్ముతారా? పైగా ఆరోపణలను దృష్టిలో ఉంచుకుని ఆయా రుణ సంస్థలు టెండర్ నిబంధనలను స్వయంగా రూపొందిస్తున్నాయి. స్వయంగా ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నాయి. కొంత ఆలస్యమైనా పర్వాలేదని.. ఎక్కడా లోపాలకు తావివ్వకూడదని ప్రభుత్వంతోపాటు ఆ సంస్థలు కూడా భావిస్తున్నాయి. టెండర్లకు కఠిన షరతులు



విధించాయి. సీఆర్డీఏ, ఏడీసీలు రూపొందించిన టెండర్లను చాలా సూక్ష్మస్థాయిలో పరిశీలిస్తున్నాయి. దీనివల్లే టెండర్లు పిలవడంలో జాప్యం జరుగుతోంది. ఇప్పటి వరకు కేవలం రూ.20 వేల కోట్ల మేర మాత్రమే టెండర్లను పిలిచారంటే.. టెండర్ల ప్రక్రియను రుణ సంస్థలు ఎంతగా పరిశీలిస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. అమరావతిలో చేపట్టే రోడ్లు గతంలోనే చేపట్టినప్పటకీ తీవ్రంగా డ్యామేజీ అయ్యాయి. అమరావతి రాజధానిలో రోడ్లకు అతుకుల బొంతలు వే సే పరిస్థితి ఉండదు. డ్యామేజీ అయిన ప్రాంతాలలో పూర్తిగా రోడ్లను తొలగించి నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంటుంది. డ్యామేజీ కూడా చాలా ఎక్కువుగా ఉంది. అమరావతిలో ప్రధాన రోడ్ల పునర్నిర్మాణ పనులలో భాగంగా కేవలం ఒక్క రోడ్డు పోర్షన్‌లోనే రూ.30 కోట్ల మేర అంచనాలను పెంచేశారని జగన్ పత్రిక అసత్యం అచ్చువేసింది. ప్రధాన రోడ్ల పునర్నిర్మాణ పనులతో పాటుగా అనేక కాంపోనెంట్ పనులతో కలిపి ఏడీసీ టెండర్లు పిలిచింది. ఆ కాంపోనెంట్ పనుల్లో వరదనీటి మళ్లింపు కాల్వలు, వాటర్ సప్లై నెట్‌వర్క్, సీవరేజీ నెట్‌వర్క్, యుటిలిటీ డక్ట్స్ , రీయూజ్ వాటర్ లైన్స్, పెడస్ట్రియల్ ట్రాక్స్, సైకిల్ ట్రాక్, అవెన్యూ ప్లాంటేషన్, స్ట్రీట్ ఫర్నిచర్ వంటివి ఉన్నాయి. వీటన్నిటికీ గుత్తగా టెండర్లు పిలిస్తే.. జగన్ దీనిని దాచి విమర్శల విషం కక్కుతున్నారు. అమరావతిలో శాశ్వత రాజధాని నిర్మాణ పనుల దగ్గర నుంచి ప్రారంభించిన విధ్వంసం ఆ తర్వాత క్రమంగా అన్ని పనులను నిలిపేస్తూ అమరావతిని ఆయన కకావికలం చేశారు. ఆయన నిర్వాకం అమరావతికి తీరని నష్టాన్ని తెచ్చి పెట్టింది. అప్పటికీ, ఇప్పటికీ స్టాండర్డ్ షెడ్యూల్ రేట్స్ (ఎస్ఎస్ఆర్) 25 శాతం మేర పెరిగిపోయాయి. దీనికితోడు జీఎస్టీ కూడా 12 శాతం నుంచి 18 శాతానికి పెరిగింది. రాజధానిలో రోడ్ల పునరుద్ధరణ పనులకు సంబంధించిన పనులలో భూగర్భ విద్యుత కేబుల్స్, ఇంటర్నెట్ తదితర కేబుల్స్‌కు సంబంధించి దుర్భేధ్యమైన ఆర్‌సీ డక్ట్స్ నిర్మించాల్సి ఉంటుంది. స్టామ్ వాటర్ డ్రెయిన్స్, మంచినీటి పైపులైన్ల నెట్‌వర్క్, అండర్ గ్రౌండ్ డ్రెయినే పనులు సాధారణమైనవి కావు. సెంట్రల్ మీడియం అభివృద్ధి చేయటంతో పాటు కిలోమీటర్ల కొద్దీ సైకిల్ ట్రాక్స్ ఏర్పాటు వంటి పనులు కూడా చిన్నవి కావు. ఈ పనులన్నింటినీ దాచి పెట్టి రోడ్డు పోర్షన్‌తో ముడిపెట్టి అంచనాలు పెరిగిపోయాయంటూ జగన్ అసత్యాలు వల్లెవేస్తున్నారు.

# అప్పులు తీర్చడానికేనట!



విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించవద్దని అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్ నిర్విరామంగా కృషిచేశారు. ఢిల్లీ వెళ్లిన ప్రతి సారీ ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక, ఉక్కు మంత్రులు నిర్మలా సీతారామన్, హెచ్‌డీ కుమారస్వామిని కలిసి.. నష్టాల బారి నుంచి బయటపడేయాలని.. తగు ఆర్థిక సాయం అందిస్తే తప్పకుండా లాభాల్లోకి వస్తుందని నచ్చజెప్పారు. 2014–24 నడుమ లోక్‌సభలో పూర్తి మెజారిటీ ఉన్న కాలంలో.. మోదీ ప్రభుత్వం దశలవారీగా దానిని ప్రైవేటీకరించాలని చూసింది. 2019–24 మధ్య అధికారంలో ఉన్న జగన్ ఇందుకు పూర్తిగా సహకరించారు. స్టీల్ ప్లాంటుకు రాష్ట్రప్రభుత్వం సేకరించి ఇచ్చిన భూములను తీసుకుని అక్కడ రాజధానిని నిర్మించాలని కలలు గన్నారు. ఆ ఉద్దేశంతోనే స్టీల్ ప్లాంటును అమ్మడానికి కంపెనీలను కూడా తీసుకురావాలని ప్రయత్నించారు. అయితే అప్పటికే జిందాల్, అదానీ లైన్‌లో ఉండడంతో మోదీ చెప్పినట్లు చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ ఉక్కు ఫ్యాక్టరీ ఉద్యోగులు, కార్మికులు నాలుగేళ్లుగా ఉద్యమిస్తున్నారు. ఎన్నికల సమయంలోనే గాక అంతకుముందు కూడా లోకేశ్, చంద్రబాబు స్టీల్ ప్లాంటును పరిరక్షించి తీరతామని శపథం చేశారు. గద్దెనెక్కాక ఆ మాట నిలబెట్టుకున్నారని చెప్పవచ్చు. కేంద్రంపై వారు తెచ్చిన ఒత్తిడి ఫలితమిచ్చింది. స్టీల్ ప్లాంటును ఆదుకోవడానికి మోదీ ప్రభుత్వం రూ.11,440 కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించింది. అధికారంలో కొనసాగాలంటే టీడీపీ మద్దతు తప్పనిసరైన పరిస్థితుల్లో ప్రధాని మోదీ కూడా రూటు మార్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఆర్థిక ప్యాకేజీని బహుమతిగా ప్రకటించారు. వాస్తవానికి స్టీల్ ప్లాంటు నష్టాల్లో ఉండడంతో

చంద్రబాబు, లోకేశ్ 'ఉక్కు సంకల్పం'తో
విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ
అయినా భయాందోళనలు సృష్టిస్తున్న కేంద్ర అధికారులు
మోదీ సర్కారు ఇచ్చినా మొండిచెయ్యి చూపే యత్నం
ఆర్థిక సాయమంతా అప్పులు తీర్చడానికేనని స్టీల్ సెక్రటరీ స్పష్టీకరణ
సొంత గనులు రావని.. సెయిల్‌లో విలీనం చేయబోమని వెల్లడి
కార్మిక వర్గాల్లో ఆగని అలజడి



పెట్టుబడులు ఉపసంహరించాలని కేంద్ర కేబినెట్ గతంలోనే నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ రంగ సంస్థను కాపాడాలని, ప్యాకేజీ ప్రకటించాలని.. కనీసం బ్యాంకుల ద్వారానైనా రుణాలు ఇప్పించాలని కోరినా గతంలో వినిపించుకోలేదు. అంతెందుకు.. మోదీ 3.0 ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి ఇదే కోరినా.. కుదరదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నిర్మొహమాటంగా తిరస్కరించారు. ఇదే సమయంలో చంద్రబాబు లేఖాస్త్రం సంధించారు. స్వయంగా మోదీని కలిశారు. రాష్ట్ర ప్రతిష్ఠతో ముడిపడిన స్టీల్‌ప్లాంట్.. ప్రజల భావోద్వేగానికి సంబంధించిందని.. 'విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు' నినాదంతో అది ఏర్పాటైందని గుర్తుచేశారు. నిర్మలా సీతారామన్‌కు కూడా వినతులు సమర్పించారు. చివరకు మోదీ సానుకూలత వ్యక్తంచేశారు. అటు కుమారస్వామి కూడా ఆయనతో పాటు నిర్మలతో చర్చలు జరిపారు. 'ఓసారి ఢిల్లీ వచ్చిన చంద్రబాబు తెల్లవారుజామున 1.30 గంటలకు ఆర్థిక మంత్రి అపాయింట్‌మెంట్ ఇస్తే... ఓపికగా వేచి ఉండి ఆమెతో సమావేశమై చర్చించారు. అంతటి చిత్తశుద్ధి చూపించబట్టే ఆర్థిక ప్యాకేజీ దక్కింది' అని కుమారస్వామి స్వయంగా వెల్లడించడం గమనార్హం. స్టీల్‌ప్లాంట్‌ను నిలబెడతామని హామీ ఇచ్చామని, దాన్ని నిలుపుకోవడానికి సహకరించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ప్రత్యేకంగా కోరారు. విశాఖ ఎంపీ శ్రీభరత్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు.. ఇలా అందరూ కలిసి ఒత్తిడి తేవడం వల్లే సాధ్యమైందన్నారు.

### అంతా కలిసి పనిచేస్తే సాధ్యమే..

ఈ ప్యాకేజీని ఎలా సద్వినియోగం చేసుకోవాలో ఫ్యాక్టరీ యాజమాన్యానికి, ఉద్యోగ, కార్మిక వర్గాలకు వివరించేందుకు కుమారస్వామి స్వయంగా విశాఖకు వచ్చారు. 'విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను దేశంలో నంబర్‌వనగా నిలపాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. దీనికి ఉద్యోగులు, కార్మికులు సహకరించాలి. వికసిత్ భారత్‌లో భాగంగా 2030 నాటికి 300 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేయాలని ప్రధాని మోదీ లక్ష్యం విధించారు. దానిని సాధించడానికి అందరం చిత్తశుద్ధితో పనిచేయాలి. వాస్తవానికి గతంలో ఈ స్టీల్‌ప్లాంట్ మంచి లాభాల్లో ఉండేది. 3 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేసినప్పుడు రూ.1,300 కోట్ల లాభం వచ్చింది. అప్పుడే నవరత్న హోదా వచ్చింది. 2015–16లో ఆరు మిలియన్ టన్నుల ఉత్పత్తి కోసం విస్తరణకు వెళ్లారు. ఈ క్రమంలో అప్పులు తీసుకున్నారు. తర్వాత సొంత గనులు, ఎటువంటి ముడిపదార్థాల భరోసా లేకుండా మరో మిలియన్ టన్ను ఉత్పత్తి సామర్థ్యం పెంచారు. అక్కడి నుంచి తిరోగమనం ప్రారంభమైంది. నేను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే జూలైలో ఇక్కడకు వచ్చా. అప్పుడు రూ.26 వేల కోట్ల అప్పులు ఉండేవి. ఇప్పుడు రూ.35 వేల కోట్లకు పెరిగాయి. ఇటువంటి సంస్థకు ఆర్థిక ప్యాకేజీ ఇవ్వడం అసాధ్యమే అయినా చంద్రబాబు, లోకేశ్ సహా రాష్ట్ర నాయకులంతా కలిసి ఒత్తిడి తేవడం వల్ల సాధ్యమైంది. నిజానికి మేమంతా రూ.17 వేల కోట్ల సాయం అడిగాం. తొలుత రూ.1,650 కోట్లు ఇచ్చి, మొత్తం ప్యాకేజీ రూ.11,440 కోట్లుగా ప్రకటించారు. ప్రస్తుతం రెండు బ్లాస్ట్ ఫర్నేసుల ద్వారా 14వేల టన్నుల ఉత్పత్తి అవుతోంది. ఇదే స్ఫూర్తితో మరింత కష్టపడి మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను కూడా ప్రారంభించి ఉత్పత్తిని 20 వేల నుంచి 24వేల టన్నులకు పెంచాలి' అని సూచించారు. ఆ లక్ష్యం సాధించగలిగితే కష్టాలన్నీ తీరిపోతాయని, ఏడాదిలోనే స్టీల్‌ప్లాంట్ లైన్‌లోకి వస్తుందని





స్పష్టం చేశారు. ప్రధానికి తాను ఇదే విషయం చెప్పానన్నారు. ప్రస్తుతం జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందని, రెండు, మూడు నెలలు ఆగితే ప్రతినెలా జీతం ఇచ్చేందుకు యత్నిస్తామని ఉద్యోగులు, కార్మికులకు భరోసా ఇచ్చారు. ఇకపై తరచూ స్టీల్‌ప్లాంట్‌కు వచ్చి, అభివృద్ధిని సమీక్షిస్తానని చెప్పారు.

**సైంధవుల్లా కేంద్ర అధికారులు..**

రాజకీయ కోణంలో ఫ్యాక్టరీ సమస్య పరిష్కారానికి నాయకులు చేసిన ప్రయత్నం చాలా వరకు సానుకూల ఫలితాలిచ్చింది. కానీ కేంద్ర ఉక్కు శాఖ అధికారులు మాత్రం సైంధవుల్లా తయారయ్యారు. ఎలాగైనా విక్రయించాలనే కంకణం కట్టుకున్నట్లు కనబడుతోంది. మోదీ సర్కారు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తే వీరు మాత్రం పీటముడి వేయాలని చూస్తున్నారు. ఉద్యోగులను అయోమయంలోకి నెడుతున్నారు. ఉక్కు కార్యదర్శి సందీప్ పౌండ్రక్ ఇటీవల కుమారస్వామి పర్యటనకు ముందు రోజు ఢిల్లీ నుంచి విశాఖ వచ్చారు. ప్లాంటులో ఎంపిక చేసిన 250 మంది యువ ఎగ్జిక్యూటివ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఒక్క సానుకూల మాట మాట్లాడిన పాపానపోలేదె. 'కేంద్రం అందిస్తున్న రూ.11,440 ప్యాకేజీని బ్యాంకుల రుణాలు, అప్పులు తీర్చడానికే ఉపయోగిస్తారు. ఇంతకు ముందు అందజేసిన రూ.1,650 కోట్లు ఈ కొత్త ప్యాకేజీ రూ.11,440 కోట్లలో భాగమే. మూడు బ్లాస్ట్ ఫర్నేసులను పూర్తిస్థాయిలో నడపాల్సిన బాధ్యత ఉద్యోగులదే. జీతాలు, బకాయిలు, పదోన్నతులు, ఇంక్రిమెంట్ల విషయంలో ప్రభుత్వ జోక్యం చేసుకోదు. స్థానిక యాజమాన్యమే దానికి బాధ్యత వహిస్తుంది. వారితోనే మాట్లాడుకోవాలి. స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయించే పరిస్థితి లేదు. సెయిల్‌లో విలీనం చేయడం కూడా కుదరదు. ప్రైవేటీకరణ అంశంపై పార్లమెంటులో నిర్ణయం తీసుకోవాలి. దానిని లాభాల్లోకి తీసుకురావడం ఉద్యోగులు, కార్మికుల బాధ్యతే' అని చెప్పడం కలకలం రేపింది. ఇక్కడ జీతాలు అడిగితే ఢిల్లీ అధికారులు చెబితేనే ఇస్తామని ఫ్యాక్టరీ ఉన్నతాధికారులు చెబుతున్నారు. పూర్తి జీతాలు ఇవ్వకుండా ఆపుతున్నది ఢిల్లీ పెద్దలేనని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సెక్రటరీ వ్యాఖ్యలు వారిలో మరింత భయానికి కారణమయ్యాయి. ఇంకోవైపు.. రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని ఎలా ఉపయోగిస్తారనే అంశంపై ఉద్యోగ వర్గాల్లో అనేక సందేహాలున్నాయి. ఆగస్టులో ప్రారంభిస్తామని ప్రకటించిన బ్లాస్ ఫర్నేస్–3 కోసం అవసరమైన ముడి పదార్థాలను.. కమీషన్ల కోసం ఇప్పుడే కొనడానికి ఉన్నతాధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి బీజేపీలో కొందరు నాయకులు సహకరిస్తున్నారు. ఆరు నెలల ముందే ముడి పదార్థాలు కొనే సంప్రదాయం ప్లాంటులో లేదు. అవి అంత ముందుగా కొని పెట్టుకోవలసినవి కూడా కావు. కోట్ల రూపాయల్లో వచ్చే కమీషన్లకు ఆశ పడి కొందరు ఉన్నత స్థాయిలో చేస్తున్న అవినీతి ఇది. తప్పుడు నిర్ణయాలన్నీ యాజమాన్యం తీసుకొని, కార్మికులు, ఉద్యోగుల వల్ల నష్టాలు వస్తున్నాయని ప్రచారం చేయడం పరిపాటిగా మారింది.


# ఆర్జీవీని నమ్మొచ్చా?

**ఒక శివ.. ఒక రంగీలా.. ఒక సత్య.. ఒక కంపెనీ.. ఒక సర్కార్.. ఇలా రామ్ గోపాల్ వర్మ అనే దర్శకుడు ఒకప్పుడు వెండి తెర మీద ఎలాంటి అద్భుతాలు ఆవిష్కరించాడో తెలిసిందే. కానీ అదే దర్శకుడు గత పది పదిహేనేళ్లలో ఎలాంటి చెత్త సినిమాలు తీశాడో కూడా చెప్పాల్సిన పని లేదు. కొన్ని సినిమాల పేర్లు ప్రస్తావించి పైన చెప్పుకున్న చిత్రాల దర్శకుడే వీటిని తీశాడు అంటే నమ్మశక్యం కాదు. వర్మ డైహార్డ్ ఫ్యాన్స్ కూడా ఆయన మీద పూర్తిగా ఆశలు కోల్పోయి తనను పట్టించుకోవడం మానేశారు. నాసిరకం పొలిటికల్ ప్రాపగండా సినిమాలు.. బిగ్రేడ్ చిత్రాలు తీసుకుంటూ తన విలువను పూర్తిగా పోగొట్టుకున్నాడు వర్మ. కానీ తానేం చేసినా దాని గురించి సమర్థించుకోవడం అలవాటైన వర్మ.. పడిపోయిన తన ప్రమాణాల గురించి ఎప్పుడూ ఆత్మపరిశీలన చేసుకోవడం, పశ్చాత్తాపం వ్యక్తం చేయడం కనిపించదు. కానీ ఇప్పుడు ఉన్నట్లుండి ఆయన తనకు జ్ఞానోదయం అయినట్లు మాట్లాడుతుండడం ఆశ్చర్యం కలిగించే విషయం.**

తన కెరీర్లో బెస్ట్ ఫిలిమ్స్‌లో ఒకటిగా నిలిచిన 'సత్య' సినిమాను 27 ఏళ్ల తర్వాత చూశాక తనలో ఏదో రియలైజేషన్ వచ్చేసినట్లు వర్మ ఇటీవల ట్విట్టర్లో ఒక పోస్టు పెట్టాడు. ఆ సినిమాను ఇప్పుడు చూసుకుంటే కన్నీళ్లు వచ్చేశాయని.. అంత గొప్ప సినిమా తీశాక తాను మళ్లీ అలాంటి మ్యాజిక్‌ను రీక్రియేట్ చేయడానికి ప్రయత్నించకపోవడం పొరపాటని వర్మ అన్నాడు. అంతటితో ఆగకుండా ఇకపై మంచి సినిమాలే తీస్తానని శపథం చేశాడు. ఈ క్రమంలోనే 'సిండికేట్' అనే సినిమాను అనౌన్స్ చేశాడు. ఇది తన కెరీర్లోనే బిగ్గెస్ట్ ఫిలిం అని వర్మ ప్రకటించుకున్నాడు. తాను గత కొన్నేళ్లుగా చేసిన సినిమా పాపాలన్నింటినీ కడిగేసే ఒకే ఒక్క చిత్రంగా 'సిండికేట్'ను వర్మ అభివర్ణించాడు. ఈ సినిమాకు పని చేసే నటీనటులు, టెక్నీషియన్ల వివరాలను త్వరలో పంచుకుంటానని వర్మ వెల్లడించాడు. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్ ప్రధాన పాత్ర పోషించే అవకాశాలున్నట్లు సమాచారం. విక్టరీ వెంకటేష్‌ను కూడా ఓ పాత్ర కోసం సంప్రదిస్తున్నాడట వర్మ.



ఐతే చాలా ఏళ్ల నుంచి తాను తీస్తున్న సినిమాలతో పూర్తిగా క్రెడిబిలిటీ కోల్పోయాడు వర్మ. ఈ స్థితిలో ఆయనతో సినిమా చేయడానికి పేరున్న నటులు ఒప్పుకుంటారేమో కానీ.. తన సినిమాలు చూడ్డానికి ప్రేక్షకులు థియేటర్లకు వస్తారా అన్నదే సందేహం. వర్మ అంతగా వాళ్ల నమ్మకాన్ని కోల్పోయాడు మరి. ఇప్పుడు తాను మారిపోయానని, మంచి సినిమా తీస్తానని ఒక స్టేట్మెంట్ ఇచ్చినంత మాత్రాన ఆయన్ని నమ్మి ప్రేక్షకులు థియేటర్లకు వస్తారా అన్నది సందేహం.



# సర్వం స్వాహా!

జగన్ ఐదేళ్ల అరాచక పాలనలో యథేచ్ఛగా వనరుల దోపిడీ

అధికారం అండతో వైసీపీ నేతల దాదాగిరి

చేతులు మారిన వేల ఎకరాల భూములు

ఇసుక, గనులు, రేషన్‌లో భారీ అక్రమార్జన

మద్యంలోనే తాడేపల్లికి 3,100 కోట్ల ముడుపులు

నంబర్ టూ పెద్దిరెడ్డి ఆర్జన వేల కోట్లు


అరాచకాల పిన్నెల్లి సంపాదన 1000 కోట్లపైనే

కార్మికుల శ్రమ దోచుకున్న శంకరనారాయణ

రోజా ఇలాకాలో మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి బేరం

కడప జిల్లాలో 3500 ఎకరాల ఆక్రమణ

ఎవరైనా దౌర్జన్యాలు, అక్రమాలకు పాల్పడితే పోలీసులు, సంబంధిత అధికారులకు బాధితులు ఫిర్యాదు చేస్తారు. అవసరమైతే ప్రజాప్రతినిధులనూ కలసి మొరపెట్టుకుంటారు. అలాంటిది.. అధికార పార్టీ నేతలే దాదాగిరి చేస్తే? వారికి అధికారులూ వత్తాసు పలికితే? బాధితులు ఎవరికి చెప్పుకోవాలి? గత ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రంలో ఇదే పరిస్థితి. అంతా మాఫియా మోడల్. వైసీపీ నేతల కన్నుపడిందంటే... విలువైన ప్రభుత్వ, ప్రైవేటు భూములు, కొండలు, చెరువులు, చివరకు రోడ్లు కూడా స్వాహా. ప్రకృతి వనరులు ఇసుక, గనులు దోపిడీ. రేషన్ మాఫియా, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు. ఉద్యోగులకు పోస్టింగ్‌లు కావాలంటే లంచాలు. ఇక సెటిల్మెంట్లు, బెదిరింపులు, దౌర్జన్యాలు, దాడులు.. ఎవరైనా ఎదిరిస్తే అక్రమ కేసుల బనాయింపు. ఇలా జగన్ ఐదేళ్ల ఏలుబడిలో జరిగిన దందాలకు అంతూపొంతూ లేదు. సినిమాలుగా తీస్తే లెక్కలేనన్ని సీక్వెల్స్ అవుతాయి! సీరియల్‌గా తీస్తే ఏళ్ల తరబడి సాగుతుంది. రాష్ట్ర స్థాయిలో వైసీపీ పెద్దలు దున్నేయగా... జిల్లాల స్థాయిలో అప్పటి ఎమ్మెల్యేలు, మంత్రులు కుమ్మేశారు. జగన్ 'ఘనత' రాష్ట్రం, దేశ సరిహద్దులు దాటి ఖండాంతరాలకు చేరగా... ఆయన పార్టీ నేతలు తమకు చేతనైనంతగా చెలరేగిపోయారు. గత ఐదేళ్లలో ఒక్క మద్యంలోనే తాడేపల్లి ప్యాలెస్‌కు రూ.3,100 కోట్ల ముడుపులు అందగా... కింది స్థాయి నేతలూ అధికారం అండతో కోట్లకు పడగలెత్తారు. అడ్డగోలుగా జనం మీద పడి దోచుకున్నారు. ప్రకృతి వనరులను చెరబట్టారు. ప్రతి పనిలో వాటాలు, ముడుపులు పిండుకున్నారు. ప్రైవేటు, ప్రభుత్వ భూములన్న తేడా లేకుండా బెదిరించి మరీ వేల ఎకరాలు సొంతం చేసుకున్నారు. ఒక్క కడప జిల్లాలోనే దాదాపు 3,500 ఎకరాలు అక్రమించినట్టు అంచనా. కొండలను పిండిచేసి ఆనక మాయమే చేసేశారు. చెరువులు, నదులను తాగేశారు. ఇలా కూడా అవినీతి చేయొచ్చా అని అక్రమార్కులే విస్తుపోయేలా సంపాదించేశారు. దౌర్జన్యాలు, దందాలు, దాడులకు లేక్కలేదు. రాష్ట్రంలో ఎవరూ ఎదురు చెప్పలేని పరిస్థితి. తవ్వే కొద్దీ అవినీతి లీలలు బయటపడుతూనే ఉన్నాయి.



### తాడేపల్లికి 'జే' ట్యాక్స్

మద్యనిషేధం చేస్తామన్న జగన్.. సీఎం కాగానే ప్రభుత్వ మద్యం దుకాణాలు తెరిపించారు. కప్పం కట్టని బ్రాండ్ కంపెనీలను రాష్ట్రం నుంచి తరిమేశారు. ముడుపులు ఇచ్చిన కంపెనీలకే ఆర్డర్లు ఇచ్చారు. రాష్ట్రంలోని డిస్టిలరీలను బలవంతంగా లాక్కున్నారు. కనీవినీ ఎరుగని సొంత బ్రాండ్లను సృష్టించారు. మద్యం తయారీ నుంచి అమ్మకాల వరకూ అంతా తన గుప్పిట్లో పెట్టుకున్నారు. ప్రభుత్వ షాపుల్లో నాసిరకం బ్రాండ్లను అమ్మించి ప్రజల ఆరోగ్యంతో ఆడుకున్నారు. జే ట్యాక్స్ కింద తాడేపల్లికి రూ.3100 కోట్లు ముడుపులు అందినట్టు ప్రభుత్వ ప్రాథమిక అంచనా. కూటమి ప్రభుత్వం రాగానే మద్యం పాలసీని మార్చేసిన సంగతి తెలిసిందే. గతంలో మాదిరి కప్పం కట్టాల్సిన పని లేకపోవడంతో మద్యం ధరలు తగ్గించడంతో పాటు మళ్లీ పాత బ్రాండ్లు వచ్చాయి.

### కేజీఎఫ్ తరహాలో అక్రమాలు

గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గంలో అప్పటి ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అండదండలతో మట్టి మాఫియా చెలరేగిపోయింది. చేబ్రోలు మండలంలో నాణ్యమైన ఎర్ర గ్రావెల్ భూములను అడ్డగోలుగా చేజిక్కించుకుని అక్రమార్జనకు తెరతీశారు. 700 ఎకరాల్లో పండ్ల తోటలను కనుమరుగు చేశారు. వీరనాయకునిపాలెం గ్రామంలో దశాబ్దాల క్రితం ప్రభుత్వం దళితులకు ఇచ్చిన అసైన్డ్ పంట భూముల్లో పాగా వేసి, వారిని తరిమేసి ఎదురు కేసు పెట్టి మట్టి తవ్వకాలు సాగించారు. ఐదేళ్ల కాలంలో మొత్తం రూ.2,100 కోట్లు అక్రమ మట్టి తవ్వకాలు జరిగాయని పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. ఇక ప్రభుత్వ ఉద్యోగులు, రేషన్ మాఫియా నుంచి నెల వారీ మామూళ్లు వసూలు చేశారన్న విమర్శలు ఉన్నాయి. బర్నాబాస్ అనే రేషన్ వ్యాపారి హత్య కేసులో కిలారిపై ఆరోపణలున్నాయి. పెదకాకాని మండలం అనుమర్లపూడిలో దళితులకు చెందిన 22.50 ఎకరాల భూమిని రోశయ్య అడ్డగోలుగా రాయించుకున్నారు. ఈ భూమి విషయంలో దళితుల మధ్య ఉన్న విభేదాలను అయన క్యాష్ చేసుకున్నారు. సుమారు రూ.34 కోట్లు విలువజేసే భూమిని కారు చౌకగా కొట్టేశారు. ఇవన్నీ ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర బయటపెట్టి చర్యల కోసం పోరాడుతుండడంతో ఆయన తప్పించుకోవడానికి చప్పుడు లేకుండా జనసేనలో చేరిపోయారు. ఆయన కబ్జాల బాగోతం తెలిశాక జనసేనాని పవన్ కల్యాణ్‌కు ఏంచేయాలో పాలుపోవడం లేదు.

## జగన్ బంధువుల అక్రమాలు

కడప జిల్లా ప్రొద్దుటూరు మండలంలోని తాళ్లమాపురంలో రూ.100 కోట్ల విలువ చేసే 20 ఎకరాల ప్రైవేటు భూములను ఆనలైన చేసుకున్నారు. ఈ డీల్‌లో ఎంపీ వైఎస్ అవినాశరెడ్డి, స్థానిక వైసీపీ నేతల ప్రమేయం ఉన్నట్లు ప్రచారం ఉంది. పులివెందుల నియోజకవర్గంలో జగన బంధువు వైఎస్ మదనమోహనరెడ్డి తొండూరు, మల్లెల గ్రామాల్లో సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు. బినామీ పేర్లతో ఆనలైన చేసుకున్నారు. కమలాపురం నియోజకవర్గంలోని పాలెంపల్లె, రూకవారిపల్లెకు చెందిన యానాదులకు వెట్టిచాకిరి కింద పోలతల పుణ్యక్షేత్రం సమీపంలో 470 ఎకరాల భూములు ఇచ్చారు. వాటిలో 150 ఎకరాలు జగన బంధువు పేరిట ఉన్నట్లు చెబుతున్నారు.

### సొంత పార్టీ నేతకే మోసం..

గుంటూరు జిల్లా తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేరుగా సెటిల్మెంట్లలో పాల్గొనకుండా తన మేనల్లుడు, కొందరు రౌడీషీటర్ల ద్వారా నడిపించారు. రైల్వేస్టేషన్ రోడ్డులో కోట్ల విలువైన స్థలాన్ని స్వాధీనం చేసుకుని, సెటిల్ చేసి సొంత పార్టీ నాయకుడికే అమ్మేశారు. కొలకలూరులో లాకింగ్ బ్రిక్స్ పరిశ్రమను కుమారుడి కోసం నిర్మించారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా చేసిన మహిళా నాయకురాలి భర్త అయిన ఓ మైనారిటీ నాయకుడికి ఇందులో వాటా ఉండేది. అయితే ఏమీ ఇవ్వకుండా ఆయన్ను, మిగిలిన భాగస్తులను తరిమేసి కోట్ల విలువైన ఫ్యాక్టరీని సొంతం చేసుకున్నారు. జగనన్న కాలనీల కోసం పట్టణానికి దూరంగా రూరల్ పంచాయతీల పరిధిలో చౌకగా పొలాలు ముందే కొనుగోలు చేసి, వాటిని ప్రభుత్వానికి అమ్మారు. ఎకరం రూ.25 నుంచి 35 లక్షలు పలికే భూములకు రూ.90 లక్షల నుంచి కోటిపైగా రైతుల పేరిట చెల్లింపులు చేసి రూ.180 కోట్లకు పైగా దోచేశారు.

### ఐదేళ్లలో పిన్నెల్లి అరాచకాలు ఎన్నో..

పల్నాడు జిల్లా మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేసిన అవినీతి, అరాచకాలు, హింస అంతా ఇంతా కాదు. గత ఐదేళ్లలో తక్కువలో తక్కువ రూ.1,000 కోట్ల వరకు సంపాదించారని గుప్పుమంటోంది. ప్రతిపక్షాలకు చెందిన వారిపై దాడులు చేయించి గ్రామాల నుంచి వెళ్లగొట్టారు. దుర్గి, వెల్దుర్తి మండలాల్లో పలు హత్యలకు సంబంధించి ఆయన అనుచరులపై ఆరోపణలున్నాయి. వెల్దుర్తి మండలంలో చంద్రయ్య, దుర్గి మండలంలో జల్లయ్య హత్యలు ఈ కోవకు చెందినవే. పిన్నెల్లి అరాచకాలను ప్రశ్నించేందుకు వచ్చిన టీడీపీ నేతలు బుద్దా వెంకన్న, బొండా ఉమాలపై దాడి చేసిన తురకా కిషోర్‌కు మున్సిపల్ చైర్మన పదవి కట్టబెట్టారు. మాచర్ల పట్టణంలో టీడీపీ దివంగత నేత వీరమాచినేని సుభాష్‌చంద్రబోస్‌కు చెందిన 10 సెంట్ల స్థలంలో గల ఇల్లు, పెట్రోలు బంకు, బంకు సమీపంలోని స్థలాలు, నెహ్రూనగర్‌లోని ఎకరం స్థలానికి అక్రమ దస్తావేజులు పుట్టించి కాజేశారు. వీటి విలువ సుమారు రూ.10 కోట్ల పైనే ఉంటుంది. రింగురోడ్డులోని టీడీపీ నేత నిమ్మగడ్డ వాసుకు చెందిన పెట్రోల్ బంకును దౌర్జన్యంగా ఆక్రమించారు. కొత్తపల్లి జంక్షన, స్టేడియం, రాయవరం జంక్షన, వినాయకుని గుట్ట తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో అక్రమ లేఅవుట్లు వేయించి సొమ్ము చేసుకున్నారు. మాచర్ల మండలం

విజయపురిసౌతలో సుమారు 300 ఎకరాల ప్రభుత్వ భూమిని దస్తావేజులు పుట్టించి కాజేశారు. వెల్దుర్తి మండలంలో 500 ఎకరాలు, దుర్గి మండలం గజాపురం సమీపంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమిని మింగేశారు. బియ్యం, మద్యం, ఇసుక, గ్రానైట్, జగనన్న ఇళ్ల స్థలాలకు భూములు కొనుగోలు... ఇలా ప్రతి దాంట్లో వేలు పెట్టి ముడుపులు తీసుకున్నారని తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్టర్లను బెదిరించి 20-30 శాతం వరకు కమీషన్ దండుకున్నారు. పోలింగ్ రోజున పిన్నెల్లి అనుచరులు నానా బీభత్సం సృష్టించారు.

### బెదిరించి థియేటర్ సొంతానికి...

ఇక కృష్ణా జిల్లాలో గుడివాడ నడిబొడ్డున ఉన్న శరత థియేటర్‌లో కేవలం ఒక వాటా కలిగి ఉన్న మాజీ మంత్రి కొడాలి నాని దానిని పూర్తిగా సొంతం చేసుకున్నారు. మిగిలిన ఇద్దరు వాటాదారులను బెదిరించి దాదాపు పదేళ్లుగా తన అధీనంలో ఉంచుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇటీవల అసలు వాటాదారులు ముందుకొచ్చి పోలీసులు, అధికారుల సాయంతో తమ థియేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నియోజకవర్గంలో కొడాలి ఎన్నో ప్లాట్లు, భూములు ఆక్రమించుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గుడివాడ టీచర్స్ కాలనీలోని అక్షర స్కూల్‌కు చెందిన 1,600 గజాల స్థలాన్ని సెటిల్‌మెంట్ పేరుతో ఆక్రమించుకున్నారు. దాన్ని నాని ముఖ్య అనుచరుడు కొల్లి విజయ్ పేరుతో ది గుడివాడ అర్బన్ బ్యాంకులో తనఖా పెట్టారు. నందివాడ మండలం పుట్టగుంట వద్ద పాఠశాలకు చెందిన ఖాళీస్థలంతో పాటు మరికొందరు వ్యక్తులకు చెందిన 7.75 ఎకరాల పొలాలను ఆక్రమించుకుని చెరువు తవ్వేశారు. కబ్జా చేసిన వాటిలో ఆలయాల భూములు కూడా ఉన్నాయి.

### జడ్జి తల్లి భూమి కబ్జా

మాజీ మంత్రి జోగి రమేశ్ బినామీ ఏకంగా ఓ జడ్జి తల్లి భూమినే కబ్జా చేశాడు. పెడన మండలం కొంకేపూడిలో జడ్జి తిరుమలరావుకు 5.30 ఎకరాల పొలం ఉంది. ఆయన 2021లో కొవిడ్‌తో మరణించారు. ఆ తర్వాత ఆయన భార్యకు, తల్లికి ఈ భూమికి సంబంధించిన వివాదం కోర్టులో నడుస్తోంది. ఈ నేపథ్యంలో జోగి రమేశ్ అనుచరుడైన పామర్తి సాంబశివరావు అలియాస్ డొకోమో సాంబ జోక్యం చేసుకుని 2022 డిసెంబరులో ఇందులో 1.30 ఎకరాల భూమిని తన తండ్రి అర్జునరావు పేరుతో రిజిస్టర్ చేయించుకున్నారు. ఇక జోగి రమేశ్ కుటుంబం విజయవాడ రూరల్ మండలం అంబాపురంలో ఏకంగా సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న అగ్రి గోల్డ్ భూములనే కబ్జా చేసేసింది.

### గుర్రాల కోట

దోపిడీ చేయడంలో శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిది ప్రత్యేక స్టైల్. రోజూ ఉదయం 'గుడ్ మార్నింగ్' అంటూ ప్రజలను పలకరించిన ఆయన.. ధర్మవరం రెవెన్యూ గ్రామ పరిధిలో 25 ఎకరాలను రైతులను బెదిరించి అతి తక్కువ ధరకు కొన్నారు. తన తమ్ముడు కేతిరెడ్డి వెంకటక్రిష్ణారెడ్డి భార్య వసుమతి పేరుతో కొనుగోలు చేసినట్లు రికార్డులో ఉంది. ఈ భూములను ఆనుకుని ఉన్న 20.61 ఎకరాల చెరువు స్థలాన్ని కూడా ఆక్రమించి కలిపేసుకున్నారు. ఇందులో విలాసవంతమైన ఫాంహౌస్, రేసింగ్ ట్రాక్, గుర్రాల కోసం ప్రత్యేక షెడ్లు, సేద తీరడానికి చెరువులో బోటింగ్ ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి ఆ ప్రాంతాన్ని గుర్రాల కోట అని జిల్లా ప్రజలు పిలుస్తున్నారు. ధర్మవరం మండల పరిధిలోని 106 ఎకరాల సోలార్ భూములను సొంతం చేసుకున్నారు. ఆయన అనుచరుల అక్రమాలకూ లేక్కలేదు. చెన్నేకొత్తపల్లి జాతీయ రహదారి పక్కన 20 ఎకరాల దళితుల భూములను, వారిని బెదిరించి తక్కువ ధరకు కొనుగోలు చేసి కోట్లలో సొమ్ము చేసుకున్నారు. చెన్నేకొత్తపల్లిలో వందేళ్లకు పైగా ఉన్న ప్రధాన రహదారిని కబ్జా చేశారు. ముదిగుబ్బ మండలంలో కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రధాన అనుచరుడు మండల కేంద్రం చుట్టూ ఉన్న 30 ఎకరాల ప్రభుత్వ భూములను స్థానిక నాయకులతో కలిసి కబ్జా చేశారు. అనంతపురం-కదిరి జాతీయ రహదారి పక్కన 6 ఎకరాల గుట్టను వైసీపీ నేతలు రాత్రికిరాత్రే ఆక్రమించి చదును చేశారు.

### బెదిరించి.. కేసులు పెట్టి..

రాయదుర్గం నియోజకవర్గంలోని డి.హీరేహాళ్ మండలం పులకుర్తికి చెందిన రైతు రామాంజినేయులురెడ్డికి చెందిన రూ.కోటి విలువైన 11 ఎకరాల భూమిని అప్పటి వైసీపీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి తన బినామీల పేరుతో సొంతం చేసుకున్నారు. ఆ రైతు, ఆయన కుమారుడిని ఎస్సీ, ఎస్టీ కేసుల పేరిట బెదిరించారు. రౌడీషీట్ ఓపెన చేయించి నానా ఇబ్బందులకు గురి చేశారు. ఆర్థిక అవసరాల రీత్యా రామాంజినేయులురెడ్డి పూర్వీకులు బళ్లారిలో ఓ వ్యాపారి వద్ద ఆ భూమి తాలూకా డాక్యుమెంట్లు గతంలో తాకట్టుపెట్టారు. ఈ విషయం తెలుసుకున్న కాపు రామచంద్రారెడ్డి తన అనుచరులను రంగంలోకి దించి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి, అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి రికార్డులు మార్పించారు. అడ్డు వచ్చిన బాధిత రైతు, అతని కుటుంబ సభ్యులపై దాడులు చేయించారు. రామాంజినేయులురెడ్డి కుమారుడిపై రౌడీషీట్ ఓపెన చేయించడంతో అతను సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదులుకోవాల్సి వచ్చింది.

### కార్మికుల శ్రమ దోపిడీ

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మాజీ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ కియా కార్ల పరిశ్రమలో తుక్కుతో మొదలుకుని కార్మికుల శ్రమను కూడా దోచుకున్నారు. కియాతో పాటు అనుబంధ సంస్థల్లో గత ఐదేళ్లు శంకర్‌నారాయణ, ఆయన సోదరులు బినామీల పేరిట దోపిడీకి పాల్పడ్డారు. అనుబంధ పరిశ్రమలో కార్మికులను నియమించే కాంట్రాక్టు ఏజెన్సీలను బినామీల పేరిట నడిపించారు. ఒక్కొక్క కార్మికుడికి అందే వేతనం నుంచి నెలకు రూ.2వేల దాకా దండుకున్నారు. బాధితుల్లో 150 మందికిపైగా సెక్యూరిటీ గార్డులు ఉన్నారు. తుక్కు ద్వారా నెలకు రూ.2 కోట్లకుపైగా నొక్కినట్లు సమాచారం. టీ కప్పులు మొదలు భోజనాల ఏజెన్సీలను వారే నడిపించి కమీషన్లు దండుకున్నారు. అప్పట్లో ఏపీ కంటే కర్ణాటకలో లీటర్ డీజిల్ ధర రూ.10 వరకూ తక్కువగా ఉండటంతో బస్సులు, కంటైనర్లకు అక్కడి నుంచి డీజల్ ట్యాంకర్లను తెప్పించి సొమ్ములు వెనకేసుకున్నారు. చివరకు గాలిమరలలో కూడా దోపిడీకి పాల్పడ్డారు. పెనుకొండ మండలం చంద్రగిరికి చెందిన మధు అనే వ్యక్తి స్థలాన్ని అధికారులను అడ్డు పెట్టుకుని లాగేసుకున్నారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు బాధితుడు ఈ నెల 3న ఫిర్యాదు చేశాడు.

### 50 లక్షలకు చైర్‌పర్సన్ పదవి బేరం

మాజీ మంత్రి రోజా అవినీతిలోనూ ఫైర్ బ్రాండ్ అని నగరి నియోజకవర్గ ప్రజలు చెబుతుంటారు. గత ఐదేళ్లు వసూళ్ల వ్యవహారం ఆమె ఇద్దరు సోదరులు చూసుకునేవారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఇస్తానని ఆశ చూపి రోజా సోదరుడు తన నుంచి రూ.50 లక్షలు వసూలు చేశారని వైసీపీకే చెందిన పుత్తూరు కౌన్సిలర్ భువనేశ్వరి ఆరోపించడం అప్పట్లో దుమారం రేపింది. ఆమె తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆధారాలతో సహా ఆరోపణలు చేసింది. తర్వాత ఆమెకు అంతో ఇంతో ఇచ్చి సర్దుబాటు చేసుకున్నారు. విజయపురం మండలంలో ఏకంగా 300 ఎకరాల ప్రభుత్వ భూములను రోజా తన అనుచరుల పేర్లతో ఆనలైనలో నమోదు చేయించుకున్నారు. 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో బయట పెట్టడంతో ఉన్నతాధికారులు ఆ భూముల్ని వెనక్కి తీసుకుని నలుగురు రెవెన్యూ సిబ్బందిని సస్పెండ్ చేశారు. వడమాలపేట అంజరమ్మ కనుమ వద్ద 12 ఎకరాల భూమిని బినామీ పేర్లతో ఆనలైనలో నమోదు చేయించారు. ఇందులో రూ.7 కోట్లు సంపాదించుకున్నట్లు ప్రచారం జరిగింది. ఇండస్ట్రియల్ పార్కుకు భూముల సేకరణలోనూ కోట్లలో సొమ్ము చేసుకున్నారు.

### అసైన్డ భూములను మింగేసిన ఉష శ్రీచరణ్

మాజీ మంత్రి ఉష శ్రీచరణ్ పేదలను భయపెట్టి అసైన్డ భూములు లాగేసుకున్నారు. తక్కువ ధరతో వందల ఎకరాలు సేకరించారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని కంబదూరు మండలం మర్రిమాకులపల్లి గ్రామంలోని 217, 219, 220, 222, 223, 224, 225, 226 సర్వే నంబర్లలో అసైన్డ భూములను కొనేందుకు రైతులతో అగ్రిమెంట్లు చేయించుకున్నారు. కంబదూరు-కనగానపల్లి సరిహద్దు మండలాల్లో 124, 125, 127 సర్వే నంబర్లలో 165 ఎకరాలను అతి తక్కువ ధరకే రైతులను బెదిరించి లాక్కున్నారు. ఇందులో 33 ఎకరాలు గాలిమరలకు సంబంధించిన భూమి ఉండడంతో ఆ కంపెనీ ప్రతినిధులను బెదిరించి తక్కువ ధరలకు కొనుగోలు చేశారు.

### ఊరూవాడా ఎన్నెన్నో కబ్జాలు..

అనకాపల్లి జిల్లా కశింకోట మండలం బయ్యవరం రెవెన్యూ పరిధిలోని విస్సన్నపేట పరిసరాల్లో వైసీపీ నేతలు పేదలను బెదిరించి వందలాది ఎకరాలు చేజిక్కించుకున్నారు. గెడ్డలు పూడ్చివేసి, కొండలు చదును చేశారు. ఎంపీ విజయసాయిరెడ్డి సన్నిహితుడు గోపినాథ్‌రెడ్డి డైరెక్టర్‌గా ఉన్న ఎష్యూర్ ఎల్ఎల్‌పీ సంస్థ విస్సన్నపేట లేఅవుట్‌లో 55 ఎకరాలు, కృష్ణా జిల్లాకు చెందిన మరో వైసీపీ నేత పేరుతో 200 ఎకరాల వరకూ కొనుగోలు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం మోసూరు పంచాయతీ పరిధి సర్వే నెంబర్ 253పీలో వైసీపీ నాయకుడు గుండేపల్లి రాము సుమారు 50 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఆక్రమించుకున్నట్టు ఆరోపణలున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం తోణాం పంచాయతీ పరిధిలో పూజారి మల్లేశ్వరికి చెందిన ఐదెకరాల భూమిని వైసీపీ నాయకురాలు డి.అనంతకుమారి పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్న ఆరోపణలున్నాయి. కురుపాం నియోజకవర్గంలో మాజీ మంత్రి పాముల పుష్పశ్రీవాణి ఐటీడీఏ నిధులతో తన ఇంటి చుట్టూ రక్షణ గోడను నిర్మించుకున్నారు. పాలకొండ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కళావతి సీతంపేట మండలంలో పేదల నుంచి అతిచౌకగా భూమిని కొనుగోలు చేసి ఫామ్ హౌస్ నిర్మించుకున్నారు. ప్రభుత్వ నిధులతో బీటీ రహదారిని ఏర్పాటు చేసుకున్నారు. మదనపల్లె-పుంగనూరు జాతీయ రహదారికి ఆనుకుని బసినికొండ రెవెన్యూ గ్రామంలో వివాదాస్పద భూములను వైసీపీ నేతలు ఆక్రమించారు. కడప, పులివెందులకు చెందిన ముఠా సభ్యులను పిలిపించి దౌర్జన్యంగా సిమెంటు పలకలతో ప్రహరీ ఏర్పాటు చేశారు. రూ.50 కోట్ల విలువ చేసే పదెకరాల భూమిని ఆక్రమించారు. ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెలో రూ.30 కోట్లు విలువ చేసే 5 ఎకరాలు చర్చి భూమిని మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు ఆక్రమించారనే ఆరోపణలు ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు కుటుంబ సభ్యులపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. మైదుకూరు నియోజకవర్గం నంద్యాలంపేట సర్వే నెంబర్ 506బీ, 507లో 304 ఎకరాల అటవీ శాఖ భూమి ఉంది. వైసీపీ నేత ఆక్రమించి పండ్ల తోటలనే సుమారు 50 ఎకరాల్లో సాగు చేశారు. బద్వేలులోని సర్వేనెంబర్ 1568, 69, 62లో 19 ఎకరాల భూములను గతంలో దళితులకు ఇచ్చారు. ఇక్కడ ఎకరం ధర రూ.3 కోట్లపైనే ఉంటుంది. వైసీపీ నేత, మున్సిపల్ వైస్ చైర్మన గోపాలస్వామి వాటిని అక్రమంగా రిజిస్ట్రేషన చేసుకున్నారు. కలసపాడు రెవెన్యూ పొలంలో ముగ్గురు వైసీపీ నేతలు 75 ఎకరాలు ఆక్రమించారు.

## అక్రమాల్లోనూ పెద్దిరెడ్డి

వైసీపీ ప్రభుత్వంలో నెంబరు టూగా పెత్తనం చేసిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.వేల కోట్లను వెనకేసుకున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష నేతలను బెదిరించారు. గనుల్ని లాక్కున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములని తేడా లేకుండా వందల ఎకరాల్ని కబ్జా చేశారు. పుంగనూరు మండలం సుగాలిమిట్ట వద్ద పలువురి క్వారీలను దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్నారు. మదనపల్లెకు చెందిన జనసేన నాయకుడు రాందాస్ చౌదరి, పుంగనూరు టీడీపీ నేత ఆర్వీటీ బాబులకు చెందిన క్వారీలను లాక్కున్నారు. పుంగనూరు మండలం రాగానిపల్లెలో రూ.100 కోట్ల విలువ చేసే 982 ఎకరాల అనాధీన భూముల్ని.. పెద్దిరెడ్డి ఆదేశాలతో ఆయన అనుచరులకు అప్పటి అధికారులు కట్టబెట్టేశారు. కుప్పం నియోజకవర్గాన్ని కూడా తన గుప్పిట్లో పెట్టుకున్న పెద్దిరెడ్డికి క్వారీల నుంచి నెల మామూళ్లు వెళ్లేవని ప్రచారం జరిగింది. మదనపల్లె బి.కె.పల్లె రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 552లో వివాదాస్పదమైన విలువైన భూమిని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన ప్రధాన అనుచరుడు వి.మాధవరెడ్డి ఆక్రమించారు. ఇందులో తాము కొనుగోలు చేశామని చెబుతున్న భూమి అయిదు ఎకరాలు అయితే, మరోమూడు ఎకరాలు ప్రభుత్వ, డీకేటీ భూములను ఆక్రమించి కంచె ఏర్పాటు చేశారు. పుంగనూరు బైపాస్ రోడ్డు వద్ద పెద్దిరెడ్డి తమ్ముడు, ఎమ్మెల్యే ద్వారకానాథరెడ్డి బినామీ పేర్లతో తక్కువ ధరలకు బలవంతంగా భూముల్ని కొనుగోలు చేశారు. పులిచెర్ల మండలంలో మామిడి తోటల యజమానుల్ని బెదిరించి ఆక్రమించుకున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో ద్వారకనాథరెడ్డి అనుచరులు ఎక్కువగా కురబలకోట, అంగళ్లు, ముదివేడు, తంబళ్లపల్లె, బి.కొత్తకోట మండలం కాండ్లమడుగు క్రాస్‌లో భూములు ఆక్రమించారనే ఆరోపణలు ఉన్నాయి.



# ఈ వేసవి వెలవెలేనా?


**తెలుగు సినిమాలకు సంబంధించి అత్యంత క్రేజున్న షార్ట్ సీజన్ సమ్మర్ అయితే.. మంచి డిమాండుండే లాంగ్ సీజన్ వేసవి. సంక్రాంతికి ఒకే వారంలో మూణ్నాలుగు సినిమాలు సందడి చేస్తుంటాయి. అప్పుడు టాక్ బాగుంటే వసూళ్ల మోత మోగుతుంది. వేసవి విషయానికి వస్తే ఎక్కువగా విద్యార్థులకు సెలవులుంటే ఈ సీజన్లో నెలా నెలన్నర పాటు సినిమాల మోత మోగిపోతుంటుంది. వారం వారం మంచి క్రేజున్న సినిమాలు రిలీజవుతుంటాయి. వసూళ్లకూ ఢోకా ఉండదు. కానీ ఒకప్పుడు వైభవం చూసిన సమ్మర్ సీజన్.. గత కొన్నేళ్ల నుంచి కళ తప్పుతోంది. గత ఏడాది ఒక్కటంటే ఒక్క పెద్ద సినిమా లేకుండా గడిచిపోయిన వేసవి.. ఈసారి కూడా అదే దుస్థితిని ఎదుర్కొనేలా కనిపిస్తోంది.**




తెలుగు సినిమాలకు అనే కాదు.. మొత్తంగా ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీకి కాసుల వర్షం కురిపించే లాంగ్ సీజన్ అంటే.. వేసవినే. సినిమాలకు మహారాజ పోషకులైన యూత్ అంతా ఆ టైంలో పరీక్షలు పూర్తి చేసుకుని ఖాళీగా ఉంటారు. సెలవుల్లో సినిమాలు ఎంజాయ్ చేయాలనుకుంటారు. ఫ్యామిలీ ఆడియన్స్ సైతం ఏసీ థియేటర్లలో కూర్చుని సినిమాలు ఆస్వాదించాలని చూస్తారు. అందుకే వేసవిలో పెద్ద పెద్ద సినిమాలను రిలీజ్ చేస్తుంటారు. ప్రతి వారం క్రేజీ మూవీ రిలీజవుతుంటుంది. కానీ ఈ మధ్య వేసవి సినిమాల విషయంలో టాలీవుడ్ ప్లానింగ్ సరిగా ఉండట్లేదు. 2020లో కరోనా వల్ల సమ్మర్ సీజన్ పూర్తిగా వాషౌట్ అయిపోయింది. ఆ టైంలో అసలు థియేటర్లే తెరిచి లేవు. తర్వాతి ఏడాది కూడా కొంతమేర కరోనా ప్రభావం వల్ల వేసవి దెబ్బ తింది. 2022లో ఆర్ఆర్ఆర్, కేజీఎఫ్-2తో వేసవిలో బాగానే సందడి కనిపించింది. కానీ తర్వాతి రెండేళ్లు మళ్లీ వేసవి కళ తప్పింది. ఈ రెండు సమ్మర్లలోనూ టాప్ స్టార్లు నటించిన పెద్ద సినిమాలు ఒక్కటంటే ఒక్కటీ విడుదల కాలేదు. 2023లో దసరా, విరూపాక్ష లాంటి మిడ్ రేంజ్ సినిమాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇక గత ఏడాది ఈ మాత్రం సందడి కూడా లేదు. పెద్ద సినిమాలు లేకపోగా.. చిన్న, మిడ్ రేంజ్ చిత్రాలు కూడా చాలా వరకు నిరాశపరిచాయి. 'టిల్లు స్క్వేర్' మినహాయిస్తే పెద్ద హిట్ ఒక్కటీ లేదు.

### ఊరించి.. ఉస్సూరుమనిపించి..

గత రెండేళ్లు ప్లానింగ్ లోపం వల్ల పెద్ద సినిమాలేవీ సమ్మర్ రేసులో నిలవలేదు. కానీ ఈసారి పరిస్థితి మారేలా కనిపించింది. మెగాస్టార్ చిరంజీవి సినిమా 'విశ్వంభర', పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మూవీ 'హరిహర వీరమల్లు', ప్రభాస్ చిత్రం 'రాజా సాబ్' వేసవిలో సందడి చేసేలా కనిపించాయి. దీంతో సమ్మర్ బాక్సాఫీస్ మోత మోగిపోతుందని అంతా అనుకున్నారు. కానీ వీటిలో ఒక్కొక్కటిగా వేసవి రేసు నుంచి తప్పుకుంటున్నాయి. 'రాజా సాబ్' వాయిదా ఆల్రెడీ ఖరారైపోయింది. 'విశ్వంభర' కూడా వేసవి పోటీలో ఉండదని, ప్రకటన రావడమే తరువాయి అని అంటున్నారు. 'హరిహర వీరమల్లు'ను మార్చి 28నే రిలీజ్ చేస్తామని నిర్మాత ఏఎం రత్నం అంటున్నా.. ఆ పాన్ ఇండియా మూవీ చిత్రీకరణ పూర్తి కాలేదు. పవన్ చివరి షెడ్యూల్ కోసం అందుబాటులోకి












రాలేదు. దీంతో ఈ చిత్రం వేసవి రేసు నుంచి తప్పుకోవడం ఖాయమంటున్నారు. ఇలా మూడు భారీ చిత్రాలు పోటీ నుంచి తప్పుకోవడం సినీ ప్రియులకు తీవ్ర నిరాశ కలిగించే విషయమే. మరోవైపు సూపర్ స్టార్ రజినీకాంత్ డబ్బింగ్ మూవీ 'కూలీ' అయితే వేసవికి వస్తుందనుకుంటే.. అది కూడా వాయిదా పడనున్నట్లు తెలుస్తోంది.

**వీటి మీదే ఆశలు..**

భారీ చిత్రాలు రేసు నుంచి తప్పుకున్న నేపథ్యంలో వేసవిలో రానున్న కొన్ని మిడ్ రేంజ్, చిన్న సినిమాల మీదే ప్రేక్షకులు ఆశలు పెట్టుకున్నారు. అందులో ప్రధానంగా చెప్పుకోవాల్సింది నాని మూవీ 'హిట్-3' గురించి. 2022లో 'దసరా' మూవీతో వేసవికి మంచి ఆరంభాన్నిచ్చిన నాని.. ఈసారి సీజన్ మధ్యలో, మే1న 'హిట్-3'తో పలకరించనున్నాడు. వరుస హిట్లతో నాని రేంజ్ పెరిగింది. మాస్‌లోనూ రీచ్ పెంచుకున్నాడు. పైగా 'హిట్' సిరీస్‌లో మూడో సినిమా కావడంతో ఈ చిత్రంపై అంచనాలు భారీగానే ఉన్నాయి. మరోవైపు గత ఏడాది చివర్లో రావాల్సిన నితిన్ మూవీ 'రాబిన్ హుడ్' వేసవి ఆరంభంలో ప్రేక్షకులను పలకరించబోతోంది. 'హరి హర వీరమల్లు' వాయిదా పడనున్న నేపథ్యంలో ఆ సినిమా రావాల్సిన మార్చి 28న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయబోతున్నారు. 'భీష్మ' కాంబినేషన్లో రానున్న సినిమా కావడంపై దీనికి బాగానే హైప్ ఉంది. ఇక సూపర్ హిట్ మూవీ 'మ్యాడ్'కు కొనసాగింపుగా రానున్న 'మ్యాడ్ స్క్వేర్' కూడా క్రేజీ మూవీనే. దీని కోసం యూత్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అనుష్క-క్రిష్ జాగర్లమూడిల 'ఘాటి' కూడా క్యూరియాసిటీ పెంచుతున్న చిత్రమే. సిద్ధు జొన్నలగడ్డ కూడా 'జాక్' లాంటి ఇంట్రెస్టింగ్ మూవీతో పలకరించబోతున్నాడు.  మంచు విష్ణు ట్రాక్ రికార్డు ఎంత పేలవంగా ఉన్నప్పటికీ.. అతను ప్రధాన పాత్రలో వంద కోట్లకు పైగా బడ్జెట్లో రూపొందిన 'కన్నప్ప' వేసవిలో రానున్న అతి పెద్ద సినిమాగా చెప్పొచ్చు. ప్రభాస్, మోహన్ లాల్, అక్షయ్ కుమార్ నటిస్తుండడం వల్ల ఈ మూవీ స్పెషలే. నితన్ మరో చిత్రం 'తమ్ముడు'తో పాటు బెల్లంకొండ శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ కలిసి నటించిన 'భైరవం' లాంటి ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్స్ వేసవిలో సందడి చేయనున్నాయి. మరి పెద్ద స్టార్లు నటించిన సినిమాలు లేని లోటును ఇవి ఎంతమేర భర్తీ చేస్తాయో చూడాలి.








# అక్కినేని ఆకలి తీరినట్లేనా?

**గత కొన్నేళ్లలో టాలీవుడ్లో పెద్ద కుటుంబాలకు చెందిన హీరోల్లో బాక్సాఫీస్ రేసులో ఎవరు వెనుకబడ్డారు అంటే.. అందరి వేళ్లూ అక్కినేని వారి వైపే చూపిస్తాయి. మంచు ఫ్యామిలీ వ్యవహారం వేరు కాబట్టి వాళ్లను ఎవ్వరూ ఎప్పుడూ కన్సిడర్ చేసింది లేదు. కానీ అక్కినేని వారిది ఘన వారసత్వం. ఏఎన్నార్ తర్వాత నాగార్జున టాలీవుడ్ టాప్ హీరోల్లో ఒకరిగా ఒక వెలుగు వెలిగారు. తర్వాత నాగచైతన్య స్టార్ స్టేటస్ సంపాదించాడు. అఖిల్ డెబ్యూకు ముందే మంచి హైప్ తెచ్చుకున్నాడు. కానీ ఈ ముగ్గురిలో ఎవ్వరూ హిట్టు కొట్టక.. ముగ్గురి మార్కెట్ అంతకంతకూ పడిపోతుండడంతో కొన్నేళ్ల నుంచి అక్కినేని అభిమానుల బాధ అంతా ఇంతా కాదు. కానీ 'తండేల్' మూవీ వారిలో కొత్త ఉత్సాహాన్నిచ్చింది. ఈ సినిమాతో అక్కినేని కథ మారుతుందని అభిమానులు ఆశాభావంతో ఉన్నారు.**

మెగా ఫ్యామిలీలో చిరంజీవి ఇప్పటికీ తన స్థాయిని నిలుపుకుంటున్నారు. సెకండ్ ఇన్నింగ్స్‌లో కొన్ని ఫెయిల్యూర్లు ఉన్నా సరే.. పాజిటివ్ టాక్ వస్తే ఆయన సినిమాల రేంజే వేరుగా ఉంటోంది. రాజకీయాల్లో బిజీ అయిపోయిన పవన్ కళ్యాణ్‌కు సినిమాల మీద ఆసక్తి తగ్గిపోయింది కానీ.. ఆయన మార్కెట్ ఏమీ చెక్కుచెదరలేదు. రామ్ చరణ్ టాలీవుడ్ అనే కాక ఇండియాలోనే టాప్ స్టార్లలో ఒకడిగా వెలుగొందుతున్నాడు. అల్లు అర్జున్ సంగతి చెప్పాల్సిన పని లేదు. ఇక నందమూరి కుటుంబంలో ఇటు బాలయ్య, అటు జూనియర్ ఎన్టీఆర్ వరుసగా హిట్లు కొడుతూ దూసుకెళ్తున్నారు. దగ్గుబాటి సీనియర్ హీరో వెంకటేష్ ఇప్పటికీ తన హవాను కొనసాగిస్తున్నాడు. 'సంక్రాంతికి వస్తున్నాం'తో ఆయన భారీ విజయాన్నందుకున్నాడు. రానా తన స్థాయిలో విలక్షణ సినిమాలు చేసుకుంటూ వెళ్తున్నాడు. కానీ అక్కినేని వారికే కొన్నేళ్లుగా అస్సలు కలిసి రావడం లేదు. ఆ కుటుంబంలో ముగ్గురు హీరోల పరిస్థితీ బాగా లేదు. నాగ్ మార్కెట్ బాగా డౌన్ అయిపోయింది. 'సోగ్గాడే చిన్నినాయనా' తర్వాత పెద్ద హిట్టే లేదు. ఓ మోస్తరు విజయానికే మొహం వాచిపోయిన ఆయన.. రికార్డుల గురించి అస్సలు ఆలోచించే



పరిస్థితి లేదు. వైల్డ్ డాగ్ పాజిటివ్ టాక్ తెచ్చుకుని కూడా ఫ్లాప్ అయింది. ఘోస్ట్‌కు టాక్ బాగా లేదు. ఫలితమూ తేడా కొట్టింది. 'నా సామి రంగ' ఏదో బొటాబొటిగా ఆడింది. నాగచైతన్య మిడ్ రేంజ్ హీరోగా ఎదిగాడు కానీ.. థాంక్యూ, కస్టడీ సినిమాలు అతణ్ని కిందికి లాగేశాయి. ఇక అఖిల్ విషయానికి వస్తే తొలి చిత్రం 'అఖిల్' విడుదలకు ముందు తనకు మామూలు హైప్ రాలేదు. కానీ ఆ సినిమా డిజాస్టర్ కావడం.. తర్వాత మిస్టర్ మజ్ను, హలో కూడా ఆడకపోవడంతో అతడి కెరీర్ తిరోగమనంలో పయనించింది. 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్'తో కొంచెం పుంజుకున్నట్లు కనిపించినా.. 'ఏజెంట్' అల్ట్రా డిజాస్టర్ కావడంతో కథ మొదటికి వచ్చింది. ఇలా అక్కినేని హీరోలందరూ డౌన్ అయిపోవడంతో అభిమానులు డంగైపోయారు. వేరే ఫ్యామిలీ స్టార్లు ఇంకా ఇంకా ఎదిగిపోతూ రికార్డులు బద్దలు కొడుతుంటే.. అక్కినేని హీరోల మార్కెట్ అంతకంతకూ కరిగిపోతుండడం అక్కినేని అభిమానులను తీవ్ర ఇబ్బందికి గురి చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో 'తండేల్' వారికి గొప్ప ఉపశమనమే ఇచ్చింది. 'తండేల్' చైతూకు తొలి వంద కోట్ల సినిమాగా నిలిచింది. వంద కోట్ల క్లబ్బులో దీన్ని నిలబెడతామని నిర్మాత బన్నీ వాసు విడుదలకు ముందు చెప్పిన మాట నిజమైంది. ఇక ఈ చిత్రంతో నటుడిగా చైతూ ఈ సినిమాతో కొన్ని మెట్లు పైకి ఎక్కేశాడు. ఒక పెర్ఫామర్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. సర్వత్రా అతడిపై ప్రశంసలు కురిశాయి. అది అక్కినేని అభిమానులకు మరింత ఆనందాన్నిచ్చిన విషయం.

### నాగ్‌లో ఎమోషన్

'తండేల్' రూపంలో ఓ మంచి విజయం దక్కడం ఇటు అక్కినేని ఫ్యామిలీకి, అటు అభిమానులు గొప్ప ఉపశమనం. 'తండేల్' సక్సెస్ మీట్లో అది నాగ్ మాటల్లో ప్రతిబింబించింది. మామూలుగా నాగ్ ఎక్కువ ఎమోషనల్ కాడు. స్టేజ్ మీద సరదాగా మాట్లాడతాడు. భావోద్వేగాలు బయటపడనివ్వడు. అలాంటిది 'తండేల్' సక్సెస్ ఈవెంట్లో మాత్రం ఆయనలోని ఎమోషనల్ కోణం బయటికి వచ్చింది. ఆయన కొంత కాలంగా ఎంత బాధను అనుభవించారు, ఇప్పుడెంత సంతోషంగా ఉన్నారు అన్నది మాత్రం తన ప్రసంగంలో బయటపడింది. 'తండేల్' ఫలితం చైతూ కంటే నాగార్జునకు అమితానందాన్నిచ్చిన విషయం స్పష్టంగా అర్థమైపోయింది. దర్శకుడు చందూ మొండేటికి.. నిర్మాతలు అల్లు అరవింద్, బన్నీ వాసు గురించి మాట్లాడిన తీరులో నాగ్ కృతజ్ఞతాభావం కొట్టొచ్చినట్లు కనపడింది. ఈ రోజుల్లో ఒక మంచి సినిమా తీసి హిట్టు కొట్టడం ఎంత కష్టమో నాగ్ చాలా బలంగా చెప్పారు. తన కొడుకు ముఖంలో మళ్లీ ఆనందం చూడడం గురించి.. 'తండేల్' రిలీజ్ రోజు వచ్చిన స్పందన గురించి నాగ్ మాట్లాడిన మాటలు గుండె లోతుల్లోంచి వచ్చినట్లు కనిపించాయి. కష్ట కాలంలో తమకు తోడుగా నిలిచి.. ఇప్పుడు 'తండేల్' ఫలితంతో అమితానందంలో ఉన్న అక్కినేని అభిమానుల గురించి కూడా నాగ్ హృదయపూర్వకంగా మాట్లాడారు.

### వాట్ నెక్స్ట్?

తండేల్ సక్సెస్ మీట్లో నాగార్జున ఇంకో మాట అన్నారు. 'వస్తున్నాం.. కొడుతున్నాం' అనే తన ట్రేడ్ మార్క్ డైలాగ్ చెప్పి.. అక్కినేని వారి సక్సెస్ స్ట్రీక్‌కు 'తండేల్'తో ముహూర్తం కుదిరిందని చెప్పారు. దీంతో అభిమానుల్లో ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. ఐతే ఈ సక్సెస్‌ను అక్కినేని హీరోలు ఏమేర నిలబెట్టుకుంటారన్నది చూడాలి. తమ తర్వాతి సినిమాల విషయంలో అక్కినేని త్రయం ఆచితూచి అడుగులు వేస్తోంది. 'నా సామి రంగ' రిలీజై ఏడాది దాటినా నాగార్జున సోలో హీరోగా సినిమానే ప్రకటించలేదు. కనీసం ఫలానా దర్శకుడితో సినిమా చేయబోతున్నాడనే వార్త కూడా బయటికి రాలేదు. కుబేర, కూలీ లాంటి చిత్రాల్లో ప్రత్యేక పాత్రలు చేస్తున్నాడు కానీ.. సోలో హీరోగా మాత్రం సినిమా అనౌన్స్ చేయలేదు. మరి సోలో హీరోగా నాగ్ ఎప్పుడు సినిమా ఓకే చేస్తాడు, ఎవరితో చేస్తాడు అన్నది సస్పెన్సుగా మారింది. వెంకీ తరహాలో ఆయన బలంగా బౌన్స్ బ్యాక్ కావాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఇక అఖిల్ కొత్త సినిమా గురించి రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి. చివరికి 'వినరో భాగ్యము విష్ణు కథ' దర్శకుడు మురళీకృష్ణతో సినిమా అన్నారు. కానీ దాని గురించి కూడా అధికారిక అప్‌డేట్ లేదు. ఇక రెండేళ్లకు పైగా 'తండేల్'కే అంకితమైన చైతూ కూడా.. తర్వాతి సినిమా గురించి ఆలోచించలేదు. ఇప్పుడు తన చేతిలో ఏ సినిమా లేదు. అతను తర్వాత ఎవరితో జట్టు కడతాడన్నది ఆసక్తికరం. 'తండేల్' ఇచ్చిన ఉత్సాహంలో త్వరలోనే ఈ ముగ్గురు హీరోల కొత్త చిత్రాల గురించి కబుర్లు వినిపిస్తారని.. ఇకపై వరుసగా సక్సెస్ ఫుల్ సినిమాలే అందిస్తారని అని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు.

# ప్రపంచ శ్రేణి నగరంగా రూపు దిద్దుకుంటున్న FOURTH CITY 4.0



# FUTURE CITY - FOURTH CITY 4.0

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 30,000 ఎకరాల్లో "ఫ్యూచర్ సిటీ"ని అభివృద్ధి చేస్తున్నది. ఇది శ్రీశైలం హైవే మరియు సాగర్ హైవే మధ్య, ORR మరియు RRR మధ్య ఉన్న ప్రాంతంలో ఉంటుంది. ఈ ప్రాజెక్ట్ యొక్క తొలి దశ 30,000 ఎకరాల్లో "ఫోర్త్ సిటీ"గా రూపుదిద్దుకుంటుంది. ఈ నగరంలో స్కిల్ యూనివర్సిటీ, దేశ విదేశాల IT పార్కులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI సిటీ), వరల్డ్ ట్రేడ్ సెంటర్, గోల్ఫ్ కోర్స్, ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం, మెగా హెల్త్ టౌన్‌షిప్ (1,200 ఎకరాలు), ఫ్యూచర్ పార్క్, ఎడ్యుకేషనల్ హబ్‌లు మరియు పలు లైఫ్ సైన్సెస్ హబ్‌లు నిర్మించనున్నారు. అన్నీ అంతర్జాతీయ, నెట్-జీరో సిటీ మోడల్‌లో అభివృద్ధి చేయబడతాయి. రెండవ దశ 20,000 ఎకరాల్లో ఎలక్ట్రానిక్ పార్క్, హెల్త్ సిటీ, ఎమ్యూజ్‌మెంట్ పార్క్, బూస్టర్ డెవలప్‌మెంట్ హబ్, ఎంటర్టైన్‌మెంట్ సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఫార్మా సిటీ మరియు ఇండస్ట్రియల్ కారిడార్లు అభివృద్ధి చేయనున్నారు.

ఫ్యూచర్ సిటీకి సంబంధించిన మాస్టర్ ప్లాన్ ఇప్పటికే పూర్తయిందని, మెట్రో పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రేడియల్ రోడ్లను విస్తరణ చేసి, ఆస్తుల విలువలు పెరుగుతున్నాయి. స్కిల్ యూనివర్సిటీకి భూమిపూజ కూడా పూర్తయ్యింది. మెగా ఇంటర్నేషనల్ అకాడమీ 100 కోట్ల రూపాయలతో ఏర్పాటుకానుంది. ఈ ప్రాజెక్టుకు మొత్తం మహీంద్రా గ్రూప్ వైస్ చైర్మన్ ఆనంద్ మహీంద్రాను స్కిల్ యూనివర్సిటీ ఛైర్మన్‌గా నియమించారు. అలాగే అంతర్జాతీయ భాగస్వామ్యాలు కూడా జరుగుతున్నాయి.

ORR నుండి ఫ్యూచర్ సిటీ మీదుగా RRR వరకు 330 అడుగుల వెడల్పుతో గ్రీన్‌ఫీల్డ్ రోడ్ నిర్మాణం ప్రారంభమైంది. అలాగే, ఎయిర్‌పోర్ట్ నుండి ఫ్యూచర్ సిటీకి మెట్రో రైలు సేవలు అందుబాటులోకి రానున్నాయి. పలు సంస్థలతో లైఫ్ సైన్సెస్ హబ్‌లో ఒప్పందాలు (MOU) చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ 30,000 ఎకరాల భూమిని, 7 మండలాల 56 గ్రామాలను కలిపి ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (FCDA)గా ప్రకటించింది. అభివృద్ధికి ఉపయోగపడే విధంగా CRDA వంటి విధంగా మొత్తం కూడా 2,10,000 ఎకరాలు FCDA అధికారికంగా ప్రకటించబడ్డాయి.




తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌ను ఒక డ్రీమ్ ప్రాజెక్ట్ గా తీసుకుని, తెలంగాణను ప్రపంచ దేశాలతో పోటీ పడేవిధంగా ఒప్పందాల కోసం ప్రయత్నిస్తున్నారు. రాబోయే 10 సంవత్సరాల్లో ఈ ప్రాజెక్ట్ 10 లక్షల ఉద్యోగాలను సృష్టిస్తుంది. 25 లక్షల కుటుంబాలకు నివాసం కానుంది. ఈ అభివృద్ధి కోసం ప్రయత్నం.


రోడ్లు, సిటీ పనులు మరియు ఇతర పనులు అత్యంత వేగవంతంగా జరుగుతున్నాయి. భవిష్యత్తులో హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తర్వాత మరో కొత్త నగరంగా ఈ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుంది. ఫ్యూచర్ సిటీ ప్రపంచ స్థాయి నగరంగా, లివింగ్, వర్కింగ్ మరియు ఇన్వెస్ట్‌మెంట్ కేంద్రంగా మారనుంది.


భవిష్యత్తులో ఈ భారీ ప్రాజెక్ట్ ఈ ప్రాంతాన్ని ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు, వ్యాపార, వాణిజ్య రంగంలో అభివృద్ధి చెందే ప్రణాళిక.


పెట్టుబడి పెట్టాలనుకునే ఇన్వెస్టర్లు, ఆసక్తి కలవారు భవిష్యత్తు అవకాశంగా ఎలాంటి సందేహం లేదు.




SAMOOHA
PROJECTS
SANDIL APARTMENTS, H.NO. 4-50-P-11/55&56,
02ND FLOOR, JAYABHERI ENCLAVE,
BEHIND RADISSION HOTEL, GACHIBOWLI, HYDERABAD-500084
040-42613261 WHATS UP: 9989954333
INFO@SAMOOHAPROJECTS.COM
PLOTS | LANDS | INVESTMENTS


Sri Siddhi Vinayaka Cultural Center
SVCC Temple Fremont
40155 Blacow Rd, Fremont, CA 94538
(510) 403-4256
www.svcctemple.org/fremont
Weekdays: 9 am - 12 pm and 5:30 pm - 8:30 pm
Weekends: 9 am - 8:30 pm


లోకేష్ నేతృత్వంలో టీడీపీ వ్యవస్థాపకుడు
ఎన్టీఆర్ గారికి కోటి సభ్యత్వాలతో ఘననివాళి
సభ్యత్వ నమోదులో టీడీపీ సాధించిన రికార్డులు
మొత్తం సభ్యత్వాలు 1,00,00,000+ (10.05 మిలియన్లు)
11 నియోజకవర్గాల్లో లక్ష మార్క్ ను దాటి సభ్యత్వాలు నమోదయ్యాయి
105 నియోజకవర్గాల్లో 50 వేల మార్క్ నుదాటి సభ్యత్వాలు నమోదయ్యాయి
కార్యకర్తల ప్రమాద బీమాను రూ.2 లక్షల నుంచి 5 లక్షలకు పెంచిన నారా లోకేష్
తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు.. సినీ, రాజకీయ రంగాలలో అద్వితీయ చరిత్రను సొంతం చేసుకున్న చరితార్థుడు, సంక్షేమ యుగానికి ఆద్యుడు.. తెలుగుజాతికి ఆరాధ్యుడు కీ.శే. నందమూరి తారక రామారావు గారి వర్ధంతి సందర్భంగా.. ఆ మహనీయుని స్మృతికి నివాళులు.




Printed & Published by **Sagar Doddapaneni** on Behalf of **Sampark Media**, USA
For Advts Send an Email To: ads@namasteandhra.Com, # 510-409-1309, Read E-Paper @www.namasteandhra.com